www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66
సంచిక : 195
శుక్రవారం 05-01-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

గుజరాత్‌కు కోరెగావ్ సెగ?!

రోడ్డెక్కిన దళితులు



- జాతీయ రహదారుల దిగ్బంధనం
- మధ్యప్రదేశ్‌లో బస్సుల విధ్వంసం
- మేవానీ, ఖలీద్‌పై పూనెలో కేసులు

అహ్మదాబాద్ : భీమాకోరెగావ్ దళితుల ఆగ్రహజ్వాల కార్చిచ్చులా మారింది. ఈ ఆందోళనలు తాజాగా గుజరాత్, మధ్యప్రదేశ్‌ను తాకాయి. ఎక్కడికక్కడ దళిత సంఘాలు నిరసనోద్యమాలు చేపట్టాయి. గుజరాత్‌లో దళితులు రగిలిపోతున్నారు. దళితుల ఆందోళనలపై బీజేపీ సర్కార్లు ఉక్కుపాదం మోపుతున్నాయి. దళిత నేతలపై కేసులు

- మిగతా 2 లో

గిరిజనులే టార్గెట్

నరసరావుపేటలో కిడ్నీ ముఠా రాకెట్



- కిడ్నీ రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు విక్రయాలు
- మార్ఫింగ్ ఫొటోలతో నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి...
- దళారుల ద్వారా తతంగం
- పరారీలో ఉన్న వెంకటేశ్వరనాయక్
- మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడి హస్తం ఉన్నట్లు ఆరోపణలు
- గుంటూరు ఆసుపత్రిపై పలు అనుమానాలు

విశాలాంధ్ర-గుంటూరుబ్యూరో/నరసరావుపేట: గుంటూరు జిల్లా నరసరావుపేటలో గురువారం వెలుగులోకి వచ్చిన కిడ్నీ వ్యాపారం సంచలనం సృష్టిస్తున్నది . ఈ రాకెట్‌లో వెల్లడవుతున్న వివరాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. గిరిజన తండాలలోని గిరిజనుల పేదరికం, నిరక్షరాస్యతే పెట్టుబడిగా వారి కిడ్నీలతో వ్యాపారం చేస్తూ కొందరు లక్షలు గడిస్తున్నారు. మార్ఫింగ్ ఫొటోలతో నకిలీ ఆధార్‌కార్డులు సృష్టించి రెవెన్యూ వారు నుంచి అనుమతులు పొంది కిడ్నీ వ్యాపారం చేస్తున్నారు. ఇలా ఇప్పటికే ముగ్గురు కిడ్నీలు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈనేపథ్యంలో నకిలీ ఆధార్‌కార్డుతో అనుమతులు ఇచ్చినట్లు గుర్తించిన నరసరావుపేట తహసీల్దార్ తాము ఇచ్చిన అనుమతులను రద్దు చేయడంతోపాటు దీనిలో ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ముఠాలో రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిలవాయి విజయ్‌కుమార్ హస్తం ఉన్నట్లు నరసరావుపేట తహశీల్దార్ స్వయంగా ఆరోపించడం కలకలం రేపుతుంది. ఒక్కొక్క కిడ్నీ రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు విక్రయించి దళారులు దండుకుంటున్నట్లు పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో నరసరావుపేట పోలీసులు దీనిపై దర్యాప్తు ఆరంభించారు.

కిడ్నీల వ్యాపారం ఇలా...

గుంటూరు జిల్లా నరసరావుపేటలో గత కొంతకాలంగా జరుగుతున్న కిడ్నీ వ్యాపారం గురువారం వెలుగులోకి వచ్చింది. ఒకరిపేరుమీద ఉన్న ఆధార్‌కార్డుతో ఫొటోలు మార్ఫింగ్ చేసి నకిలీ ఆధార్‌కార్డులు సృష్టిస్తున్నారు. అనంతరం వాటి ఆధారంతో రెవెన్యూ, పోలీసు నుంచి అనుమతులు తీసుకుని కిడ్నీలు ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తున్నారు. జిల్లాలోని దుర్గి మండలం ముటుకూరు తండాకు చెందిన మూడావత్ వెంకటేశ్వనాయక్‌కు సంబంధించిన కిడ్నీని తొలగించి గుంటూరుకు చెందిన చిగురుపాటి శివనాగేశ్వరరావుకు అమర్చేందుకు నరసరావుపేటకు చెందిన దళారి రావూరి రవిచౌదరి ఆసుపత్రి వైద్యులతో లక్షల్లో బేరం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అయితే నిబంధనల ప్రకారం కిడ్నీని దానంగా ఇచ్చే వ్యక్తి సంబంధిత రోగికి బంధువై ఉండాలి. ఈ విషయాన్ని రవెన్యూ అధికారులు ధృవీకరించాలి. లేదా ఇతరులు ఎవరైనా కిడ్నీదానం చేస్తామంటే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీతో ఆమోదం పొందాలి. కాగా గుంటూరులోని

- మిగతా 2 లో

కోడి పందేలకు హైకోర్టు బ్రేక్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో కోడి పందేలకు రాష్ట్ర హైకోర్టు బ్రేక్ వేసింది. ఎట్టి పరిస్థితిలోనూ కోడి పందేలు నిర్వహించకూడదని స్పష్టం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత యేడాది ఆదేశించినా ఎందుకు అమలు జరపలేదంటూ నిలదీసింది. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం మరోమారు ఆదేశించింది. పశ్చిమగోదావరి జిల్లాలో కోడిపందేలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఆదేశాలు జారీ చేయాలన్న ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతేదాది తాము ఆదేశాలు ఇచ్చినప్పటికీ కోడి పందేలను అడ్డుకోలేకపోయారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొంది. గత సంక్రాంతి సందర్భంగా జరిగిన ఉల్లంఘనలపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలంటూ ఇటీవల ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. దానిపై గురువారం ప్రభుత్వం ఒక నివేదికను కోర్టుకు సమర్పించింది. గతేదాది జరిగిన ఉల్లంఘనలకు సంబంధించి 43 మంది తహసీల్దార్లు, 49మంది పోలీసు అధికారులకు సంజాయిషీ నోటీసులు ఇచ్చినట్లు నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. అయితే షోకాజ్ నోటీసుల తర్వాత ఎలాంటి

- మిగతా 2 లో

రాష్ట్రానికి లక్ష ఇళ్లు

- నిర్మాణ వ్యయం రూ.3,604.20 కోట్లు
- 84 పట్టణాలకు కేంద్రం ఆమోదం
- ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్ కింద నిర్మాణం

11 లో

త్వరలో చాక్లెట్ రంగులో రూ.10నోట్లు

- ఆర్బీఐ నిర్ణయం

2 లో

ఇంటర్ ప్రీ ఫైనల్ తేదీల మార్పు

- సంక్రాంతి సెలవులు పొడిగింపు

2 లో

భారత్‌కు టెస్టు

- కేప్‌టౌన్ వేదికగా భారత్ - దక్షిణాఫ్రికాల మధ్య నేటి నుంచి టెస్టు

12 లో

కస్టడీకి నో...

- గజల్ శ్రీనివాస్‌కు ఊరట
- బెయిల్ నిరాకరణ



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : లైంగిక వేధింపుల కేసులో గజల్ శ్రీనివాస్ బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు కొట్టేసింది. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న పంజాగుట్ట పోలీసుల కౌంటర్ పిటిషన్‌ను కూడా తిరస్కరించింది. గజల్ శ్రీనివాస్‌కు ఈ నెల 12 వరకు జ్యుడిషియల్ రిమాండు విధించిన విషయం తెలిసిందే. అతడు ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నాడు. జైలు అధికారులు గజల్‌కు ఖైదీనెంబర్ 1327ను కేటాయించారు. గజల్ శ్రీనివాస్ తరపు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ వేశారు. వారం రోజుల పాటు కస్టడీకి ఇస్తే మరిన్ని విషయాలు బయటకి వస్తాయని, శ్రీనివాస్‌ను ఇంకా విచారించాల్సి ఉందని పంజాగుట్ట పోలీసులు కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. అదే సమయంలో అతనికి బెయిల్ ఇవ్వరాదని, ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేయడం, బాధితులను బెదిరించే అవకాశం ఉందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. బాధితురాలు సమర్పించిన వీడియోల ఆధారంగా విచారించామని, అనంతరం మరో 20 వీడియోలను బాధితురాలు సమర్పించిందని, వీటన్నింటిపైనా

- మిగతా 2 లో

శుభ్రత కోసం ఉద్యమిద్దాం

- కలెక్టర్లపై నిరసన దీక్ష చేస్తా
- అగ్రిగోల్డ్ బాధితులకు త్వరలో న్యాయం
- సిక్కోలు 5వ విడత జన్మభూమిలో సీఎం చంద్రబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం: రాష్ట్ర అభివృద్ధి ప్రజల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ఉద్యమించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగిన 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో గురువారం సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మరుగుదొడ్ల పూర్తి నిర్మాణంలో కృష్ణ, పశ్చిమ, తూర్పు గోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు విజయవంతమయ్యాయని, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం వెనుకంజలో ఉన్నాయని పేర్కొన్నారు. వెనుకంజలో ఉన్న వాటిలో శ్రీకాకుళం జిల్లా 3వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. వెనుకబడ్డ జిల్లాలపై సమీక్షిస్తానని అక్కడి కలెక్టర్‌లపై నిరసనగా ఒక్కరోజు నిరాహార దీక్ష చేస్తానని నవ్వుతూ పేర్కొన్నారు. సమాజంలో మహిళల ఆత్మగౌరవానికి ఆటంకం కలగకుండా చూడాలన్నదే ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. రోడ్లపై మలవిసర్జన అనే దురాచారాన్ని

- మిగతా 11 లో

ఇదీ లోకం!



భయపడొద్దు.. అండగా ఉంటాం....


బాధితులతో మాట్లాడుతున్న రామకృష్ణ

- నక్కలదిన్నె బాధిత దళిత కుటుంబాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ భరోసా

2 లో

ఉత్తర కొరియా గురి తప్పింది



ప్యాంగ్యాంగ్ : వరుసగా క్షిపణి, అణు ప్రయోగాలు చేస్తున్న ఉత్తర కొరియా.. 2017 ఏప్రిల్‌లో పొరపాటుగా తమ నగరంపైనే క్షిపణిని ప్రయోగించిందట. ఈ విషయాన్ని అమెరికాకి చెందిన ఓ అధికారి 'ది డిప్లొమాట్' అనే ఆంగ్ల పత్రికకు వెల్లడించారు. ఇటీవల ఉ.కొరియా హ్వసాంగ్-12 అనే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిందట. సాంకేతిక లోపం కారణంగా ఆ క్షిపణి ఉ.కొరియాలోని టోక్చోన్ అనే నగరం మీదుగా దూసుకెళ్లిందట. ఆ నగరంలో సుమారు రెండు లక్షల మంది జనాభా ఉన్నారు. ఉ.కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌కి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎయిర్ ఫీల్డ్ నుంచి కొరియా ఈ క్షిపణిని ప్రయోగించిందట. దాంతో ఆ నగరంలోని వ్యవసాయ క్షేత్రాలు, భవనాలు కుప్పకూలిపోయినట్లు శాటిలైట్ దృశ్యాల్లో కన్పించింది. అయితే క్షిపణి ప్రయోగం కారణంగా టోక్చోన్‌లో ఎలాంటి ప్రాణ హాని జరగలేదు. ఎలాగూ క్షిపణి విఫలమైందని తెలియడంతో అమెరికా ప్రభుత్వం దీని గురించి చర్చించలేదు. ఒకవేళ క్షిపణి విజయవంతమై ఉంటే జపాన్ మీదుగా దూసుకెళ్లేది. ఉ.కొరియా 2017 ఆగస్టు, నవంబరులో రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. మరో రెండు వారాల్లో ఉ.కొరియా మరో క్షిపణిని ప్రయోగించే అవకాశం ఉన్నట్లు అమెరికన్ ప్రతినిధులు తెలిపారు.

31న సంపూర్ణ 'బ్లూ మూన్' గ్రహణం



వాషింగ్టన్ : ఆకాశంలో ఈ నెల 31న అరుదైన దృశ్యం ఆవిష్కృతమవ్వనుంది. ఒకే నెలలో రెండోసారి కనిపించే నిండు చంద్రుడు(బ్లూ మూన్) సంపూర్ణంగా గ్రహణ ప్రభావానికి గురికానున్నాడు. ఇలా బ్లూ మూన్ సంపూర్ణ గ్రహణం ఏర్పడనుండటం గత 150 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. చివరిసారిగా 1866 మార్చి 31న ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. అలస్కా, హవాయి, వాయువ్య కెనడా ప్రజలు సంపూర్ణ బ్లూ మూన్ గ్రహణాన్ని ప్రారంభం నుంచి అంతం వరకు పూర్తిగా వీక్షించవచ్చు. మొత్తం 77 నిమిషాలపాటు ఈ ఖగోళ పరిణామం కనువిందు చేస్తుంది.

విశాలాంధ్ర ప్రపంచం

కార్మిక హక్కుల పరిరక్షణ కోసం

స్వతంత్ర రాజకీయ పోరాటాలు

ఆస్ట్రియా లేబర్ పార్టీ కేంద్ర కమిటీ పిలుపు

దోపిడీ రహిత సమాజ సాధనే ధ్యేయం

కార్మిక హక్కుల పరిరక్షణ కోసం స్వతంత్ర రాజకీయ పోరాటాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆస్ట్రియా లేబర్‌పార్టీ కేంద్ర కమిటీ పిలుపు ఇచ్చింది. ఆస్ట్రియా కొత్త ప్రభుత్వం నుంచి ఎంతో కష్టపడి సాధించుకున్న ప్రజాతంత్రహక్కులకూ ముప్పువాటిల్లే ప్రమాదముందని ఒక ప్రకటనలో హెచ్చరించింది. ఆప్రకటన సారాంశం ఇలా ఉంది: ఆస్ట్రియన్ పీపుల్స్ పార్టీ(ఓవీపీ), ఆస్ట్రియా ఫ్రీడం పార్టీ (ఎఫ్‌పీఓ)ల మధ్య గత వారం జరిగిన సంకీర్ణ చర్చలు ఒక్క కార్మికులకే కాక మొత్తం ఆస్ట్రియా ప్రజలకూ నిరాశనే మిగిల్చాయి. దేశంలోని పెట్టుబడిదారులు బలపడేందుకే అవకాశాలు కనిపిస్తున్నాయి. బూర్జువా రాజకీయ పక్షాలకు చెందిన కొందరు తిరోగమనవాదులు కొత్త ప్రభుత్వంలో కీలక మంత్రిపదవులను దక్కించుకోగలిగారు. ఇవన్నీ దేశ కార్మిక, శ్రామికజన సంక్షేమానికి గొడ్డలి పెట్టు. కొత్త ప్రభుత్వం అమలు జరపాలనుకునే నిర్ణయాలు, సంస్కరణలు కార్మిక, శ్రామిక జనం సహా అత్యధిక జనాభా జీవన పరిస్థితులనే కుంగదీస్తాయి. రోజుకు 12గంటల పని, వారానికి 60గంటలు పని చేయాలన్న నిర్ణయాలు ఇందుకు ఉపకరించేవే. శరణార్థి విధానంలో లోపభూయిష్ట నిబంధనలు సామాజిక ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకే ఉపయోగపడతాయి. దేశ అభివృద్ధికి ఇవి ఆటంకం కలిగిస్తాయి. ప్రయోజనాలకు కోత పడుతుంది. ఆశ్రయం కోరే మానవహక్కు పూర్తి రద్దుకాగల ప్రమాదంలో పడింది. ఈక్రమంలో కార్మిక లోకం సమస్యల పరిష్కారం కావడం సందేహాస్పదమే అవుతుంది.

ఇక అంతర్జాతీయ సంబంధాల విషయానికి వస్తే మునుపటి ప్రభుత్వం అనుసరించిన విధానంలోనే కొత్త ప్రభుత్వమూ అనుసరించే సూచనలు కనిపిస్తున్నాయి. ఫలితంగా, ఐరోపా కూటమి (ఈయూ)లో ఆస్ట్రియా అస్తిత్వం ప్రశ్నార్థకం కాగల ప్రమాదముంది. మరో కోణంలో సామ్రాజ్యవాద కూటములు బలపడేందుకు దోహదకారి అవుతోంది. ఆస్ట్రియా ప్రయోజనాల కోసం తటస్థంగా వ్యవహరించాలన్న వాదన ఎపుడో డొల్లబోయింది. ఈయూ, నాటో మిలటరీ బలగాలు బలోపేతం అయ్యే ప్రమాదమూ ఉంది. పశ్చిమ దేశాల బాటలో నడవాలన్న ప్రభుత్వ యోచన కారణంగా మిలటరీ వ్యయం పెరిగే ప్రమాదముంది.

ప్రభుత్వం అనుసరించే కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాల ప్రతిఘటనలు అట్టడుగు స్థాయి ప్రజానీకం నుంచే మొదలవుతాయి. పాలక పక్షంలోని బూర్జువా పార్టీల కలయిక తమ స్వీయప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రజానీకంలో నిరాశ, కోపోద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు వెనుకాడవు. ఈక్రమంలో కార్మిక పక్షంగా, అభ్యుదయ రాజకీయపార్టీగా ఆస్ట్రియా సోషల్ డెమొక్రాటిక్ పార్టీ నిలిచింది. బూర్జువా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సరైన ప్రత్యామ్నాయ ప్రతిపక్షంగా నిలుస్తోంది. తద్వారా అధికార బూర్జువా పాలనలో బందీలుగా చిక్కుకుపోయిన శ్రామికజనం కోసం పని చేయనుంది. కార్మిక సంఘాలు, ఉద్యమాల్లో దీని ప్రాధాన్యత వెల్లడవుతూనే వస్తోంది. ప్రజావ్యతిరేక ప్రభుత్వ నిర్ణయాలను నిరంతర ఉద్యమాల ద్వారానే నిలువరించవచ్చు. ఈ ఉద్యమాల్లో శ్రామిక జనం కార్మికులు ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంది. అన్ని స్థాయిల్లోని కార్మిక, శ్రామిక జనం పోరాటాల ఐక్యతకు కృషి చేయాల్సి ఉంది. విద్యార్థి,యువజన మహిళ ఉద్యమాల నిరంతర కొనసాగింపు ద్వారా సామ్రాజ్యవాద కూటమిపాలన కుటిలయత్నాలను నిలువరించగలుగుతాము. ఈక్రమంలో అధికార పక్షానికి నిజమైన ప్రత్యామ్నాయంగా ఆస్ట్రియా లేబర్ పార్టీ హామీదారుగా నిలుస్తోంది. కార్మిక, శ్రామిక జనం కష్టనష్టాల తొలగింపు కోసం వారికి అండగా నిలుస్తోంది. దేశీయ కార్మిక వర్గ సంక్షేమానికే కాక అంతర్జాతీయంగానూ కార్మిక పోరాటాలకు సంఘీభావం కూడగడుతోంది. భయం, పని భారం, నిరుద్యోగిత లేని సమాజం కోసం, ప్రతి ఒక్కరికి వైద్య సేవలు విద్య, సాంస్కృతిక వ్యవహారాలు లభ్యమయే సమాజం కోసం కట్టుబడి పని చేస్తుంది. దోపిడీ రహిత వ్యవస్థ నిర్మాణానికి, సాధన ధ్యేయంగా పాటు పడుతుంది. అందరి హక్కుల రక్షణ కోసం ఉద్యమాలు , పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మరో మారు గుర్తు చేస్తున్నాము.

అమెరికాలో ఎమిరేట్స్ ఎంబసీల మూసివేతకు లెబనాన్ డిమాండ్



బీరట్ : అమెరికాలోని అరబ్బు ఎంబసీలను తక్షణం మూసి వేయాలని లెబనాన్ డిమాండ్ చేసింది లెబనాన్ అధ్యక్షుడు నబీ బెరీ మాట్లాడుతూ ఆక్రమిత జెరూసలేంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన చట్టానికి ఈచర్య ద్వారా మొత్తం అరబ్బు సమాజం నిరసన తెలియజేయాలని డిమాండ్ చేశారు. వివిధ అరబ్బు దేశాల రాజధానుల పతనాన్ని కాంక్షించే జెరూసలేం హోదాను మారుస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. జెరూసేలం ఉదంతం తరువాత కూడా ఐక్యం కాలేక పోతే భవిష్యత్తులో మరే కారణం చేతనూ ఏకం కాలేమని ఆయన హెచ్చరించారు. గాజాలోని గురువారం నిర్వహించిన పాలస్తీనా లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో రికార్డు చేసిన బెరీ ప్రకటనను ప్రసారం చేశారు.

న్యూ జ్యుడీషియల్ అథారిటీలను ప్రారంభించిన ఇవో మొరేల్స్



లాపాజ్ : కొత్తగా ఎన్నికైన జ్యుడీషియల్ అథారిటీల ప్రమాణస్వీకార కార్యక్రమంలో బొలీవియా అధ్యక్షుడు ఇవో మొరేల్స్ పాల్గొన్నారు. డిసెంబరు 3న జరిగిన సాధారణ ఓటింగులో వీరు ఎన్నికైనారు. ప్రపంచంలో మరే దేశంలోనూ న్యాయాధికారులు/ న్యాయమూర్తులను ప్రజలే ఎన్నుకునే విధానం లేదని ఈ సందర్భంగా ప్రసంగించిన మొరేల్స్ గుర్తు చేశారు. ఈ విశిష్టత ఒక్క బొలీవియాలోనే ఉందన్నారు. 2018 నుంచి న్యాయవ్యవస్థ పనులను ఎన్నికైన న్యాయాధికారులు ప్రారంభిస్తారన్నారు. ప్రజలందరికి మంచి జరిగేలా, న్యాయం కోసం ఈ అధికారులు పని చేస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 52మంది అధికారులు ప్రమాణస్వీకారం చేశారు. సుప్రీంకోర్టు, ప్లూరినేషనల్ కాన్‌స్టిట్యూషనల్ కోర్టు, కౌన్సిల్ ఆఫ్ మెజిస్ట్రీ, అగ్రో-ఎన్విరాన్‌మెంటల్‌కోర్టుల్లో వివిధ స్థాయిల్లో వీరు విధులు నిర్వహిస్తారు.

జర్మనీలో సీడీయూ, ఎస్డీపీ సంకీర్ణం



బెర్లిన్ : జర్మనీ అధ్యక్షురాలు ఏంజిలా మెర్కల్ ప్రాతినిధ్యం వహించే క్రిస్టియన్ డెమొక్రాటిక్ యూనియన్ (సీడీయూ), మార్టిన్ షల్జ్ ప్రాతినిధ్యం వహించే సోషల్ డెమొక్రాటిక్ పార్టీల (ఎస్‌డీపీ) సంకీర్ణ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమైనట్లు భావిస్తున్నారు. గురువారం దీనికి సంబంధించి ఇరు పార్టీలు సంయుక్తంగా జారీ చేసిన ప్రకటనలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశాలున్న విషయాన్ని వెల్లడించారు. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి జనవరి ఏడు నుంచి సంప్రదింపులు మొదలవుతాయని ప్రకటన వెల్లడిస్తోంది. ఇందులో కుదిరే ఒప్పందాల ప్రాతిపదికగా పాలన ప్రక్రియ కొనసాగించాలని ఇరు పక్షాలు ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

గిరిజనులే టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

వేదాంత ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న శివనాగేశ్వరరావుకు తాను బంధువునంటూ, తన కిడ్నీని ఆయనకు దానం ఇచ్చేందుకు ఫ్యామిలీ మెంబర్, రెసిడెన్స్ సర్టిఫికెట్ల కోసం నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయంలో అర్జీ అందజేశారు. అయితే ఈ అర్జీని స్థానిక బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ స్వయంగా తహశీల్దార్‌తో ఫోన్‌లో సంప్రదించి డ్రైవర్ ద్వారా అందజేసినట్లు తహశీల్దార్ విజయజ్యోతికుమారి మీడియాకు తెలిపారు. ఇందుకు కారణం గుంటూరులోని వేదాంత ఆసుపత్రి నిర్వహకులు డాక్టర్ చింతా రామకృష్ణ కపలవాయి విజయ్‌కుమార్‌కు స్వయానా అల్లుడు. ఇదిలా ఉండగా తహశీల్దార్ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం అందజేసిన అర్జీలోని ఆధార్‌కార్డులో రావూరి రవిచౌదరి ఫొటోకు బదులు వెంకటేశ్వర్లు నాయక్‌కు ఫొటోను మార్ఫింగ్ చేసి అందజేశారు. యధాతథంగా తహశీల్దార్ కార్యాలయం సదరు సర్టిఫికెట్లను పరిశీలించినట్లు రికార్డుల్లో నమోదు చేసుకొని సర్టిఫికెట్‌ను జారీ చేశారు. కిడ్నీ మార్పిడికి సంబంధించిన ఈ సర్టిఫికెట్లను పోలీస్‌వారు కూడా ధృవీకరించాల్సి ఉంది. రెవెన్యూ కార్యాలయంలో గుట్టు చప్పుడు కాకుండా పని చేయించుకున్న దళారులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ధృవీకరణకు వెళ్లారు. పోలీసులు తమ వద్ద ఆధార్ బార్‌కోడింగ్ యాప్‌లో దరఖాస్తుదారుని పేరు, చిరునామాలను పరిశీలించగా అవి తప్పుడు ధృవీకరణ పత్రాలుగా తేలాయి. ఈ విషయాన్ని పోలీసులు తిరిగి తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించగా ఆత్మరక్షణలో పడ్డ తహశీల్దార్ విజయజ్యోతికుమారి ఈ విషయంలో సదరు అర్జీదారులపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. కాగా ఇప్పటికే నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం నుండి జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతోనే గుంటూరులోని ఒకప్రైవేటు ఆసుపత్రిలో ముగ్గురికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం నుండి వరుసగా సర్టిఫికెట్లు జారీ కావటం, గుంటూరులో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలోనే కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరగటంపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో సంచలనం కలిగించిన నకిలీ మందులు, వంట నూనెలు, పాలపొడితో పాటు పాలు, సబ్బులు, షాంపూలు, కొబ్బరిపొడి. పురుగుమందుల కేసులతో నరసరావుపేట పట్టణం అట్టుడికి పోతోంది. తాజాగా కిడ్నీ మార్పిడి సర్జరీలలో సైతం ఒకరిపేరుతో మరొకరి కిడ్నీలను సేకరించే శస్త్ర చికిత్సలకు సహకరించే వ్యాపారులు, దళారులకు నరసరావుపేట కేంద్రంగా మారటం సంచలనంగా మారింది. అమాయక గిరిజనుల కిడ్నీలతో వ్యాపారం చేస్తున్న బడా వ్యాపారులు, దళారులు, వారికి సహకరిస్తున్న అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మేము వేరొకరి నుంచి దానం స్వీకరించాం

రోగి బంధువు పి.అజయ్‌బాబు

రోగి చిగురుపాటి శివనాగేశ్వరరావుకు రెండు కిడ్నీలు పాడైనాయి. ఆయన నాకు దగ్గర బంధువు. దీంతో శివనాగేశ్వరరావు వద్దనే పనిచేస్తున్న దేవరాజుగొట్టు గోపి కిడ్నీ దానంగా ఇచ్చారు. విజయవాడ ఆసుపత్రిలో దాన్ని రోగికి అమర్చారు. మిగిలినవారు ఎవ్వరూ మాకు తెలియదు.

గుంటూరు వేదాంత ఆసుపత్రిపై అనుమానాలు

రోగి శివనాగేశ్వరావు తొలుత వేదాంత ఆసుపత్రిలోనే చికిత్స పొందటంతో గుంటూరులో ఉన్న వేదాంత ఆసుపత్రిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే సదరు రోగికి తాము చికిత్సమాత్రమే చేశామని ఆయనకు వేదాంతలో కిడ్నీమార్పిడి చేయలేదని వేదాంత ఆసుపత్రి ఎండీ డాక్టర్ చింతా వెంకటరామకృష్ణ విలేకర్లతో చెప్పారు. రోగి శివనాగేశ్వరరావుకు విజయవాడ ఆసుపత్రిలో కిడ్నీ మార్చారని తమకు మాత్రం ఎలాంటి సంబంధంలేదని వెల్లడించారు.

త్వరలో చాక్లెట్ రంగులో రూ.10 నోట్లు!

హైదరాబాద్: దేశంలో ఇప్పటికే రూ.2వేలు, రూ.500, రూ.200, రూ.50ల కొత్తనోట్లు సందడి చేస్తున్న సంగతి తెలిసిందే.ఈ జాబితాలోకి కొత్తగా రూ.10 నోటు చేరనుంది. త్వరలో చాక్లెట్ రంగుతో కూడిన కొత్త రూ.10 నోట్లను ప్రవేశపెట్టనుంది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. ఈ నోట్లపై గాంధీ బొమ్మతో పాటు ఒడిశాలోని ప్రముఖ కోణార్క్ సూర్య దేవాలయం గుర్తును కూడా అచ్చు వేయనుంది.

రూ.10 నోట్లలో ఈ మార్పులు చేయాల్సిందిగా ఆర్‌బీఐ గత వారమే నిర్ణయించినట్లు సమాచారం. 2005లో రూ.10 నోట్ల డిజైన్‌లో మార్పులు చేశారు. ఆ తరువాత మార్పు చేయడం ఇదే మొదటిసారి. 2017 ఆగస్టులో ఆర్‌బీఐ కొత్త రూ.50, రూ.200 నోట్లు ప్రవేశపెట్టింది. 2008-09 ఆర్థిక సంవత్సరంలో 195,000 నోట్లు ముద్రించిన ఆర్‌బీఐ 2015-2016 ఆర్థిక సంవత్సరంలో 632,000 నోట్లు ముద్రించింది.

రోడ్డెక్కిన దళితులు

(మొదటిపేజీ తరువాయి)

పెడుతున్నారు. గుజరాత్‌లో ఇటీవల గెలిచిన దళితనేత జిగ్నేస్ మేవానీ, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్‌పై పుణె పోలీసులు కేసు నమోదు చేయగా? ఆల్ ఇండియా నేషనల్ స్టూడెంట్ యూనియన్ సదస్సుకు అనుమతిని రద్దు చేశారు. మేవానీ, ఖలీద్ ముఖ్య అతిథులు కావటంతో ఈ సదస్సును ముంబై పోలీసులు అడ్డుకున్నారు. ఇలా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్‌ల్లో భీమాకోరెగావ్ మంటలు రగులుతున్నాయి. మరో వైపు భీమాకోరెగావ్ దళితులపై మితవాద సంస్థల దాడిని గురువారం రాజ్యసభ తీవ్రంగా ఖండించింది. మహారాష్ట్ర బంద్ విజయవంతం కావటంతో గుజరాత్‌లో దళిత సంఘాలు గురువారం రోడ్లపైకి వచ్చాయి. జునాగఢ్‌లోని మధురం బైపాస్ రోడ్డులో వందలాది మంది దళితులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఈ బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ స్థంభించింది. వందలాది వాహనాలు కిలోమీటర్ల మేరకు నిలిచిపోయాయి. అదే విధంగా మరో బృందం రాజ్‌కోట్ సోమనాథ్ జాతీయ రహదారిని దిగ్బంధనం చేసింది. కోరేగావ్ హింసకు కారకులపై చర్యలు తీసుకోవాలని, మేవానీ, ఖలీద్‌పై కేసులను ఎత్తివేయాలని డిమాండు చేశారు. దళితుల ఆందోళన ఉధృతం కావటంతో గుజరాత్ సర్కారు ముందస్తు చర్యలు చేపట్టింది. జునాగఢ్ డిపోలోని బస్సులన్నింటికి వర్క్‌షాప్‌నకు తరలించింది. ఇక మధ్య ప్రదేశ్‌లోనూ దళితులు ఆగ్రహంతో రగిలిపోయారు. బర్హాన్‌పూర్‌లో ప్రశాంతంగా రాస్తారోకో నిర్వహిస్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. దళితులను చెదరగొట్టారు. దీంతో ఆగ్రహంతో దళితులు దాడులకు దిగారు. 12 బస్సులను ధ్వంసం చేశారు. ఈ దాడిలో ఓ డ్రైవరు గాయపడగా ఆసుపత్రికి తరలించారు. వందలాది మంది దళితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇక మహారాష్ట్ర బంద్ సందర్భంగా? 16 కేసులను పోలీసులు నమోదు చేశారు. మహారాష్ట్ర పోలీసు యాక్ట్, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం, క్రిమినల్ ఎమెండ్‌మెండ్ యాక్ట్‌ల ప్రకారం పలు సెక్షన్‌లతో కేసులు నమోదు చేశారు. భీమాకోరెగావ్‌లో హింసకు కారణమైన హిందోన్మాద నేతలు శంభాజీ భిడే, మిలింద్ ఏక్‌బోటేపై పుణె పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

మేవానీ, ఖలీద్‌పై కేసు?!

గుజరాత్ దళితనేత, ఎమ్మెల్యే జిగ్నేస్ మేవానీ, జేఎన్‌యూ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్‌పై పుణె పోలీసులు కేసు నమోదు చేశారు. జనవరి 1ను పుణెలో ది ఎలిగర్ పరిషత్ ఏర్పాటు చేసిన కోరెగావ్ ద్విశత వార్షికోత్సవ సభకు వీరిద్దరూ హాజరయ్యారు. ఐతే, వీరిద్దరూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని హిందోన్మాదులు ఫిర్యాదు చేయటంతో పుణె పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీ 153 ఏ, 505, 117 సెక్షన్ల ప్రకారం వీరిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ అప్పాసాహెబ్ షెవాలే తెలిపారు.

హైకోర్టు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకున్నారో ఈనెల 22వ తేదీలోగా తెలపాలని ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కోడి పందేలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరించాయని, విశాఖ జిల్లాతో పాటు మరి కొన్ని ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసుకొని మరీ పందేలకు హాజరవుతున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఏదాది కోడి పందేలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి తరపున అడ్వొకేట్ జనరల్ ఉన్నత న్యాయస్థానానికి హామీ ఇచ్చారు. ఎజి హామీని నమోదు చేసిన హైకోర్టు కోడిపందేలు జరగడానికి వీల్లేదని, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

భయపడొద్దు.. అండగా ఉంటాం

త్వరలో విజయవాడలో సమావేశం : రామకృష్ణ

విశాలాంధ్ర-ఆళ్ళగడ్డ/రుద్రవరం (కర్నూలు) : 'మీరు ఎవ్వరికీ భయపడాల్సిన పని లేదు.. మీకు అండగా మేమున్నాం.. మీకు ఏ ఇబ్బంది వచ్చినా మాకు సమాచారం ఇవ్వండి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆళ్ళగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలోని బాధిత దళిత కుటుంబాలను ఆయన గురువారం సాయంత్రం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.భీమలింగప్ప, నంద్యాల నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్‌లతో కలిసి పరామర్శించారు. ముందుగా సంఘటనకు సంబంధించిన పూర్వాపరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు గద్గద స్వరంతో తమ భయాన్ని, ఆందోళనను, బాధను వివరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భారత దేశంలోని హిందూ మతంలో అంటరానితనం ఉందన్నారు. అంటరానితనం కష్టజీవుల్లో చీలికలు తెస్తోందన్నారు. ప్రస్తుతం నక్కలదిన్నె సంఘటన గతంలో పశ్చిమ గోదావరిలోని గరగపర్రు సంఘటనను గుర్తు చేస్తోందన్నారు. నక్కలదిన్నె గ్రామంలోని దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వారికి కఠిన శిక్షలు విధించాలని ఆయన డిమాండు చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శుక్రవారం లేఖ రాస్తామన్నారు. అలాగే నక్కలదిన్నె బాధితులకు మద్దతుగా సంఘీభావం తెలిపే విధంగా విజయవాడలో శనివారం ప్రజా, దళిత సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంఘటనను దేశవ్యాప్తంగా తెలిసేలా చేస్తామన్నారు. బాధితులు గట్టిగా నిలబడాలని అందుకు పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తామని రామకృష్ణ పేర్కొన్నారు.

నక్కలదిన్నె బాధితులను విజయవాడకు తీసుకొని రావాలని స్థానిక సీపీఐ నాయకుడు భాస్కర్‌ను ఆదేశించారు. దేశంలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. అయితే దళితులందరూ ఏకమై ప్రతిఘటించాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో మహారాష్ట్రలో దళితులపై ఇలాగే జరిగితే రాష్ట్రం మొత్తం బంద్ నిర్వహించారన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇలా అన్యాయమైన సంఘటన జరిగినా నాయకులు పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. వెట్టి పని చేయలేదని గ్రామంలోని రైతులు దళితులను కూలీకి పిలవక పోవడం, నిత్యావసర వస్తువులు ఇవ్వకుండా చేయడం, నీటి సరఫరా నిలిపివేయడం దారుణమన్నారు. అధికారులు గ్రామానికి వచ్చి వెళ్ళాక కూడా కూరగాయలు అమ్మేవారు కాలనీకి రాకపోవడం, దళితులకు సంబంధించిన పొలాలను తీసుకోకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గంలో జరిగిన విషయంపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అఖిలప్రియతో మాట్లాడతామన్నారు. బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించి ఉండాల్సిందన్నారు. బహిష్కరణకు గురైన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సదుపాయాలు అందించేలా కృషి చేస్తామన్నారు. దళితులకు అండగా ఎవరూ లేరని భయపడాల్సిన పని లేదని మీకు అండగా మేమున్నామని అవసరమైతే పోరాటం చేస్తామని ఆయన వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీపీఐ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి చౌడప్ప, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాముడు, న్యాయవాది ఓబులేసు, ఏఐఎస్ఎఫ్ నంద్యాల డివిజన్ కార్యదర్శి ధనుంజయుడు, ఆళ్ళగడ్డ ఏఐటీయూసీ నాయకులు తులసిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రీ-ఫైనల్ తేదీల మార్పు

- విద్యార్థులు విధిగా హాజరుకావాలని ఆదేశం
- ఇంజనీరింగ్, వైద్య విద్యార్థులకూ మెసేజీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జన్మభూమి కార్యక్రమం విద్యార్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.జన్మభూమిలో విద్యార్థుల్ని భాగస్వాముల్ని చేయాలని రాష్ట్ర ఉన్నత, ఇంటర్మీడియట్ శాఖాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.ఈ నెల 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ 13 జిల్లాల్లో జన్మభూమి కొనసాగనుంది.గురువారం ఇంజనీరింగ్, వైద్యవిద్యార్థులకూ మెస్సేజ్‌లు వెళ్లాయి.దీంతో హడావుడీగా విద్యార్థులంతా జన్మభూమికి తరలివెళ్లారు.అటు జన్మభూమిలో ఇంటర్ విద్యార్థుల్ని తప్పనిసరి చేసేందుకుగాను ప్రీ-ఫైనల్-1 పరీక్షలను ప్రభుత్వం రీ-షెడ్యూలు చేసింది.జనవరి 7 నుంచి 16వరకూ ఇంటర్మీడియట్ బోర్డు సంక్రాంతి సెలవులను ప్రకటించిన విషయం విదితమే.ఈ సెలవులను ఈ నెల 12 నుంచి 30వ తేదీకి పొడిగించారు.19వ తేదీ నుంచి 25వరకూ జరగాల్సిన ప్రీ-ఫైనల్-1 పరీక్షలను వాయిదా వేశారు.ఈ పరీక్షలను 22 నుంచి 25వరకు, 30, 31 తేదీల్లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.26న గణతంత్ర దినోత్సవం, 27న ఎథిక్స్ పరీక్ష, 28న ఆదివారం, 29న ఎన్విరాన్‌మెంటల్ పరీక్షలున్నాయి.ఈ నాలుగు రోజుల్లో ప్రీ-ఫైనల్ పరీక్షలు నిర్వహించొద్దని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్రంలోని ఆర్ఐవోలు,అన్ని ప్రభుత్వ,ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు గురువారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి బి.ఉదయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.పరీక్షల సమయంలో విద్యార్థులను జన్మభూమి సభలకు తరలించడంపై వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అటు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇంజనీరింగ్, వైద్యకళాశాలల విద్యార్థులు గురువారం జన్మభూమి సభలకు హడావుడీగా హాజరయ్యారు.

కస్టడీకి నో...

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస్‌ను విచారించాల్సి ఉందని, అందువలన వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని ఆ కౌంటర్‌లో పేర్కొన్నారు. పోలీసు కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని, శ్రీనివాస్ పేరు ప్రతిష్టలు గల వ్యక్తి అని, ఆయన ఎక్కడికి పారిపోరని, అందువలన బెయిల్ మంజూరు చేయాలని, పోలీసు కస్టడీకి పంపరాదని శ్రీనివాస్ తరపు న్యాయవాది ఉమామహేశ్వరరావు కోరారు. కుట్రపూరితంగానే పోలీసులు అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు పోలీసు కస్టడీని, బెయిల్ ఇచ్చేందుకు తిరస్కరించింది.

పొగాకు రైతులకు మద్దతు ధర ఇవ్వండి

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : లాభదాయకంగా పొగాకు సాగు చేస్తున్న వారికి మంచి ధర ఇవ్వాలని కోరుతూ గోదావరి జిల్లాల రైతులు గురువారం న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభును కలిసి వినతి పత్రం సమర్పించారు. తెలుగుదేశం పార్టీ ఎంపీలు రాయపాటి సాంబశివరావు, మురళీ మోహన్, మాగంటి బాబు, తోట నర్సింహం, గల్లా జయదేవ్, కొత్త పల్లి గీత, బిజెపి ఎంపీ హరిబాబుల బృందం రైతులను తమ వెంట తీసుకుని కేంద్ర మంత్రి సురేష్ ప్రభును కలిశారు. నష్టాల్లో ఉన్న రైతుల పొగాకు బ్యారన్లు తొలగించేందుకు అనుమతి ఇవ్వడం తోపాటు రూ.10లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.

'అమరావతి'పై ఫిబ్రవరిలో మేథోమథనం

సమీక్షలో సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాజధాని అమరావతి నగరం అందరికీ అనువైన నివాసయోగ్యమైనదిగా తీర్చిదిద్దే క్రమంలో ఫిబ్రవరి మొదటి వారంలో రెండ్రోజులపాటు జరిగే వర్క్‌షాప్‌లో మేథోమథనం జరపాలని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. అమరావతి డీప్‌డైవ్ వర్క్‌షాప్‌లో వచ్చిన సూచనలు, సలహాలపై గురువారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి నివాస యోగ్యమైన నగరంగా రూపొందించేందుకు ప్రాథమిక దశలోనే ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలన్నారు. డీప్‌డైవ్‌లో వచ్చిన సలహాలను అమలు చేయడానికి 6 నెలల్లో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పౌర రవాణా విధానంతో పాటు గృహనిర్మాణం, విద్య తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. అలాగే వాటర్‌ప్లాన్, ఫ్లడ్‌మేనేజిమెంట్ అంశాలపై కూడా సమీక్షించారు. నగరమంతా ఒకే విధమైన డిజైన్‌లో సైనేజెస్, నెంబరింగ్, మార్కింగ్, ప్లాంటేషన్, సెట్‌బ్యాక్ స్టాండర్డ్స్ ఉండాలన్నారు. స్పెషల్ కమిషనర్ వి రామమోహనరావు మాట్లాడుతూ డీప్‌డైవ్‌లో వచ్చిన సలహాలను జోనల్ స్థాయిలో పొందుపరచి మాస్టర్‌ప్లాన్ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సగిలి షణ్మోహన్, వివిధ విభాగాల డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంస్థాగత ఎన్నికలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ఆధ్వర్యాన శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో యువజన కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికలను ప్రారంభిస్తారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎన్.రఘువీరారెడ్డి, అఖిలభారత యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొంటారు.



పురుగుమందు డబ్బాలతో జన్మభూమికి వచ్చిన రైతులు

భూములు ఆన్‌లైన్ చేయలేదని
రైతులు ఆత్మహత్యాయత్నం

- కర్నూలు జిల్లా గోసానిపల్లె జన్మభూమి గ్రామసభలో ఘటన
- అడ్డుకున్న పోలీసులు.. పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-డోన్(కర్నూలు) : అనుభవంలో ఉన్న తమ భూములను ఆన్‌లైన్ చేయాలన్న విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆత్మహత్యకు ప్రయత్నించారు. కర్నూలు జిల్లా డోన్ మండలం పరిధిలోని గోసానిపల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన జన్మభూమి సభలో ఈ ఘటన చోటుచేసుకుంది. తమకు ఆత్మహత్యే శరణ్యమంటూ రైతులు పురుగుల మందు డబ్బాలతో గ్రామ సభకు మూకుమ్మడిగా వచ్చేశారు. వివరాల్లోకి వెళితే.. గోసానిపల్లెలో 5వ విడత జన్మభూమి కార్యక్రమానికి స్పెషలాఫీసర్ రాఘవరెడ్డి, తహశీల్దార్ మునిక్రిష్ణయ్య, ఈవోఆర్డీ మణిమంజరితో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని, అందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జన్మభూమి కార్యక్రమం చేపట్టిందని అధికారులు ఉపన్యాసాలు అందుకున్నారు. అయితే ఆదిలోనే ప్రజల నుంచి విమర్శలు వెలువడ్డాయి. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు లేక తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని మొరపెట్టుకున్నారు. అంతలోనే గ్రామానికి చెందిన రంగస్వామి, శ్రీనివాసులు, లక్ష్మిదేవి, బాబయ్య, లక్ష్మీదేవి అక్కడికి చేరుకున్నారు. తమకు 80 సంవత్సరాల క్రితం నుంచి 958 సర్వే నెంబరులో 3.33 సెంట్లు భూమి అనుభవంలో ఉందని, ఆన్‌లైన్‌లో ఎక్కించాలని తహశీల్దార్‌ను కోరగా సర్వే చేయించుకోవాలని సూచించారని, 2016 మే నెలలో సర్వే చేయించుకున్నామన్నారు. సర్వే నెంబరు 959/బి2లో అనుభవంలో ఉన్నామని సర్వేయర్ ఫీల్డ్ మ్యాప్‌ను అందజేశారన్నారు. అయితే అధికారులు ఆన్‌లైన్‌లో చేయకుండా తిప్పుకుంటున్నరన్నారు. సర్వే నెంబరు 959/బి2లో మొత్తం 9.33 సెంట్లు భూమి ఉండగా డోన్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. ప్రతి జన్మభూమి కార్యక్రమం, రెవెన్యూ సదస్సులు, ప్రజాదర్బార్‌లలో రెండేళ్ల నుంచి వినతులు అందజేస్తున్నా అధికారుల్లో చలనం రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవోకు విన్నవించా ఆన్‌లైన్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించిన ఫలితం లేదని పేర్కొన్నారు. తమకు ఆత్మహత్యే శరణ్యమని పురుగుల మందు డబ్బాలతో జన్మభూమికి మూకుమ్మడిగా విచ్చేశారు. ఇది గమనించిన పోలీసులు ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. అయితే రైతులు ఆత్మహత్యాయత్నం చేసినా రెవెన్యూ అధికారులు స్పందించలేదు. రైతులు జన్మభూమి కార్యక్రమానికి ఆధారాలతో వచ్చినా వాటిని పరిశీలించారే తప్ప పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు.

జన్మభూమి అంటే రాజకీయ సభలు కాదు

- అభివృద్ధి వేదికలుగా ఉపయోగించుకోవాలి
- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జన్మభూమి గ్రామసభలు అభివృద్ధి వేదికలే తప్ప రాజకీయ వేదికలు కాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రకరకాల వ్యక్తులు వేర్వేరు అజెండాలతో గ్రామసభలకు వస్తారంటూ, ఎవరు ఏ ఉద్దేశాలతో గ్రామసభలకు వచ్చినా మనం బాధ్యతతో వ్యవహరించాలని,సంయమనం పాటించాలని అధికారులకు సూచించారు.గురువారం తన నివాసం నుంచి 3వరోజు జన్మభూమి-మావూరు నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత జన్మభూమి కార్యక్రమాల్లో 1,89,171 రేషన్ కార్డులు కొత్తగా అందిస్తున్నామని,గతంలో ఆమోదం పొంది పంపిణీ చేయని మరో 57వేల కార్డులు కూడా అందజేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గానికి 2వేల చొప్పున 4లక్షల పెన్షన్లు కొత్తగా అందజేస్తున్నామని, పేదరికం, పెద్ద నియోజకవర్గాలను బట్టి మరో 50వేలు అదనంగా ఇస్తామంటూ, వీటితో కలిపి రాష్ట్రంలో పెన్షన్ లబ్ధిదారుల సంఖ్య 50లక్షల 50వేలకు చేరుతుందన్నారు. పెన్షన్లు,రేషన్ కార్డులు సంతృప్తి స్థాయికి వచ్చేదాకా అందజేస్తామన్నారు. ఇళ్ల స్థలాల కొరత దృష్ట్యా ఆయా ప్రాంతాల్లో 1 ప్లస్ 3 గృహ సముదాయాలకు మొగ్గు చూపాలని సూచించారు."ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి జన్మభూమి కన్నా మెరుగైన వేదికలేదు, ఇంతకన్నా మెరుగైన అవకాశం లేదు. ప్రజలను చైతన్యపరచడం చాలా కష్టం,కానీ ఒకసారి అలవాటు అయితే చైతన్యం మన సంస్కృతిలో భాగం అవుతుంది. ప్రజా చైతన్యం మన సంస్కృతిలో ఒక భాగం కావాలి. అప్పుడే అద్భుత ఫలితాలు సాధ్యం" అని ముఖ్యమంత్రి తెలిపారు.పశువైద్య శిబిరాల నిర్వహణపై ప్రజల్లో సంతృప్తి 50శాతం లోపే వుందని, ఆ శాఖాధికారులు,సిబ్బంది మరింత చురుకుగా పాల్గొని ప్రజల్లో సానుకూలత సాధించాలని సూచించారు. రెండవరోజు జన్మభూమిలో



ప్రజాభిప్రాయ సేకరణ వివరాలను ముఖ్యమంత్రి తెలియజేశారు.

జన్మభూమిలో మీరు పాల్గొన్నారా అంటే 47% అవునని,32% లేదని,21% జరగలేదని తెలిపారు. అధికారులంతా హాజరయ్యారా అంటే 90% అవునని, 10%లేదని తెలిపారు.వివిధ అంశాలపై అధికారులు అవగాహన కల్పించారా అన్న ప్రశ్నకు 72% అవునని, 22% లేదని, 6% తెలియదని చెప్పారు.అధికారుల స్పందన బాగుందా అని అడిగితే 54% అవునని,36% లేదని,10% తెలియదని పేర్కొన్నారు.సాధికార మిత్రలు పాల్గొన్నారా అన్న ప్రశ్నకు 48% అవునని,52% లేదని తెలిపారు. జన్మభూమిలో జరిగిన డిబేట్ అంశం అర్థమైందా అని అడిగితే 88% అవునని,12% లేదని జవాబిచ్చారు. పింఛన్లు అందరికీ అందుతున్నాయా అన్న ప్రశ్నకు 64% అవునని,36% లేదని తెలిపారు. రేషన్ కార్డులు అందరికీ ఉన్నాయా అన్న ప్రశ్నకు 65% అవునని,35% లేదని చెప్పారు. చంద్రన్న బీమా ఎలా జరుగుతోందన్న ప్రశ్నకు 63% బాగుందని,37% లేదని చెప్పారు. దీనిని బట్టి పింఛన్లు, రేషన్ కార్డులు ఇంకా ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లుగా తెలుస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. అర్జీల పరిష్కారం బాగుందా అన్న ప్రశ్నకు 48% అవునని, 52% లేదని జవాబిచ్చారు. దీనిని బట్టి ఫిర్యాదుల పరిష్కార వేగం మరింత పుంజుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



అవయవలోపం అవరోధం కారాదు

మంత్రి పరిటాల సునీత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జీవితంలో ఏదైనా సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటే దానికి అవయవలోపం అవరోధం కాబోదని స్త్రీ, శిశుసంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖల మంత్రి పరిటాల సునీత అన్నారు. గురువారం స్థానిక మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో అంధుల లిపి ప్రధాత సర్ లూయీ బ్రెయిలీ 209వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. అంధులకు లూయీ బ్రెయిలీ తనకు కళ్లు కనిపించడం లేదని ఒక్కరోజు కూడా బాధపడకుండా అందరికీ మోడల్‌గా ఉండే విధంగా బ్రెయిలీ లిపిని సృష్టించారన్నారు. కళ్లు లేని ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే అందరితో సమానంగా ల్యాప్‌టాప్‌లు అందిస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలకు సంబంధించిన ఫైల్స్‌ను త్వరలోనే కార్యదర్శితో సమీక్షించి సంక్రాంతి తర్వాత పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌జీవో సహకారంతో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన కృత్రిమ కాళ్లు, చేతులను మంత్రి అందించారు. అనంతరం మంత్రి ఐదుగురికి ల్యాప్‌టాప్‌లు అందించారు.విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఏపీలో అంధుల జనాభా 2,03,167 మంది ఉన్నారని, బ్యాక్‌లాగ్ ఖాళీలను ప్రభుత్వం మార్చి 2018 లోపు భర్తీ చేసే విధంగా సమయాన్ని పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కమిషనర్ కర్రి రాజ భౌమ హరి నారాయణ చక్రవర్తి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగ సంఘం అధ్యక్షులు కె.రవీంద్రబాబు, కార్యదర్శి సుబ్బయ్య, సెంట్రల్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నవరం, 13 జిల్లాల నుంచి విభిన్న ప్రతిభావంతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఎస్సీ సిలబస్‌పై కసరత్తు

- త్వరలో ఏపీపీఎస్సీకి అందజేత..!
- జిల్లాల వారీగా ఖాళీల సేకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ డీఎస్సీ సిలబస్ విధివిధానాల్ని త్వరలో ఏపీపీఎస్సీ కమిషన్ కార్యాలయానికి పంపేందుకు రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. డీఎస్సీ ద్వారా దాదాపు 14,494 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తామని మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇటీవల వెల్లడించిన విషయం విదితమే. డీఎస్సీకి ముందు టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పరీక్షలకు ప్రభుత్వం షెడ్యూలు ప్రకటించింది. అభ్యర్థుల విన్నపాలతో ఫిబ్రవరి 5కు ఈ పరీక్షలను వాయిదా వేసింది. టెట్ పరీక్షల పొడిగింపు ప్రభావం డీఎస్సీపై పడింది.సిలబస్ విధివిధానాల్ని రూపొందించే ప్రక్రియలో ప్రభుత్వం నిమగ్నమైంది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ పాఠ్యపుస్తకాల్లో తెలంగాణా ప్రాంతాల్లో ముడిపడిన కొన్ని అంశాలు కొనసాగుతున్నాయి. ఏపీకి చెందిన పాఠ్యాంశాల్ని తెలంగాణాలో తొలగించారు. ఉదాహరణకు.. 6 నుంచి 10 తరగతుల సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాలలో కాకతీయుల కాలం పాఠాలను ఏపీలో కొనసాగిస్తున్నారు. టెట్, డీఎస్సీ సిలబస్‌లో ఈ తరహా తెలంగాణా రాష్ట్రానికి చెందిన పాఠ్యాంశాలు ఉంచడంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. టెట్, డీఎస్సీ సిలబస్‌పై కొద్దిపాటి మార్పులు చేసే అవకాశముంది. డీఎస్సీ పరీక్షను ఏపీపీఎస్సీకి అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. 2012 డీఎస్సీని 80 మార్కులకు నిర్వహించారు. టెట్‌లో 20 మార్కులకు వెయిటేజీ ఇచ్చారు. అనంతరం టెట్ వెయిటేజీ+డీఎస్సీ మార్కులను కలిపి అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇదే తరహాగా 2018 డీఎస్సీ పేపర్‌ను సెటప్ చేసే అవకాశముంది. 80 మార్కుల డీఎస్సీకి మొత్తం 160 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకూ అర మార్కు కేటాయిస్తారు. అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్టుకు-60 మార్కులు (120 ప్రశ్నలు), జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్-10 మార్కులు(20 ప్రశ్నలు), విద్యాదృక్ప థాలు-10 మార్కులు(20 ప్రశ్నలు) ఉంటాయి. టెట్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి 15వ తేదీతో పూర్తవుతాయి. జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీల వివరాల సంఖ్య మాధ్యమిక విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి పూర్తిగా చేరాలి. మోడల్ పాఠశాలల్లో 1197 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 259 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. దీంతో మోడల్ స్కూళ్ల పోస్టుల ఖాళీలు తగ్గనున్నాయి. డీఎస్సీ, మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయ ఖాళీల వివరాలపై త్వరలో స్పష్టత రానుంది. విద్యాశాఖ నుంచి సిలబస్ అందిన వెంటనే డీఎస్సీ నిర్వహణకు ఏర్పాట్లు చేపడతామని ఏపీపీఎస్సీ కమిషన్ ఉదయ్‌భాస్కర్ ఇటీవల ప్రకటించారు. డీఎస్సీ పరీక్షను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహించే అంశంపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. ఏప్రిల్-మే మధ్యలో డీఎస్సీ పరీక్షలు కొనసాగే అవకాశముంది.

డీజీపీల వార్షిక సమావేశానికి మాలకొండయ్య, ద్వారకా తిరుమలరావు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : మధ్యప్రదేశ్‌లోని బీఎస్ఎఫ్ అకాడమీలో ఈ నెల ఆరో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు జరగనున్న పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీపీ)ల వార్షిక సమావేశానికి డీజీపీ ఎం మాలకొండయ్య, సీఐడీ అదనపు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు వెళ్లనున్నారు. వీరిద్దరూ ఆ సమావేశానికి వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దేశంలో పోలీసుశాఖ ఎదుర్కొంటున్న సవాళ్లు, విదేశాలలో ఉన్న నిందితులను పట్టుకోవటంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించనున్నారు. రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై డీజీపీ మాలకొండయ్య, అదనపు డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆ సమావేశంలో ప్రస్తావించనున్నారు.

17న మంత్రి మండలి సమావేశం

విశాలాంధ్ర-అమరావతి : ఈ నెల 17న సాయంత్రం 3 గంటలకు మంత్రి మండలి సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు సచివాలయ నియమ నిబంధనలను అనుసరించి సమయానికి ప్రతిపాదనలు పంపాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.

18, 19 తేదీల్లో కలెక్టర్ల సమావేశం

విశాలాంధ్ర-అమరావతి : ఈ నెల 18, 19 తేదీల్లో రెండు రోజులు కలెక్టర్ల సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) డాక్టర్ మన్మోహన్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి తమతో పాటు హాజరుకావలసిన అవసరం ఉన్న శాఖాధిపతులను మాత్రమే ఆహ్వానించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులను ఆయన కోరారు. కాగా ఈసారి జరగనున్న కలెక్టర్ల సమావేశం తొలిసారిగా సచివాలయం లోని 5వ బ్లాక్ పై అంతస్తులోని సమావేశమందిరంలో జరగనుంది. గతంలో కలెక్టర్ల సమావేశాలు విజయవాడలోని ప్రైవేటు సమావేశ మందిరాలలో జరిగేవి. ఇక నుంచి రాష్ట్రస్థాయి సమావేశాలన్నీ సచివాలయంలోనే నిర్వహించేందుకు అను వుగా 5వ బ్లాక్‌లోని పై అంతస్తులో సమావేశ మందిరాన్ని తీర్చిదిద్దారు. తొలిసారిగా రెండు రోజులపాటు జిల్లా కలెక్టర్ల సమావేశం జరగనుంది.

రేపు విజయవాడలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో 'దళితులపై దాడులకు అంతం లేదా' అంశంపై రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, బుట్టి రాయప్ప తెలిపారు. ఈ మేరకు గురువారం వారు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. దళితులపై దాడుల్లో రాష్ట్రం నాలుగో స్థానం ఉందన్నారు. రాష్ట్రం ఏ రంగంలోనూ అభివృద్ధి చెందకపోగా, దళితులపై దాడుల్లో మాత్రం ఏటా అభివృద్ధి చెందుతూనే ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 2014 సంవత్సరంలో 2,113, 2015లో 2,263, 2016లో 2,235 కేసులు నమోదైనట్టు వారు వివరించారు. గత మూడేళ్లలో 6,711 కేసులు నమోదు కాగా కేవలం 918 మందినే అరెస్టు చేశారని అన్నారు. గరగపర్రు, దేవరపల్లి, జెర్రిపోతులపాలెం ఘటనలు మరువకముందే నక్కలదిన్నెలో ఎస్సీలను బహిష్కరించడం దారుణమన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి దళిత సమాజానికి సమాధానం చెప్పాలని వారు డిమాండు చేశారు. విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును దళితులు జయప్రదం చేయాలని నేతలు విజ్ఞప్తి చేశారు.

దళితులపై దాడులకు సమాధానం చెప్పాలి

ఏపీ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : దేశవ్యాప్తంగా దళితులపై బీజేపీ, ఆరెస్సెస్, భజరంగదళ్‌లు దాడులకు పాల్పడుతున్నాయని, దీనిపై ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఏపీ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ డిమాండు చేశారు. మహారాష్ట్రలోని కొరెగాన్‌లో దళితులపై దాడులకు నిరసనగా పీసీసీ ఆధ్వర్యంలో గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రం దగ్గర గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సుంకర మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వ అండదండలతోనే రోజురోజుకూ దళితులపై దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.ఈ నిరసనలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు, అధికార ప్రతినిధి వి.గున్నాథం, వెన్నా రమేష్ పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలేశారు.

పీసీసీ మేథావుల విభాగానికి ఆరుగురు సభ్యులు

మేథావుల విభాగం రాష్ట్ర చైర్మన్ మద్ది శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మేథావుల విభాగానికి ఆరుగురు సభ్యులను నియమించామని సంఘం రాష్ట్ర చైర్మన్ మద్ది శ్రీనివాస్ వెల్లడించారు.విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా ఆకుల భాగ్య లక్ష్మి-రాజమండ్రి, కో-ఆర్డినేటర్లుగా జిల్లేలమూడి నరసింహారావు-ఏలూరు, ఎ.వెంకటరెడ్డి-కర్నూలు, బోనుల మురళీకృష్ణ-విజయనగరం, టి.ఎన్.మారుతి భూపాల్-గుంటూరు-కార్యదర్శిగా డాక్టర్ జూపల్లి ప్రేమ్‌చంద్-అనంతపూర్‌లకు చోటు కల్పించామని వివరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభం తీసుకొచ్చేలా కమిటీ సభ్యులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధానిగా రాహుల్ గాంధీ ఎన్నికై తీరుతారని ఆయన జోశ్యం చెప్పారు.కాంగ్రెస్ కాపుసెల్ రాష్ట్ర అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు మట్లాడుతూ..పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ఆధ్వర్యాన 2019లో కాంగ్రెస్ విజయం దిశగా పయనించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉడా మాజీ చైర్మన్ పి.శ్రీనివాసరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి సూకల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి వి.గుర్నాథం, విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.

మైక్ లాక్కోవడమేనా అనుభవం

ఎంపీని ఎందుకు మాట్లాడనివ్వలేదు
చంద్రబాబుకు బొత్స సూటిప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : జన్మభూమి ప్రభుత్వ కార్యక్రమమని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు...ఆ సభా వేదికపైకి రౌడీలు, గూండాలను ఎందుకు ఎక్కించారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. కడప జిల్లా పులివెందులలో బుధవారం జరిగిన జన్మభూమి సభలో వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పట్ల టీడీపీ నేతలు, చంద్రబాబు ప్రవర్తించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో గురువారం బొత్స పత్రికల వారితో మాట్లాడుతూ జన్మభూమి సమావేశం పేరుతో అవినాష్‌రెడ్డిని గృహ నిర్బంధం చేయాలని పోలీసులు ప్రయత్నించారని, తరువాత సభకు వచ్చిన ఎంపీని మాట్లాడనివ్వకుండా చంద్రబాబు ప్రవర్తించారని, చేతిలో మైక్ లాక్కోవడం ఏమిటంటూ నిలదీశారు. ఇది ప్రజాస్వామ్యమా లేక నిరంకుశమా అని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు తాను మంత్రిగా పనిచేశానని, ముందుగా స్థానిక నాయకులతో మాట్లాడించాలని, ప్రోటోకాల్ పాటించాల్సిన అవసరం ఉందని బొత్స గుర్తు చేశారు. ఎంపీతో మాట్లాడించిన తరువాతే ముఖ్యమంత్రి మాట్లాడాలనేది ప్రోటోకాల్ అని, కానీ అందుకు విరుద్ధంగా చంద్రబాబు ప్రవర్తించారని బొత్స విమర్శించారు. అవినాష్‌రెడ్డి ఎవరినీ నిందించలేదని, దుర్భాషలాడలేదని, అలాంటిది ఆయన చేతిలో మైక్ ఎందుకు లాక్కున్నారంటూ బొత్స ప్రశ్నించారు. పైడిపాలెం ప్రాజెక్టు విలువ రూ.700 కోట్లు ఉంటే చంద్రబాబు కేవలం రూ.23 కోట్లే ఖర్చు చేశారని, గండిపేట ప్రాజెక్టుకు టీడీపీ ప్రభుత్వం నాలుగేళ్లల్లో ఖర్చు చేసింది కేవలం రూ.72 కోట్లే అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.1100 కోట్లు ఖర్చు చేశారని వేదికపై అవినాష్‌రెడ్డి గుర్తు చేయడం నేరమా అంటూ బొత్స ప్రశ్నించారు. వాస్తవాలు మాట్లాడితే ఎందుకు ఉలికిపాటంటూ ఆయన నిలదీశారు. ప్రజాప్రతినిధి చేతుల్లోంచి ఎవరైనా మైకు లాక్కుంటారా అనుభవజ్ఞులమని చెప్పుకుంటుంటారు... ఇదేనా మీ అనుభవం అంటూ ముఖ్యమంత్రిని బొత్స ప్రశ్నించారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో తాంత్రిక పూజలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండు చేశారు. అక్కడ ఏం జరిగిందో ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్పదంటూ ప్రశ్నించారు. జరిగినదానికి కనీసం పశ్చాతాపమైనా వ్యక్తం చేశారా అని బొత్స నిలదీశారు. జన్మభూమి సభావేదికపై ఉన్న రౌడీషీటర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.





ఎక్సైజ్‌శాఖలో పదోన్నతుల చిచ్చు

విశాలాంధ్ర అమరావతి : ఎక్సైజ్ కానిస్టేబుళ్ళ మధ్య పదోన్నతుల మధ్యవిభేదాలు నెలకొన్నాయి. మార్కులు, వయస్సు ఏది ప్రామాణికంగా పదోన్నతులకు తీసుకోవాలన్న విషయమై రెండు వర్గాలుగా కానిస్టేబుళ్ళు విడిపోయారు. ఎక్సైజ్‌శాఖ ఇటీవల జిల్లా అధికారులను ప్రతిభ ఆధారంగా వివరాలు సేకరించాలని ఆదేశించటంతో వివాదం మరింత ముదిరింది. ప్రతిభను ఆధారంగా పరిగణిస్తే గందరగోళం ఏర్పడుతుందని, కానిస్టేబుళ్ళు జిల్లాలు మారాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా అప్పట్లో ఉన్న సమాచారం సమగ్రంగా లేదని, కొందరికి ఇంటర్వ్యూలలో మార్కులే లేవని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో సమస్యను ఏ విధంగా పరిష్కరించాలనే దానిపై ఎక్సైజ్‌శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎక్సైజ్ కానిస్టేబుళ్ళకు 1995లో ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ ఉండేదికాదు. ఏపీఎస్పీ శిక్షణ పొందినవారినే ఎక్సైజ్‌లోకి తీసుకునేవారు. ఈ నేపథ్యంలో 1995లో ఏపీఎస్పీలో శిక్షణ పొందిన 2177 మంది కానిస్టేబుళ్ళను డిప్యుటేషన్ క్రింద ఎక్సైజ్‌శాఖలోకి 1996లో తీసుకున్నారు. ఆనాడు ఉన్న మద్య నిషేధం కార్యక్రమాన్ని అమలు చేసే బాధ్యతను వీరే చేసేవారు. 1997లో మద్య నిషేధం ఎత్తివేసినా వారిని అక్కడే కొనసాగించారు. అనంతరం 2009లో వెనక్కు పంపే అవకాశం కూడా లేకపోవటంతో ఆనాటి ప్రభుత్వం వారిని ఎక్సైజ్‌శాఖలో విలీనం చేసింది. అప్పటి నుంచి పదోన్నతుల విషయంలో రగడ ప్రారంభమైంది. అప్పటివరకు ఉన్న విధానం ప్రకారం డేటాఫ్ అపాయింట్‌మెంట్, వయస్సును పదోన్నతులకు ప్రాతిపదికన తీసుకునేవారు. అందరూ ఒకేసారి వీలీనమైన నేపథ్యంలో ఇక వయస్సే ప్రాధాన్యమని భావించారు. అయితే చిత్తూరు జిల్లాకు చెందిన కొందరు ఇంటర్వ్యూలు, మార్కుల ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని 1995లో ట్రిబ్యునల్‌కు వెళ్ళారు. దీనిపై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ పై అంశాలను పరిగణనలోకి తీసుకొని పదోన్నతులు ఇవ్వాలని పోలీస్‌శాఖను కోరగా వారి సమగ్ర సమాచారం ఇవ్వలేదు. దీంతో ఈ విషయంలో ఎక్సైజ్‌శాఖే నిర్ణయం తీసుకోవాలని ట్రిబ్యునల్ సూచించింది. దీనికనుగుణంగానే కానిస్టేబుళ్ళు కొద్ది నెలల క్రితం ఎక్సైజ్ కమిషనర్ కలిసి పదోన్నతుల విషయమై విన్నవించారు. దీంతో ఎక్సైజ్ కమిషనర్ జిల్లా అధికారులను మార్కుల ఆధారంగా పదోన్నతులు ఇచ్చేందుకు పదోన్నతులు రూపొందించాలని ఆదేశించారు. అప్పట్లో ఏపీఎస్పీలో శిక్షణ పొందిన కానిస్టేబుళ్ళ వివరాల వేర్వేరుగా ఉన్నాయి. ఒక్కొక్క బెటాలియన్ ఒక్కో విధంగా మార్కులు ఇచ్చారు. ఒక చోట వంద మీటర్ల పరుగుకు 5మార్కులు ఇస్తే మరో చోటు 2 మార్కులే ఇచ్చారు. అలాగే ఆరవ బెటాలియన్‌లో వారికి మార్కులు, ఇంటర్వ్యూల వివరాలు పూర్తిగా అందుబాటులో లేవు. మార్కులే ఆధారంగా తీసుకుంటే అందరికంటే చివరివరుసలో ఉంటారు. అలాగే అప్పట్లో శిక్షణ పొందిన దాదాపు 20 మంది పేర్లు ఏపీఎస్పీ వద్ద లేవని కొన్ని వర్గాలు వాదిస్తున్నాయి. అంతేకాకుండా అన్ని జిల్లాల్లోను 5, 6 బెటాలియన్లకు చెందినవారు ఉన్నారు. దీంతో మార్కుల ఆధారంగా పదోన్నతులు కల్పిస్తే జిల్లాలు మారాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు.

సంపాదకీయం

బ్యాంకులను దెబ్బతీసే చట్టం

బ్యాంకులు మొండిబాకీలతో తల్లడిల్లుతున్న నేపథ్యంలో పార్లమెంటు దివాలా కోడ్(ఇన్‌సాల్వెన్సీ అండ్ బాంక్రప్సీ) సవరణ బిల్లును ఆమోదించింది. 2016లో దివాలా స్మృతి తీసుకొచ్చింది. ఇప్పుడు ఈ సవరణ బిల్లు చట్టమైతే బాకీలను వసూలు చేయడానికి అవకాశం కలుగుతుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చెబుతోంది. ఈ ఎఫ్‌ఆర్‌డీఐ చట్టం ద్వారా శక్తిమంతమైన ఆర్థిక పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తోంది. దీన్ని పరిష్కార వ్యవస్థ అంటారు. ఆర్థిక రంగంలో సేవలు అందించే వారి వైఫల్యాలను ఎదుర్కొనడానికి ఇది ఉపకరిస్తుందని పేర్కొంటోంది. కంపెనీ ప్రమోటర్లు బాకీ పడి ఉన్నప్పుడు, ఆ కంపెనీ ఆర్థిక సమస్య పరిష్కారంలో వారు పాల్గొనకుండా ఈ చట్టం అడ్డుకొంటోంది. ఇది దివాలా స్మృతికన్నా భిన్నమైంది. దివాలా స్మృతిని ప్రైవేటు కార్పొరేట్ రంగం బకాయిలను వసూలు చేయడానికి ఏర్పాటు చేశారు. ఈ బాకీలు భరింపరాని స్థితికి చేరాయి. 2017 సెప్టెంబరు నాటికి ప్రభుత్వరంగ బ్యాంకులకు రావలసిన మొండి బకాయిలు అసాధారణంగా 7.34 లక్షల కోట్ల రూపాయలకు చేరాయి. 2016లో దివాలా చట్టాన్ని తీసుకొచ్చి నిరర్థక ఆస్తులు లేదా మొండి బకాయిల సమస్యను పరిష్కరించేందుకు మోడీ సర్కారు కాల నిర్ణయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఈ సమస్యతో సంబంధం ఉన్న వారంతా ఒడ్డునపడేందుకు చేసిన ప్రయత్నంగా తయారైంది. ఇప్పుడు ఈ ఎఫ్‌ఆర్‌డీఐ కూడా ఈ ఆర్థిక సమస్యలను పరిష్కరించడం కన్నా ఎక్కువగా సమస్యలు సృష్టించడానికే దారితీస్తుందని స్పష్టమవుతోంది. ఇది జి.20దేశాల ఆధ్వర్యంలో ఆర్థిక సుస్థిరత బోర్డు ఏర్పాటు చేసిన వ్యవస్థలాంటిదే. ఆర్థిక పరిష్కారాలు కనుగొనే అధికారం ఉన్న పరిష్కార వ్యవస్థ రుణగ్రస్తులను గట్టెక్కించడం, సంప్రదాయ పద్ధతుల్లో ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, బదిలీచేయడం చేస్తుంది. ఈ పరిష్కార సంస్కరణలు బ్యాంకుల నియంత్ర ణకు బేసల్-3కి ఉపయోగపడతాయి. వ్యవస్థాగతంగా ముఖ్యమైన బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నగదు అవసరాలను తీర్చడానికి ఉపకరిస్తాయి. ఇవి విఫలం కాకూడదన్న సూత్రం ఆధారంగా ఈ సంస్కరణలు తెచ్చారు. బలహీన పడిన ఆర్థిక సంస్థలను ప్రభుత్వం ఆదుకోవడమే దీని లక్ష్యం. జి.20దేశాల్లో 2007-08 ఆర్థిక సంక్షోభ సమయంలో ఇలాగే ఆయా దేశాల ప్రభుత్వాలు చేశాయి. అప్పుడు ఆ ఆర్థిక సంక్షోభ ప్రభావం మన దేశంపై పడలేదు. దానికి ప్రధాన కారణం మన ఆర్థిక వ్యవస్థ ప్రభుత్వరంగంపై ఆధారపడడమే. దీంతో ఆ సంక్షోభాన్ని మనం తట్టుకొని నిలబడగలిగాం. ఈ ఎఫ్‌ఆర్‌డీఐ చట్టం ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థికసంస్థల రుణాల పరిష్కారాన్ని నీరుగార్చడానికే దారితీస్తుంది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల రుణ పరిష్కారంలో ఇక ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఈ చట్టం చేస్తుంది. బీమా సదుపాయం లేని డిపాజిట్లను వాటాల కింద మార్చిగానీ లేదా విక్రయించిగాని బ్యాంకులను సంక్షోభం నుంచి బయటపడేయడానికి ఈ పరిష్కార వ్యవస్థ దోహదపడుతుంది. ఫలితంగా బ్యాంకులు దివాలా తీసే అవకాశం ఉంటుంది. ఇది బ్యాంకుల్లో డబ్బు డిపాజిట్ చేసే వారిలో భయాందోళనలు రేకెత్తించి వారిని బ్యాంకులకు దూరం చేసే ప్రమాదం ఉంది. చివరకు ఓ అస్థిరతకు దారితీయవచ్చు. అంతేకాదు, ఆర్థిక పరిష్కార వ్యవస్థ వల్ల బ్యాంకులను నియంత్రించే రిజర్వుబ్యాంకు, బీమా నియంత్రణ వ్యవస్థ, సెబీ, పెంఛన్ నిధి నియంత్రణ-అభివృద్ధి సంస్థలు లాంటివి ఎందుకూ కొరగాకుండా పోతాయి. వాస్తవానికి ఆర్థిక సుస్థిరత కాపాడాల్సిన బాధ్యత రిజర్వు బ్యాంకుపై చట్టబద్ధంగా ఉంది. అందువల్ల ఆర్థిక పరిష్కార వ్యవస్థకు, రిజర్వుబ్యాంకుకు మధ్య ఘర్షణ తలెత్తే అవకాశమూ ఉంటుంది. ఈ కారణంగానే ఆర్థిక సుస్థిరత బోర్డులో సభ్యులుగా ఉన్న అనేక వర్ధమాన దేశాలు ఇటువంటి రుణ పరిష్కార వ్యవస్థలను ఏర్పాటు చేయడంలేదు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంస్థలకు ఉన్న ముప్పేమిటో అంచనా వేయడంలో, ఆ ముప్పును అంచనా వేసే కొలమానాల్లో తేడాల వల్లో ఆర్బీఐకీ, ఆర్థిక పరిష్కార వ్యవస్థకు ఘర్షణ రావచ్చు. ఎఫ్‌ఆర్‌డీఐ చట్టం వల్ల డిపాజిట్ల బీమా చట్టాన్ని తొలగించాల్సి వస్తుంది. ప్రస్తుతం డిపాజిట్లకు బీమా లక్ష రూపాయలు అన్నది 24ఏళ్ల కిందట నిర్ణయించారు. ఇప్పుడు దాన్ని పెంచాల్సిన అగత్యం ఉంది. కానీ ఈ చట్టంతో అసలుకే ఎసరు పెట్టే అవకాశం ఉంది. ఆర్థికరంగ చట్టపర సంస్కరణల కమిషన్ ఆధారంగా ఈ చట్టాన్ని తెస్తున్నారు. ఈ కమిషన్ యాజమాన్యంలో తటస్థత ఉండాలని సిఫార్సు చేసింది. అంటే ప్రభుత్వరంగ బ్యాంకులు ఆర్థిక రంగంలో ప్రైవేటు పెట్టుబడితో పోటీపడాల్సి వస్తుంది. అయితే ఈ బ్యాంకులకు పోటీకి అనువైన పరిస్థితులు ఉండవు. ఈ బ్యాంకులకు ప్రభుత్వ ప్రత్యక్ష లేదా పరోక్ష మద్దతును నీరుగార్చడం ద్వారా వీటికి మొండి బాకీలు విపరీతంగా పెరిగిపోయి ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందనడంలో సందేహంలేదు.

మరోవైపు సమస్యతో సంబంధం ఉన్న వారందరినీ అంటే కంపెనీ ప్రమోటర్లను కూడా బిడ్డింగ్‌కు అనుమతించడానికి ఈ చట్టం వీలు కల్పిస్తోంది. అంటే సమస్య సృష్టించినవారే తిరిగి తమ ఆస్తులనే తక్కువ ధరకు వేలం పాటలో దక్కించుకొనేందుకు ఈ చట్టం అవకాశం ఇస్తున్నది. బ్యాంకుల నుంచి తీసుకొన్న రుణాలు ఎగవేసినవారికి, అక్రమ మార్గాల్లో ఆస్తులను దాచుకొని దివాలా తీసినట్టుగా ప్రకటించేవారికి ఈ చట్టం వరంగా మారుతుంది గదా? ఒక వైపు బ్యాంకుల్లో కష్టపడి దాచుకున్న ప్రజల సొమ్మును రుణంగా తీసుకుని ఎగవేయడమేగాక, దివాలా తీసినట్టు ప్రకటించిన కంపెనీలను దొడ్డిదారిన తక్కువ మొత్తానికి దక్కించు కొనేందుకు ఈ చట్టం అవకాశం కల్పించడంలేదా? కాబట్టి కావాలని బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టేవారిని ఇది కాపాడుతున్నదని స్పష్టమవుతోంది. అయితే కొందరు దీనికి భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. భూసేకరణ, మౌలిక సదుపాయాల కల్పనలో విపరీత జాప్యం కారణంగా కొన్ని కంపెనీలు నష్టాల్లో కూరుకు పోయి రుణాలు చెల్లించలేకపోయాయని, అటువంటి వాటిని ఆదుకోవడంలో తప్పేమిటని వీరు వాదిస్తున్నారు. 2007 ఆర్థిక సంక్షోభం వల్ల అంటే అంతర్జాతీయ పరిణామాల వల్ల నష్టపోయిన ప్రమోటర్లను నిందించ రాదన్న వాదన కూడా ముందుకు వస్తున్నది. ఈ వాద నలు చేసేవారు ఎవరో, ప్రభుత్వం ఈ చట్టాన్ని ఎందుకు తెస్తున్నదో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. కొద్దిమంది కోసం అనేకులను బలిపెట్టే చట్టం ఇది. కాబట్టి ఈ ఆర్థిక పరిష్కార వ్యవస్థ ఏర్పాటును ఇప్పటికైనా ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. భారత ఆర్థిక వ్యవస్థకు, పరిస్థితులకు అనువైన పరిష్కార వ్యవస్థను రూపొందిం చుకోవడం ఉత్తమం.

చురక

మహారాష్ట్రలో కులతత్వం
మనువాదుల బంధుత్వం
దళితులపై అగ్ర వర్ణ
దాడి ఎలా హిందూత్వం

అంటరానితనం పైన
ఆక్రోశం యుద్ధస్మరణ
కంభిరింగావ్ కదిలినోల్ల
కడతేర్చే క్రతువు లేల

- వేల్పుల నారాయణ

నేనెరిగిన ఎ.బి.బర్ధన్!

సంస్మరణ

ఈడ్పుగంటి నాగేశ్వరరావు

1961 సంవత్సరం అనుకుంటాను. నాగపూర్‌లో మహారాష్ట్ర శాసనసభా సమావేశాలు జరుగుతున్నప్పుడు కమ్యూనిస్టు పార్టీ వేలాదిమంది గ్రామీణ పేదలు, ఆదివాసీలతో పెద్ద ప్రదర్శనను నిర్వహించింది. అనాటి మహారాష్ట్ర పార్టీ కార్యదర్శి ఎస్.జి.సర్దేశాయి ప్రధాన వక్తగా విచ్చేశారు. ప్రదర్శన నిర్వాహకులలో ఒకరైన ఎ.బి.బర్దన్‌ను కలిసి పరిచయం చేసుకుని నాగపూర్ యూనివర్శిటీలో విద్యార్థి ఫెడరేషన్ ఆర్గనైజ్ చేయాలనే కోరికను వెలిబుచ్చాను. వెంటనే పక్కన ఉన్న టి.యు.నాయకుడు సన్యాల్‌ను పిలిచి వీరికి సహాయపడవలసిందిగా చెప్పారు. హితవాద (ఇంగ్లీష్ దినపత్రిక)లో జర్నలిస్టుగా పనిచేస్తున్న గర్భాను పరిచయం చేయటం, ఆయన సహాయంతో కొద్ది రోజులలోనే 10 మందితో ఎస్.ఎఫ్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఎ.బి.బర్దన్ కూడా ఆ సమావేశానికి హాజరయ్యారు. నాగపూర్‌లో అప్పటికే ఆయన పేరుగాంచిన కమ్యూనిస్టు నాయకుడు. బహుభాషలలో జనరకంజకంగా మాట్లాడే వక్త, సిటీ నుండి ఎన్నికయిన శాసనసభ్యుడు.

విదర్భ ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్యమానికి నాగపూర్ కేంద్రం. ఎమ్.ఎస్.అని దానికి సారథి. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం నాగపూర్. గురు గోల్వాల్కర్ అక్కడ నుండే దేశవ్యాపితంగా పర్యటించేవారు. బాబా సాహెబ్ అంబేద్కర్ తన చివరి రోజులలో బౌద్ధాన్ని స్వీకరించింది నాగపూర్‌లోనే. రిపబ్లికన్ పార్టీకి పలుకుబడి ఉన్న కేంద్రం. సోషలిస్టులు వసంత సాథే (తర్వాత కాంగ్రెస్ కేంద్రమంత్రి అయ్యారు) నాయకత్వాన చురుకుగా పనిచేస్తున్నారు. సర్వోదయ ఉద్యమం, కార్యకర్తలు వార్దా, నాగపూర్‌లలో కేంద్రీకరించి ఉండేవారు. కాంగ్రెస్ అధికార పార్టీ. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం బలహీనంగా ఉండేది. ఇట్టి నేపథ్యంలో బర్దన్ ప్రముఖ కమ్యూనిస్టుగా గుర్తింపు పొందటం, శాసనసభ్యుడుగా కాంగ్రెస్‌ను ఓడించి గెలవడం, పార్లమెంటేరియన్‌గా రాణించడం ఆయన దీక్ష, దక్షతలు, ప్రతిభకు తార్కాణం.



ప్రతిపక్ష రాజకీయాలలో కమ్యూనిస్టు బర్దన్, సోషలిస్టు సాథే, రిపబ్లికన్ ఖోబ్రగడే పాపులర్ లీడర్లుగా ఉండేవారు. సాహిత్య, సాంస్కృతిక సభలలో, మేధావుల సభలో బర్దన్ ఒక ప్రత్యేక ఆకర్షణ. ప్రధానంగా ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలపై ఆయన కేంద్రీకరణ ఉండేది. అమరావతిలో, గ్రామీణ ప్రాంతాలలో కామ్రేడ్ సుధాం దేశ్‌ముఖ్ ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడుగా పేరుగాంచారు. ఆ తరువాత కాలంలో ఆయన పార్లమెంటుకు ఎన్నికయ్యారు.

భుజాన ఒక సంచి తగిలించుకుని కాలినడకన, బస్సులలో ప్రయాణం చేస్తూ ఓటర్లను కలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి అమరావతి నుంచి లోక్‌సభకు సుధాం దేశ్‌ముఖ్ ఎన్నికయ్యారు.

ఆరోజులలో ఢిల్లీలో జరిగిన జాతీయ సమగ్రత (నేషనల్ ఇంటిగ్రేషన్) సమావేశానికి విశేష ప్రాధాన్యత వచ్చింది. ఆ సందర్భంగా అరుణా అసఫాలీని నాగపూర్ తీసుకురా వడంలో, యూనివర్శిటీలో ఎస్.ఎఫ్. ఆధ్వర్యంలో ఒక పెద్ద సభ ఆర్గనైజ్ చేయడంలో కామ్రేడ్ బర్దన్ ప్రముఖ పాత్ర పోషించారు. రెండు రోజులపాటు ఆమె వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 22వ మహాసభ మాస్కోలో జరిగింది. సీపీఐ ప్రతినిధి వర్గంలో సభ్యుడుగా వెళ్ళిన ఎస్.జి.సర్దేశాయి భారతదేశానికి తిరిగి వచ్చిన వెంటనే నాగపూర్ వచ్చారు. ఆరోజు బర్దన్ నివాసంలో పార్టీ ముఖ్యుల సమావేశంలో సర్దేశాయి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన సిద్ధాంత సమస్యలపై సుదీర్ఘ వివరణ యిచ్చారు. తెలుగు విద్యార్థులు నలుగురుం హాజరయ్యాం. అటువంటి ప్రత్యేక సమావేశాలు కొన్ని ఆయన ఇంట్లోనే జరిగేవి.

1962 ఎన్నికలలో శాసనసభకు బర్దన్ తిరిగి పోటీ చేశారు. కొద్ది ఓట్ల తేడాతో ఆయన ఓడిపోయారు. మాకు పార్టీ సభ్యత్వాన్ని రికమెండ్ చేసింది కూడా ఆయనే.

1964 పార్టీ చీలిక అనంతరం సీపీఐ మహాసభల తీర్మానాలపై జరిగే చర్చలలో సవరణలను పరిశీలించడంలో, ఆమోదింపచేయడంలో బర్దన్‌ది ఒక ప్రత్యేకశైలి.

సీపీఐ ప్రధాన కార్యదర్శిగా బర్దన్ బాధ్యతలు చేపట్టిన తరువాత హైదరాబాద్ పార్టీ సమావేశాలకు వచ్చినప్పుడు తరచూ కలుస్తూ ఉండేవారం. ఆయా రాజకీయ, పార్టీ సంస్థాగత విషయాలపైన, సమస్యలపైన తన అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ఉండేవారు.

2015 పుదుచ్చేరి మహాసభ ఆమోదించిన పార్టీ ప్రోగ్రాం (ప్రస్తుత విప్లవ దశలో పార్టీ వ్యూహాన్ని వివరించే పత్రం) రూపకల్పన ఖ్యాతి బర్దన్‌కే చెందుతుంది.

సీపీఐ చీలిన తరువాత, 1964లో పార్టీ ప్రోగ్రాంను డాక్టరు అధికారి బొంబాయి మహాసభలో ప్రవేశపెట్టగా కమీషన్ చర్చించిన అనంతరం మహాసభ ఆమోదించింది. ఆ తరువాత పాట్నా మహాసభలో కొన్ని సవరణలతో ఆమోదించారు. ప్రపంచ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల స్టేట్‌మెంట్ ప్రభావంతో అది రూపొందించబడింది. తిరిగి 1992 లో హైదరాబాద్ మహాసభలో మారిన పరిణామాల నేపథ్యంలో సీపీఐ పాత ప్రోగ్రాం స్థానే స్టేట్‌మెంటును చర్చించి ఆమోదించింది. అది సమగ్రమైన ప్రోగ్రాం కాదు. తరనంతరం 4 సంవత్సరాల చర్చల అనంతరం 2015 పుదుచ్చేరి మహాసభలో కొత్త ప్రోగ్రాంను పార్టీ ఆమోదించింది.

నేటి రాజ్యవ్యవస్థ స్వభావం ఏమిటి? ఏ వర్గం నాయకత్వం వహిస్తున్నది, ప్రస్తుత విప్లవ దశ లక్షణం ఏమిటి? సోషలిజానికి పరివర్తనా క్రమం, కార్యక్రమం ఎలాంటిది? భారతదేశంలో కులం, వర్గం, వాస్తవికతను ఎలా అర్థం చేసుకోవాలి? కమ్యూనిస్టు పార్టీ విప్లవ వారసత్వం, ప్రస్తుత కర్తవ్యాలను కొత్త ప్రోగ్రాం వివరిస్తుంది.

కామ్రేడ్ బర్దన్ చివరి దశలో సోషలిజానికి భారతదేశ విస్పాత్న పంథాను గురించే ఎక్కువ ఆలోచించారు.

తుమ్మితే ఊడే ముక్కు భారత ఆర్థిక వ్యవస్థ

విశ్లేషణ



పి.జనార్ధనరావు

సామాజిక భద్రత లేని ప్రజలు ప్రపంచ వ్యాపితంగా 400 కోట్లకు పైగా వున్నారని ప్రపంచ కార్మిక సమాఖ్య నివేదిక. సామాజిక భద్రత అవసరమేమిటి? పేదరిక నిర్మూలనకు, అసమానతల తగ్గింపునకు, ఆర్థిక వృద్ధికి, సామాజిక న్యాయానికి అదే సమయాన సుస్థిర లక్ష్యాల సాధనకు తోడ్పడుతుంది - ఐఎల్ఓ నివేదిక. భారత ఆర్థిక వ్యవస్థ మనుగడ దేశీయ కార్పొరేట్లు, గ్లోబల్ ద్రవ్యపెట్టుబడిదారులపై ఆధారపడి వుంది. భారతపాలక వర్గాలు 1991 నుండి పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం చేపట్టాయి. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం ప్రధాన లక్ష్యం - వ్యక్తులు అభివృద్ధి చెందడం, సంపద సృష్టించే సంస్థలు ప్రైవేటు రంగం చేతిలో వుండటం, సృష్టించబడిన సంపద కొద్దిమంది చేతుల్లో పోగపడటం, అత్యధిక ప్రజలు దుర్భర దారిద్ర్యంలో కొనసాగటం. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం గ్రామాలను, వాటి అభివృద్ధిని విస్మరిస్తుంది. నగరాల అభివృద్ధికి తోడ్పడుతుంది. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచీకరణలో భాగంగా పూర్తిగా గ్లోబల్ ద్రవ్యపెట్టుబడికి తెరిచారు. ఆర్థిక వ్యవస్థ నిర్వహణ ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌ల ఆదేశాల ప్రకారం నిర్వహించబడుతోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పైన, సరఫరాల్లో ఏర్పడే అవరోధాలపైన తరచుగా హెచ్చరించటం జరిగింది. అలాగే రెండవ తరం సంస్కరణల అమలు, వివిధ వర్గాలకందించే సబ్సిడీలను తగ్గించటంపైన హెచ్చరించేవారు. మరో సంస్థ వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆహార సబ్సిడీపై హెచ్చరిస్తుంది. దేశంలో ఉత్పత్తి అయ్యే పంట విలువలో 10 శాతం కంటే ఇచ్చే సబ్సిడీ అధికంగా వుండకూడదు. భారత్, చైనాల జీడీపీ అధికంగా వుందని సబ్సిడీ విరమించమంటుంది. ఇంతకు ముందు సడలింపు పొందటం జరిగింది. కారణం 2013లో భారత ప్రభుత్వం ఆహార భద్రతా చట్టం చేసింది. దానికనుగుణంగా 75 శాతం ప్రజలకు సబ్సిడీపై ఆహార ధాన్యాలు అందించాలి. విశేషం ఏమిటంటే అమెరికా గాని ఈయూ దేశాలు గాని తమ వ్యవసాయదారులకు విస్తారంగా బిలియన్ల సబ్సిడీ ఇస్తారు. వారే ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సబ్సిడీలు ఇవ్వడం లేదు.

భారత వర్తమాన స్థితి ఏమిటి? ఆదాయాల్లో పెరుగుతున్న అసమానతలు ధనిక, పేద, రూరల్-అర్బన్, వ్యవసాయ - వ్యవసాయేతర రంగాల మధ్య జీడీపీలో గణనీయమైన వృద్ధి సాధించటం జరిగినా ఉపాధులు పెంచటం లేదు. అభివృద్ధికి కృషి చేసే ఉపాధులు కాకుండా, మరెందుకు ఉపాధి సృష్టిని అశ్రద్ధ చేస్తున్నారు. సంపద సృష్టికి తోడ్పడే, ప్రజలకు అందులో ప్రయోజనం పొందే అవకాశం ఎందుకు ఇవ్వటం లేదు. ఉత్పాదక రంగాలను అశ్రద్ధ చేయటం జరిగింది. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి లేదు. కొత్తగా పరిశ్రమల స్థాపన లేదు. జీడీపీకి వ్యవసాయ రంగం, పరిశ్రమల రంగం అందించే వాటా తగ్గిపోయింది. ఉపాధుల సృష్టి జరగటంలేదు. పైగా జీడీపీలో వృద్ధి జరిగినా ఉపాధుల నుండి తొలగించారు. 2010 నాటికి అగ్రికల్చర్ నుండి 15 మిలియన్లు, మాన్యుఫ్యాక్చర్ నుండి 5.3 మిలియన్లు తొలగించబడ్డారు. ఉపాధి లేని ప్రజలు గ్రామాల నుండి నగరాలకు చేరుతున్నారు. అసంఘటిత రంగంలో కార్మికులు 460 మిలియన్లకు చేరారు. 2020 నాటికి 490 మిలియన్లకు చేరుతారని అంచనా. సరాసరి వయసు 29 సంవత్సరాలు. ప్రపంచంలోనే అత్యధిక యువత వర్క్‌ఫోర్స్ కలిగిన దేశం అవుతుంది. ప్రస్తుతం దేశంలో భూవసతి లేని పేదలు, వ్యవసాయంపైనే ఆధారపడిన సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు పెరిగారు. నగరాలు గాని అచ్చటి పరిశ్రమలు గాని శాశ్వత ప్రాతిపదికన ఉపాధి కల్పించే స్థితి లేదు. నగరాల్లో వలసవచ్చే ప్రజలవల్ల మురికివాడలు పెరుగుతున్నాయి. పౌర సౌకర్యాలు ఏర్పరిచే భారం నగరపాలక సంస్థలపై పడుతుంది. నిర్వాసితులైన పిల్లలు చదువుల్లో చేరలేరు. ఆరోగ్య రక్షణ సౌకర్యాలుండవు. పని ప్రదేశానికి చేరటానికి రవాణా సౌకర్యాలుండవు. నివాస వసతులు అరకొరగా వుంటాయి. రేషన్‌కార్డులుండవు. సబ్సిడీ సరుకులు పొందలేరు. అసంఘటిత రంగాల్లో పనిచేసే వారికి పనికి గాని, ఆదాయానికి గాని హామీలుండవు. సామాజిక రక్షణ సౌకర్యాలుండవు. శ్రమ చేసే వర్గాలు ఉపాధి లేక గ్రామాల నుండి తరలిపోవటంవల్ల గ్రామాల్లో కార్యక్రమాలు ఆలస్యం, కూలీల కొరత ఏర్పడుతుంది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టగలిగే అవకాశం లేదు. కార్పొరేట్ రంగం తీసుకున్న అప్పులు చెల్లించనందున బ్యాంకుల్లో పారుబాకీలు రూ. 9 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో సగం 10 మంది కార్పొరేట్ల అగ్రనేతలవే. మోడీ ప్రధానమంత్రి పదవి చేపట్టిన తరువాత చిన్న, పెద్ద దేశాలు పర్యటించి ఆయా దేశాధిపతులను బహుళజాతి వ్యాపార సంస్థల అధిపతులను కలసి భారతదేశంలో పెట్టుబడులు పెట్టమని అర్థించటం జరిగింది. ఆశించిన మేర ద్రవ్యపెట్టుబడులు రాలేదు. వచ్చిన పెట్టుబడి ఉత్పాదక రంగాల్లోనే కాక ప్రత్యేకంగా చట్టా వ్యాపారంలోకి వచ్చింది. వారు డివిడెండ్లు, లాభాలు, రాయల్టీలు, సాంకేతిక బదిలీకి చెల్లింపులు, పేటెంట్ల రూపంలో విపరీతంగా లాభాలు తరలించారు. పెద్దఎత్తున లోటుబడ్జెట్లు వేస్తున్నారు. పన్నుల ద్వారాను, ఇతర విధాలుగా వచ్చే ఆదాయం కంటే ఖర్చు అధికమవటంవల్ల లోటు ఏర్పడుతుంది. లోటుకు అవకాశంగా గల రంగాలు ఎగుమతులు, దిగుమతుల రంగం. దేశం చేసే ఎగుమతులకంటే దిగుమతులకు ఎక్కువ చెల్లింపులు చేయటంవల్ల బి.వో.పి. పెరుగుతుంది. చెల్లింపులకు డాలర్లు కావాలి. అప్పు చేయాల్సిన స్థితి. అలాంటి అప్పు 2004లో 100 బిలియన్ డాలర్లుంటే నేడు 400 బిలియన్లు అధిగమించింది. వడ్డీ చెల్లింపుల భారం పెరుగుతుంది. అప్పు విషయంలో రేటింగ్ ఏజెన్సీలందించే గ్రేడింగ్ తోడ్పడుతుంది. గతం నుండి ఇండియా రేటింగ్ పెంచటం లేదు. ప్రస్తుతం మూడీస్ ఒక్కటే 13 సంవత్సరాల తర్వాత కొద్దిగా పెంచింది. దేశం చేసే ఎగుమతులు వ్యవసాయం దాని అనుబంధ సంస్థల ఉత్పత్తులు, ఇనుప ఖనిజం, మాంగనీసు, గార్మెంట్లు జెమ్స్ అండ్ జ్యూయలరీ, లెదర్ గూడ్స్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్స్ విడిభాగాలు. దిగుమతులు పెట్రోలియం, ఇంధనం, బంగారం, ఎలక్ట్రానిక్ గూడ్స్, మెషినరీ, కాపర్, రసాయనిక ఎరువులు వగైరాలు అత్యంత విలువ గలవి. అందువల్ల వ్యాపార అంతరం పెరుగుతుంది. మరో అవరోధం అమెరికా, ఈయూ, జపాన్ వగైరాలు మాంద్యం నుండి బయటపడనందున ఆయా దేశాల్లో వినిమయం పెరగటం లేదు. మన ఎగుమతులకు గిరాకీ తగ్గింది. అంతేకాదు ఆ దేశాలు రక్షణాత్మక విధానం అవలంబిస్తుంది. మన దేశం ఉత్పత్తుల కంటే చౌకగా బంగ్లాదేశ్, ఇండోనేషియా, వియత్నాం ఉత్పత్తుల పోటీ పెరిగింది. ఎగుమతులకు తోడ్పడే మరో ముఖ్యమైన వ్యవస్థ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్, క్యాంటిటేటివ్ రెస్ట్రిక్షన్లు పెట్టి మూసివేయటం జరిగింది. ఇంతవరకు పునరుద్ధరణకు పూనుకోలేదు. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం చేపట్టిన తరువాత స్తంభింపచేయబడిన వ్యవస్థలు అగ్రికల్చర్, మాన్యుఫ్యాక్చర్, మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్. అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ బ్యాంకు, ఐ.యం.ఎఫ్, ఏడీబీ, ఓయి సీడీలు జీడీపీలో అభివృద్ధి స్థాయిని తగ్గించాయి. వేగవంతమైన వృద్ధిని సాధించటమే మోడీ ఆశయం. అందుకు పెట్టుబడులు కావాలి. నైపుణ్యమైన వర్క్‌ఫోర్స్ కావాలి. టెక్నాలజీ కావాలి. ప్రాతిపదిక సౌకర్యాలు విస్తరించాలి, ఈ పై అంశాలేవీ లేవు. కార్పొరేట్ రంగం తోడ్పడుతుందని ఆశ. అదీ నెరవేరుట లేదు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం పెరగటం ప్రారంభించింది. ఇంధనం ధరలు పెరుగుతున్నాయి. విద్యకు, ఆరోగ్య రక్షణకు అధికంగా ప్రజలు ఖర్చు చేయవలసి వస్తుంది. ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు రాకతో గృహస్థులు చేసే పొదుపు పడిపోయింది. పేద కుటుంబాలు వినిమయ శక్తిని కోల్పోతాయి. ధరల పెరుగుదల, ఉపాధి లేమి వారి కొనుగోలు శక్తిని హరిస్తుంది. మధ్య తరగతివారు పెరుగుతున్న ధరలకు ద్రవ్యోల్బణం, నిజవేతనాల విలువ తగ్గి జీవనం గడపటానికి ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత ఆదాయ వర్గాలు తమ మిగులు సంపదను పెట్టుబడులంచటానికి గాక బంగారం, రియల్ ఎస్టేట్ వంటివి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం పన్నులు, ఆహారం వగైరాల ధరలు పెంచి సబ్సిడీలు విరమిస్తున్నారు. ఉదా॥ వంట గ్యాసు, అత్యధిక శాతం ప్రజల జీవిత విధానం కల్లోలమైంది. ఆహార పదార్థాల వినిమయం తగ్గింది. భారతదేశంలాంటి పెద్ద జనాభా గల దేశంలో వృద్ధి సాధించటానికి గాని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టటానికి గాని పైన పేర్కొన్నవి కావాల్సి వుంది. సొంత వనరులను వినియోగించి అభివృద్ధి సాధించగలగాలి. అటు వంటి ప్రోత్సాహాన్ని మోడీ సాధించుటలో విఫలమ య్యాడు. ప్రజలకు మంచిరోజులు వస్తాయని, గుడ్ గవర్నెన్స్ అందింప చేసే ప్రకటనలు ఎన్నికల్లో విజయం సాధించటానికి చేసిన ట్లుగా అర్థమైంది. బీజేపీని బలపరిచిన ఆరెస్సెస్ దాని అను బంధ శక్తులు దేశంలో అస్థిర పరిస్థితులు ఏర్పరచటానికి. అందువల్ల అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట కోల్పోవుట విషయంలో ప్రధానిగా సరిదిద్దటానికి వారిని అదుపు చేయటానికి ప్రయత్నించటం లేదు. హిందూత్వ ఎజెండాతో దేశ పురోభివృద్ధిని అడ్డుకొనే ప్రయత్నం చేస్తుంది. వారికి ప్రజా సంక్షేమ చర్యలపై ఆసక్తి లేదు. భారత రాజ్యాంగం - ఇండియా దటీజ్ భారత్ అంది గాని హిందూదేశం అనలేదు. పేట్రేగిన మూకలను అదుపు చేయలేకపోతే దేశ ప్రజలు తీవ్రమైన చర్యలకు దిగటం తథ్యం. మోడీ చేసిన వాగ్దానాల ఆచరణకు ఆందోళన చేపట్టటం జరుగుతుంది. పేదరికం, మాల్‌న్యూట్రిషన్, నిరక్షరాస్యత అధికంగా వున్న దేశంలో గ్రోత్ వల్ల సాధించిన సంపదను వాటి నుండి ప్రజలను బయటపడవేయటానికి వినియోగించాలి. ఉపాధి కల్పన పెంచి ప్రజల కొనుగోలు శక్తిని పెంచి, వస్తు వినియోగాన్ని పెంచవలసి వుంది. మోడీ కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలుడని నిర్ధారణైంది. ప్రతి సంవత్సరం పన్నుల్లో మినహాయింపులు ఇవ్వడం ద్వారా ఐదు లక్షల కోట్ల రూపాయలు వారికి దఖలుపరుస్తున్నారు. పాలన చేపట్టిన మొదటి సంవత్సరమే 2014-15లో బిలియనీర్లు 40 మంది పెరిగారు. ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో వున్నా కొద్దిమంది సంపద ఎలా పెరుగుతుందో పరిశీలించండి. 20 మంది పైభాగానున్న బిలియనీర్ల సంపద వర్తమాన సంవత్సరం మొదటి 7 నెలల్లో 50 బిలియన్ డాలర్లు పెరిగింది. వారి మొత్తం సంపద 200 బిలియన్ డాలర్లు. సుమారు భారత రెండు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థలో వారి వాటా 10 శాతం. బ్లూమ్‌బెర్గ్ అంచనా. అసమానతలు ఎలా పెరిగినవో వివరణ అక్కర్లేదు. మోడీ చెప్పిన విషయాలు ఆచరణలో పెట్టరు. చెప్పని విషయాలు ఆచరణలో పెడతారు. ఉదా॥ పెద్దనోట్ల రద్దు, డిజిటల్ ఆర్థిక విధానం.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

జీవ జలవనరులుగా భాసించాల్సిన నదీప్రవాహాలు భారీ ఎత్తున వ్యర్థాలతో కలుషితమై సముద్రాల సౌభాగ్యాన్ని, పర్యావరణ సమతూకాన్ని సైతం హరించివేస్తున్నాయి.

సముద్రంలో ప్లాస్టిక్ సుడిగుండం

మనిషి చేజేతులారా చేసుకుంటున్న పాపం, శాపం కాలుష్యం. మనిషి స్వార్థం వల్ల చివరకు సాగర జలాలు కూడా కలుషితమవుతున్నాయి. జర్మన్ శాస్త్రవేత్తలు నిర్వహించిన తాజా అధ్యయనం ఆందోళన కలిగించే అంశాలను వెల్లడించింది. పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ కలుషిత రసాయనాలు నదుల్లో, సముద్రాల్లోకి విడిచిపెట్టడం వల్ల జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా తయారవుతోంది. కాగితం మిల్లులు, పెట్రో కెమికల్స్, చమురు శుద్ధి కర్మాగారాలు, ఫుడ్ ప్రాసెసింగ్, జౌళి పరిశ్రమలు హానికర విష రసాయనాలను నదుల్లోకి వదలడంతో, అవి సముద్రాల్లోకి చేరి జీవజాలాన్ని నాశనం చేస్తున్నాయి. ఈ ప్రమాదం గురించి గతంలోనే 16వేల మంది శాస్త్రవేత్తలు ఐక్యరాజ్యసమితి దృష్టికి తెచ్చారు. అయినా ఫలితం లేకుండా పోయింది. తాజా అధ్యయనం ప్రకారం, ఏటా లక్షలాది టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల్లో 95శాతం దాకా పది నదులనుంచే వచ్చి సముద్రాల్లో పేరుకుంటోంది. వాటిలో నైలు, నైజర్ నదులు రెండే ఆఫ్రికా ఖండంలో ప్రవహించేవి. గంగ, సింధు, మెకాంగ్ సహా తక్కిన ఎనిమిదీ ఆసియా ఖండానికి చెందినవే. మానవాళి విడుదల చేసే బొగ్గుపులుసు వాయువులో నాలుగోవంతును శోషించుకుంటున్న సముద్రాలు- వర్షాలకు దోహదపడుతున్నాయి. అపార మత్స్యసంపదను ప్రసాదిస్తున్నాయి. అటువంటి సాగర జలాల్లోకి నిరంతరం చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల మూలాన ఏటా లక్షల సంఖ్యలో సముద్ర పక్షులు, క్షీరదాలు, అసంఖ్యాకంగా చేపలు మృత్యువాత పడుతున్నాయి. ప్రతి సముద్రంలో, నదీ జలాల్లో సూక్ష్మస్థాయి ప్లాస్టిక్ రేణువుల ఉనికిని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది ప్రపంచ పర్యావరణానికే పెనుప్రమాద హెచ్చరికగా వారు పేర్కొంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే 2050 సంవత్సరం నాటికి సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. సముద్ర తీరంలోను, జలాల్లోను నివసించే ప్రాణికోటి సమతుల స్థితికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా పూర్తిగా నిషేధించాలని శాస్త్రవేత్తలు ఐక్యరాజ్యసమితిని కోరారు. వాషింగ్టన్‌లోని మెరైన్ కన్సర్వేషన్ బయాలజీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'ట్రబుల్ వాటర్ ఎ కాల్ ఫర్ యాక్షన్' పేరిట సుదీర్ఘ నివేదికను ఆ శాస్త్రవేత్తలు విడుదల చేశారు. సముద్రాలను నిర్లక్ష్యం చేయడం వల్ల వాటిలోని ప్రాణులకే కాకుండా మొత్తం భూగోళానికి ప్రమాదముందన్న వాస్తవాన్ని మనిషి విస్మరిస్తున్నాడు. భూగోళంలో 71శాతాన్ని ఆక్రమించిన సాగరాలు- భూమినీ, భూమి చుట్టూ ఆవరించిన వాతావరణాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయని మనిషి గుర్తించినా, దాన్ని పట్టించుకోక పోవడం వల్లే సముద్రాలకు ఈ గతి పట్టింది. భూమిలో జనించే

లోచనం

వేడిని, ఇక్కడ వెలువడుతున్న కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువుల్ని గ్రీన్‌హౌస్ వాయువులను స్వీకరించి, సృష్టిలోని వివిధ అంశాల మధ్య తూకాన్ని పరిరక్షించడంలో సాగర జలాలు ఎనలేని సేవలందిస్తున్నాయి. ప్రస్తుతం సాగర్ జలాల్లోకి చేరే సూక్ష్మ ప్లాస్టిక్ రేణువుల వల్ల సముద్ర జీవులకే కాదు, మానవులకు తీవ్ర ముప్పు తలెత్తుతున్నది. ఈ ప్లాస్టిక్ వ్యర్థాల్ని ఆహారంగా భ్రమించి తినే చేపలు, సముద్ర పక్షులు, ఇతర జీవుల రూపేణా అవి మనుషుల శరీరంలోకి ప్రవేశించి తీవ్ర దుష్పరిణామాలకు దారితీస్తున్నాయి. ఏటా సముద్ర జలాల్లోకి 15కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు చేరుతున్నట్లు పర్యావరణవేత్తలు లెక్కతీశారు. సీసాలు, సంచులు, డబ్బాలు, కప్పులు, కంప్యూటర్ సరంజామా వరకు ఎన్నో రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాల్లోకి చేరుతున్నాయి. వివిధ ప్లాస్టిక్ ఉత్పాదనల్లో కేవలం అయిదు శాతమే రీసైక్లింగ్‌కు పనివస్తున్నాయి. మిగిలినవన్నీ పనికిరాని వ్యర్థాలే. మనదేశంలో చనిపోతున్న ప్రతి ఆవు, గేదె ఉదరంలో కనీసం 30 కిలోల మేర ప్లాస్టిక్ ఉంటోందని నిపుణులు వెల్లడిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల మూలాన డ్రయినేజీలు కూడా పూడిపోయి మురుగునీటి ప్రవాహాలు రోడ్లను ముంచెత్తుతున్నాయి. సముద్ర జలాల్లోకి చేరే ప్లాస్టిక్ వ్యర్థాల్లో అత్యధిక వాటా చైనా, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, శ్రీలంక, వియత్నాం తదితర దేశాలదేనని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. సాగర్ జలాల్లోకి చేరే ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ఏటా మానవాళికి రూ.85 వేలకోట్ల నష్టం వాటిల్లుతున్నట్లు ప్రముఖ జలకాలుష్య పరిశోధకుడు మహువా సాహా లెక్కగట్టారు. అయిదో దశకం నుంచి ఇప్పటివరకు మానవాళి ఉత్పత్తి చేసిన మొత్తం ప్లాస్టిక్ రాశి 18.2 లక్షల కోట్ల పౌండ్లు (1 కిలో 2.20462 పౌండ్లు). అది నూరు కోట్ల ఏనుగుల పరిమాణానికి సమానం. సంపన్న దేశాలు పాత ఓడల్లో తరలించి సముద్రంలో పారబోస్తున్న వ్యర్థాలే సుమారు 63 లక్షల టన్నులు. ఈ నేపథ్యంలో ఐర్లాండ్, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్ దేశాలు ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడంలో మెరుగైన చర్యలు చేపట్టాయి. ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగంలో జపాన్ చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నది. సాగర జీవరాశికి, అంతిమంగా మనుషులకు మహాచేటు తెస్తున్న ప్లాస్టిక్ వినియోగం, వ్యర్థాల నియంత్రణ ప్రపంచ దేశాల తక్షణ కర్తవ్యం కావాలి. ఇప్పటికే ఈ మేరకు ఐక్యరాజ్యసమితి పిలుపిచ్చింది. ప్లాస్టిక్ వ్యర్థాలొక్కటే కాదు- లక్షలాది లీటర్ల మురుగునీరు, టన్నుల కొద్దీ వ్యవసాయ, పారిశ్రామిక, ప్లాస్టిక్ వ్యర్థాలు వందలాది నదుల్ని, వేలాది జలప్రవాహాల్ని విషకలుషితం చేస్తూనే ఉన్నాయి. ఈ వాస్తవాన్ని గుర్తించి ఇప్పటికైనా ప్రపంచ దేశాలు మేలుకోవాల్సిన అవసరం ఉంది.

- జ్యోతి

విశాలాంధ్ర
బతుకు
The Life
శుక్రవారం
05 జనవరి 2018
Dwaraka

రచయితలకు సూచన
'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.
batuku@visalaandhra.com



ఆడపిల్లలకు భద్రత కల్పించాలి, వారికి ఉచిత విద్యనందించాలి, వారి ప్రగతికి తోడ్పడాలి అని చాలామంది ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ ఉంటారు. ఇవన్నీ మాటల్లోనే చేతల్లో కనిపించవు. ఇలాంటి సంస్థలూ చాలానే ఉన్నాయి. కానీ రాజస్థాన్‌లోని నాగౌర్‌లో ఉన్న సచ్చంద సంస్థ దిద్వానా వికాస్ పరిషత్ సమితి ఇందుకు భిన్నం. ఈ ఎన్‌జీవో అన్నీ ఆచరణలో పెడుతోంది. 114 గ్రామాల్లోని 500 మంది బాలికలకు ఉచితంగా చదువు చెబుతోంది. ఇందుకోసం ఒక కాలేజీని నడుపుతోంది. అది కేవలం ఆడపిల్లల కాలేజీనే. ఆ కళాశాల పేరు శ్రీ బంగడ్ మహిళా కాలేజీ.

500 మంది బాలికలకు ఉచిత విద్య!

ఈ కళాశాలలో అమ్మాయిలకు ఉచితంగా చదువే కాదు ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు కూడా పంపిణీ చేస్తున్నారు. ఉచిత రవాణా సౌకర్యాన్నీ కల్పిస్తున్నారు. ప్రమాద భీమానూ అందజేస్తున్నారు. మొత్తంగా ఆడపిల్లలు బయటకు వచ్చి చదువుకునేందుకు అవసరమైన అన్ని సదుపాయాలూ ఉచితంగా సమకూరుస్తున్నారు. దిండ్వానా సమీపంలోని 114 గ్రామాల నుంచి 500 మంది విద్యార్థినులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఇంతమందికీ అన్ని రకాల సౌకర్యాలనూ ఉచితంగానే అందజేస్తోందీ స్వచ్ఛంద సంస్థ.

అన్ని సదుపాయాలూ ఉన్నాయి కాబట్టి బాలికలు చదువుకునేందుకు వచ్చారు అనుకుంటే పొరపాటే. వారు కాలేజీకి వచ్చేలా చేసేందుకు, వారు చదువుపై ఆసక్తి కనబర్చేందుకు, వారి తల్లిదండ్రులను ఒప్పించేందుకు ఈ సంస్థ నానాపాట్లు పడింది. తొలుత ఎన్‌జీవో సభ్యులు, కళాశాల యాజమాన్యం ఎంత చెప్పినా పిల్లల్ని బయటకు పంపించేందుకు అమ్మానాన్నలు సుతరామూ ఇష్టపడలేదు. కారణం అభద్రత, అసౌకర్యం. మంచి చదువైనా సరే దూర ప్రాంతాలకు తమ బిడ్డల్ని పంపించేది లేదనే చెప్పారు. ఆడపిల్లలు చదువు కొనసాగించాలనే లక్ష్యంతో వారి కోసమే ఈ కాలేజీని తీసుకొచ్చిన స్వచ్ఛంద సంస్థ తన ప్రయత్నాన్ని మాత్రం వీడలేదు. వాళ్ళని రప్పించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆలోచించింది. అదే బయోమెట్రిక్ విధానం. దీనివల్ల విద్యార్థినులు కాలేజీకి వచ్చారా? అంటారా! అవును. దీనిని ఏర్పాటు చేయడం ద్వారానే తల్లిదండ్రులకు భరోసానిచ్చారు. వారి పిల్లల్ని కాలేజీకి పంపించేలా చేశారు. అదెలాగంటే...వారు ఆడపిల్లల్ని దూరం పంపించి చదివించకపోవడానికి కారణం వారి ప్రాణాలకు భద్రత లేకపోవడమే. ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయమే. వీటిని తొలగించింది ఎన్‌జీవో. ఇందుకోసం ఈ సంస్థే కాలేజీకి వచ్చి వెళ్ళేందుకు రవాణా సౌకర్యాన్ని కలిగించింది. అది కూడా ఉచితంగా. బయోమెట్రిక్ విధానం ద్వారా బాలికలు కాలేజీకి రాగానే ఉదయాన్నే వారి సంరక్షకులకు సమాచారం అందిస్తుంది. అలాగే ఏదైనా అవసరమై విద్యార్థినులు కాలేజీకి సెలవు పెట్టి వెళితే ఆ వెంటనే ఈ విషయాన్ని వారి తల్లిదండ్రులకు తెలియజేస్తుంది. రూపాయి ఖర్చు లేకుండా అన్ని సౌకర్యాలు, సదుపాయాలతో నాణ్యమైన విద్య అందుతుంటే ఎవరు కాదనగలరు! చదువు విలువ తెలిసిన వారు ఎవరూ ఈ అవకాశాన్ని వదులుకోరు కదా! అందుకే చుట్టుపక్కల ఉన్న 114 గ్రామాల నుంచి వస్తున్న ఆడపిల్లలు ఇక్కడ చదువుకుంటున్నారు. ఉన్నత విద్యావంతులవుతున్నారు.

బాలికల భద్రత కోసం కళాశాల యాజమాన్యం ఈ కళాశాలలో మెటల్ డిటెక్టర్లనూ ఏర్పాటు చేసింది. ఐడెంటీ కార్డు లేకుండా ఏ ఒక్కరూ ఈ కళాశాలలో అడుగు పెట్టలేరు. ఆఖరికి విద్యార్థులను చూసేందుకు వచ్చే తల్లిదండ్రులూ ఐడెంటీ కార్డు చూపించాల్సిందే. వారికీ కాలేజీ యాజమాన్యం ఐడీ కార్డులను ఇచ్చింది. ఇవన్నీ విద్యార్థినుల భద్రత కోసమేనని చెబుతోంది యాజమాన్యం. ఇన్ని రకాల భద్రతా చర్యలు తీసుకున్నారు కనుకనే ఈ కాలేజీని తల్లిదండ్రులూ విశ్వసిస్తున్నారు. తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఎలాంటి భయం లేకుండా బయటకు పంపిస్తున్నారు. ఈ కళాశాలకు యూనిఫాం కూడా ఉంది.

> "కో ఎడ్యుకేషన్ కాలేజీకి పంపించడం మా అమ్మానాన్నలకు ఇష్టం లేదు. ఈ కాలేజీ గురించి తెలిశాక వారు నన్ను మళ్ళీ చదువుకునేందుకు అనుమతించారు. ఇక్కడ భద్రత ఉండడమే అందుకు కారణం" అంటుంది ఇక్కడ బాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ చదువుతున్న వందన. కాలేజీకి 45 కిలోమీటర్ల దూరంలోఉన్న దబ్రా గ్రామం నుంచి ఆమె ఇక్కడకు వస్తోంది. ఉచిత రవాణా సౌకర్యమూ తమకు కలసివస్తోందని చెబుతోంది వందన. తనలాగే ఇతర గ్రామాల నుంచీ బాలికలు ఈ కళాశాలకు వస్తున్నారని వివరించింది రైతు బిడ్డ వందన.

> గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు సాధారణంగా తమ పిల్లలను కో ఎడ్యుకేషన్ కాలేజీలకు పంపించేందుకు ఇష్టపడరు. అందువల్లే ఇంటర్ తర్వాత డిగ్రీ చదివే ఆడపిల్లలు బాగా తగ్గిపోతున్నారు. ఈ విషయాన్ని అర్థం చేసుకునే బాలికల కాలేజీని ఏర్పాటు చేశాం అని చెబుతున్నారు ఎన్‌జీఓ అధ్యక్షుడు శంకర్ లాల్ పర్సావత్. పదేళ్ళ క్రితం 2007లో ప్రారంభమైన ఈ కాలేజీ నూటికి నూరుశాతం ఉత్తీర్ణతా రికార్డును సాధిస్తోందని ఆయన వివరించారు.

ఈ కాలేజీలో చదువుకునే ప్రతి బాలిక కోసం ఏటా దాతల నుంచి రూ. 11 వేలు సేకరిస్తోంది ఎన్‌జీవో దిండ్వానా వికాస్ పరిషత్ సమితి. ప్రస్తుతం ఈ కాలేజీలో మూడు రకాల కోర్సులు ఉన్నాయి. అవి బాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, బాచిలర్ ఆఫ్ కామర్స్, బాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరిన్ని కొత్త కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉందీ కాలేజీ.

బాలికల విద్య కోసం ఇంతచేస్తున్న ఈ ఎన్‌జీవోకి అభినందనలూ వెల్లువెత్తుతున్నాయి. "ఈ ఎన్‌జీవో, ఈ కళాశాల నిజంగా మంచి పని చేస్తోంది. వాళ్ళు చేస్తున్న కృషి వల్ల మధ్యలోనే చదువు ఆపేస్తున్న బాలికల సంఖ్య తగ్గుముఖం పడుతుంది" అన్నారు నాగౌర్ జిల్లా కలెక్టర్ కుమార్ పాల్ గౌతమ్. ఆడపిల్లలకు మంచి చదువులు చెప్పించేందుకు, వారు మంచి కెరీర్‌ను నిర్మించుకునేందుకు ఇలాంటి ప్రోత్సాహం అవసరం అంటున్నారు సామాజిక విశ్లేషకులు. తల్లిదండ్రుల్లో భయాన్ని పోగొట్టి పిల్లల్ని కాలేజీకి పంపించేలా చేయడం నిజంగా అభినందించదగ్గ విషయం అని కొనియాడుతున్నారు.

భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే రాజస్థాన్ లాంటి రాష్ట్రంలో ఒక ఎన్‌జీవో ఆడపిల్లల కోసం ఇలాంటి కాలేజీని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం. ఈ సంస్థ ఈ చర్యలను ఇలాగే కొనసాగించాలి. ఒక్క రాజస్థాన్‌లోనే కాదు దేశవ్యాప్తంగా మిగతా రాష్ట్రాలన్నింటిలోనూ ఇలాంటి కళాశాలలు రావాలి. బాలికలందరికీ ఉచితంగా విద్యనందించాలి. వారి భద్రతకు భరోసా కల్పించాలి. ఉన్నత విద్యావంతులను చేయాలి. వారికి మంచి కెరీర్‌ను అందించాలి. ఆర్థిక స్వేచ్ఛను ఇవ్వాలి. అప్పుడే ఈ సమాజం, దేశం బాగుపడతాయి. మంచి వ్యవస్థ ఏర్పడుతుంది.



ఇవీ పువ్వులే !

అగ్గిపుల్లలు దండ గుచ్చినట్లుగా ఉన్న ఈ పువ్వులు భలే చిత్రంగా ఉన్నాయి కదా! ఇవి బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంస్థ భవనం ఆవరణలో పూచిన పువ్వులు.

శీతలంలో కంది సూప్!





మనకు కందిపప్పు తెలుసు. దాదాపుగా నిత్యం వాడుతూనే ఉంటాం. మరి కందులు తెలుసా? వాటిని ఎప్పుడైనా తిన్నారా? కందుల్ని దంచితే లేదా మిల్లుపడితే వచ్చేదే కందిపప్పు. కందుల్ని పప్పురూపంలోనే కాదు యథాతథంగా అలాగే తీసుకోవచ్చు. వీటివల్లా అపారమైన లాభాలు ఉన్నాయి. కందులు మంచి రుచిగా ఉండడమే కాదు మంచి పోషకాలనూ అందిస్తాయి. ముఖ్యంగా ఈ శీతాకాలంలో కందులతో సూప్ చేసుకుని తాగితే ఆరోగ్యం కుదుటపడుతుంది. పచ్చిగా ఉండే కందిగింజల్ని తినడం వల్ల వ్యాధి నిరోధక శక్తీ పెరుగుతుంది. కందులను ఉడికించి తింటే జలుబు, జ్వరం ఎగిరిపోతాయి. కందిసూప్ తాగితే దగ్గు, శ్వాసకోస వ్యాధులు తగ్గుతాయి. కందిపప్పుతో చేసే వంటకాలను రోజూ తీసుకున్నా, కందికాయలను ఉడికించి తిన్నా, లేదా సూప్‌గా తయారుచేసుకుని తాగినా శ్వాస సమస్యలు తొలగిపోతాయి.

కందులతో పప్పు వండుకోవడమే కాదు ఈ గింజల్ని ఇతర సూప్‌ల్లోనూ వేసుకుని తాగవచ్చు. ఇవి సూప్‌లకు మంచి రుచిని ఇస్తాయి. కందుల్లో ఉండే మాంసకృత్తులు ఆరోగ్యానికి గొప్ప మేలు చేస్తాయి. ఇవి చర్మం ఆరోగ్యానికీ ఉపయోగపడతాయి. అంతేనా వీటిని సౌందర్య పోషణకూ ఉపయోగించుకోవచ్చు. చెంచా కందుల పొడి, చెంచా తేనె కలిపి ముఖానికి రాయండి. వేళ్ళతో ముఖంపై మృదువుగా రుద్దుతూ తేలిగ్గా మసాజ్ చేయండి. పదినిముషాల తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. ఈ చిట్కా పొడి చర్మం ఉన్నవాళ్ళకి బాగా ఉపయోగపడుతుంది. ఇది ముఖానికి చక్కటి రంగునూ, ఛాయనూ తీసుకొస్తుంది.

జుట్టుకి నూనె రాస్తున్నారా!

ఇటీవల కాలంలో జుట్టు విరబోసుకుని తిరగడం ఫ్యాషన్ అయిపోయింది. ఇంట్లో ఉండే పెద్ద వాళ్ళు తప్ప నేటి కుర్రకారు జుట్టుకి నూనె రాయడమే మర్చిపోయారు. తలస్నానం చేసిన జుట్టుతో అలాగే తిరుగుతున్నారు. జుట్టు రాలిపోవడానికి, బాగా ఊడిపోవడానికి, తెల్లబడిపోవడానికి ఇదే ప్రధాన కారణమవుతోందంటే నమ్మలగరా? అవును, ఇది నిజం. జుట్టుకి నూనె సహజమైన పోషణని, బలాన్ని ఇస్తుంది. జుట్టు నాణ్యతను పెంచుతుంది. మీ జుట్టు రకాన్ని బట్టి తగిన ఆయిల్‌ని ఎంచుకుంటే మరింత మంచిది. తలకి నూనె రాసుకోవడానికీ ఓ పద్ధతి ఉంది. ఎలా బడితే అలా రాసుకోవడం కాదు. జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే వెంట్రుకలకు తప్పనిసరిగా నూనె రాయాల్సిందే. మాడుపై కలిగే ఒత్తిడి, హానికర బాక్టీరియా, ఫంగస్‌ల వల్ల కలిగే ఇన్‌ఫెక్షన్‌లను నూనె దూరం చేస్తుంది. రోజూ రాయడానికి ఇష్టపడవని వారు వారానికి ఒకసారి నూనె రాసి మసాజ్ చేసినా మంచి ఫలితం కనిపిస్తుంది. జుట్టు పెరుగుదలకు కావలసిన పోషకాలను తలపై చర్మం సహజంగానే ఉత్పత్తి చేస్తుంది. ఇందుకు తలపై చర్మానికి అందించే నూనెలు మరింత మేలు చేస్తాయి. అలాగని నూనె మరీ ఎక్కువగా రాయడమూ మంచిది కాదు. దీనవల్ల తలపై చర్మంలో ఉన్న రంధ్రాలు



మూసుకుపోయి వెంట్రుకలు, మాడుకి తీరని నష్టం కలుగుతుంది. తలపై చర్మం పొడిగా ఉన్న వారి కన్నా జిడ్డు చర్మం గలవారు తక్కువ నూనెను అందించాలి. అది కూడా ఎక్కువ తక్కువలు కాకుండా సమపాళ్ళల్లో అందించాలి. జుట్టుకి నూనె రాసే పద్ధతినీ తెలుసుకోవాలి. అది పాటించాలి. అవేమిటంటే....

- ✦ నూనె ఏదైనా వెచ్చబెట్టి గోరువెచ్చగా ఉన్నప్పుడు తలకు పట్టించింది. ఇది జుట్టుకు సులభంగా పడుతుంది. బాగా విస్తరిస్తుంది.
- ✦ నూనె రాసిన తర్వాత మీ చేతి వేళ్ళ చివర్లతో జుట్టు పైపైన కాకుండా మొత్తం కుదుళ్ళ వరకూ వెళ్ళి మసాజ్ చేయండి. చర్మంలోకి బాగా ఇంకేలా నూనె పెట్టండి.
- ✦ నూనెను ఎప్పుడూ నేరుగా తలమీద పోయవద్దు. మీ వేళ్ళను నూనెలో ముంచి తలకి రాసుకోండి. చేతి వేళ్ళతోనే మర్దనా చేయండి కానీ తలపైకానీ, జుట్టుపై కానీ ఎప్పుడూ అరచేతులతో రుద్దవద్దు.
- ✦ నూనె రాసిన తర్వాత కనీసం 15, 20 నిముషాలు బాగా మర్దనా చేయండి.
- ✦ తర్వాత తలపై చర్మం నూనెను సంగ్రహించుకునేందుకు వేడిగా ఉండే టవల్‌ను తలకు చుట్టండి.
- ✦ తలకి బాగా నూనె పట్టించి మర్దనా చేసిన తర్వాత ఒక రోజంతా, కనీసం ఒక రాత్రంతా అలాగే ఉంచండి. ఉదయం మంచి షాంపూతో తలస్నానం చేయండి.
- ✦ రోజు కాకపోయినా వారం ఒకసారయినా ఇలా మీ చుట్టుకు మంచి నూనెతో బలాన్ని అందించండి.

ఒంటరితనం పరార్...

తీరికలేని పనుల్లో ఉన్నప్పునడు దొరికే ఏకాంత సమయం అంతులేని ఉపశమనాన్నిస్తుంది. మళ్లీ మనలో పునరోత్తేజం నింపుతుంది. కానీ... ఆ ఏకాంతం ఒంటరితనమైతే జీవితం నరకంగా ఉంటుంది. అలాంటి ఒంటరితనం దూరమై ఎల్లలు లేని సంతోషం మీ చేరువవ్వాలంటే ఈ చిన్న చిన్న పనులు చేయండి చాలు.

- ★ నిత్యం ఏదో ఒక వ్యాపకం పెట్టుకోండి. తీరికలేని పనుల్లో మునిగిపోండి. ఏదో ఓ పనిలో బిజీగా ఉంటే మీరు ఒంటరిగా ఉన్నారన్న విషయాన్నే మరిచిపోతారు.
- ★ ప్రశాంతమైన వాతావరణంలోకానీ, రద్దీ ఉన్నప్రదేశంలో కానీ చుట్టూ పరిసరాలను గమనిస్తూ నడవండి. మీకు స్కూటీ లేదా కార్ ఏది ఉన్నా రైడ్‌కు వెళ్లండి. లేదూ ఓ మంచి పుస్తకం చదవండి. ఆన్‌లైన్‌లో ఇప్పుడు బ్లాగ్స్ కోకొల్లలు. మీకు నచ్చిన మీకు తోచిన అంశాలపై బ్లాగ్ రాయండి. ఎన్నో కమ్యూనిటీస్ ఉన్నాయి అక్కడ మీ ఆలోచనలు, అనుభవాలు పంచుకోండి.
- ★ ఏ గమ్యం లేని ప్రయాణం ఎప్పటికైనా ప్రమాదమే. సో మీకు మీరు కొన్ని లక్ష్యాలను ఏర్పరచుకోండి. ఎప్పుడూ ఏదో ఓ పనిలో ఉండేలా చూసుకోండి. మీకు సంగీతం ఇష్టం అయితే ఏదైనా వాయిద్య పరికరం నేర్చుకోండి. ప్రస్తుతం టెక్నాలజీ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతోంది. ఏదో ఒకటి నేర్చుకొని మీ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోండి.
- ★ అందం అనేది ఇతరుల కోసమే కాదు. మీలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మిమ్మల్ని సంతోషంగా ఉంచుతుంది. కాసింత సమయాన్ని మీకు మీరు మెరుగులు దిద్దుకోవడానికి వినియోగించండి. మీలో వచ్చిన మార్పును గమనించండి. అప్పుడు వచ్చే సంతోషం వెలకట్టలేనిది. ఆరోగ్యకరమైన దేహం ఆరోగ్యకరమైన ఆలోచనలు ఇస్తుంది. మీ ఫిట్‌నెస్‌ను పెంచుకునే ప్రయత్నం చేయండి. దానికోసం జిమ్ లేదా యోగాలో చేరండి. అక్కడ కొత్త స్నేహితులు పరిచయమవుతారు. మీ ఒంటరితనం మాయమవుతుంది.
- ★ ఎలాంటి ప్రయోజనాలను ఆశించకుండా ప్రేమను పంచేవి జంతువులు. వాటిని మించిన స్నేహితులు లేరు. పిల్లి లేదా కుక్క ఇలా ఏదో ఓ పెంపుడు జంతువును పెంచుకోండి.
- ★ అలాగే ఉంటే మీరు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయే అవకాశం ఉంది. కాబట్టి మీలాంటి ఆలోచనలు కలిగినవారిని నిత్యం కలుస్తూ ఉండండి. గెట్ టు గెదర్స్ ప్లాన్ చేసుకోండి. విష్ యూ ఆల్ ది బెస్ట్!



అతడు-ఆమె

34



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

చదువుకొన్నదాన్ననీ, బారిష్టరు గారి భార్యననీ ఎంతో గౌరవించేవారు. ఇక్కడ ఈ బంగ్లాలో నడి సముద్రంలో తెప్పలాగున్నాను...ఇక్కు మారడం అంటే కొందరికి అతి సరదా. సినీమాకు నాటకానికి వెళ్లడం అంటే ఎంత సరదానో అంత. ఆ సామాను ప్యాకు. చెయ్యడం. ఆ రభస. కూలివాళ్లమీద అధికారం. నౌకర్లని తిట్లు - ఈ హంగామా అంతా మళ్ళా కొత్త యింట్లోను. అది యేమి హాయి ఆనందమోకాని, నాకు తలనొప్పి, పాము పారవిడిచినట్టు అస్తమానం మనం ఇక్కు మార్చుకోగలమా? ఇక్కుకూడా మనలో ఒక భాగం అయి పోవడవే? లేకపోతే - నేనే ముసలిదాన్ని అయి పోతున్నానా? మార్పు అంటేనే వస్తే దాని అంతరార్థం ఏమిటి? బుర్ర బెరడు గట్టిందనేగా?

(నిన్నటి సంచిక తరువాయి)

బట్టలు బీరువాలోకి సర్దుతున్నా. కర్ర పెట్టెలోంచి కర్పూరం, లవందరు వాసనలు, తళతళ కాకి బంగారం - నా పొందూరు జరీ చీరె - శాస్త్రి పామ్బీనా సూటు - ఆనాటి "మధు పర్కాలు-!" వాటిని చూసేటప్పటికి కడుపులో చెయ్యి పెట్టి కెలికేసినట్టయింది- గుండెలు ఝల్లుమన్నాయి - ఊపిరి సలపక - కళ్ళంట నీళ్ళు తిరిగాయి - నాల్గేళ్ళయింది అప్పుడే?....

శాస్త్రి ఇంటికొచ్చాడు - కొత్తింటికి - కొత్త పెళ్ళి కొడుకులా - అతని సరదా - హడావుడి - మరి చెప్పడానికి వీల్లే! నేనూ ఆ శ్రుతిలోనే కలుద్దాం అని ప్రయత్నించా. కాని వీణ తీగె చెమ్మ తగిలితే నాదం ఇస్తుందా? ఈ అలసట నిస్పృహ. "ఏం షేక్స్పియర్? మొహం వేలేశావ్? - మహారాణీ చేశాగా - నౌకర్లు - చాకర్లూ - రథాలు - వాహనాలు - వజ్రాలమేడ - పువ్వుల తోట - బంగారపు తూగుటుయ్యల! రావోయి? ఇల్లాగా!" అని పంట్లాం జేబుల్లో - రెండు చేతులూ - పెట్టుకుని - కాళ్లు ఠలాయించి - డాబు - అధికారంతో అనేసరికి నా కేమిటోలా అనిపించింది. "ఆ బంగారపు తూగు టుయ్యాలతోపాటు - నన్ను కూడా డబ్బిచ్చి కొన్నట్టేనా?" అని చటుక్కు నన్నా! - అని నాలుక కరచుకున్నా. అయ్యో! ఎంత మాటన్నాను? తన సర్వస్వం నాకోసం ధారపోయడం - నేనతని సంతోషంతో లీనం కాకపోవడం అసలు తప్పే. మీదు మిక్కిలి యీ తెలివితక్కువ మాట అన్నాను. కాని 'ఆ చూశావా - నేనెంత ప్రయోజ కుణ్ణో! ఇదంతా నాది - నువ్వుకూడా - ఈ మోటారు కార్లు - యీ సరంజాంతో పాటు-నా స్వంతం' అన్న గొంతుక వినిపించే సరికి నా నోటంట మాటలు - అప్రయత్నంగా జారి పోయేయి! అతను తెల్ల బోయాడు - ముఖం ముడతలు పడింది-కోపం వచ్చింది.కథ అడ్డంగా తిరిగింది-"డామిట్!" అని గిర్రని తిరిగి వెళ్ళిపోబోయాడు...చటుక్కున ఆ మధుపర్కాలు కళ్లోలాగ కంటి ముందరొచ్చాయి..... మా ప్రేమ - మా సంసారం - మా పాపాయి... ఆ వెళ్ళబోతున్నతన్ని కౌగలించుకున్నా...శాస్త్రికి కోపం అసలురాదు. వొచ్చినా ఇట్టే మాయం అయి పోతుంది.... శాస్త్రీ, పిచ్చిమాటన్నా క్షమించేం?..."ముద్దుపెట్టుకున్నాడు."నిన్ను క్షమించడమేమిటి? నీ ప్రేమంటే లక్ష్మీ సరస్వతులున్నట్టేగా! నువ్వు పూర్తిగా ఆరోగ్యరీత్యా, మానసిక రీత్యాకూడా జీవచ్ఛవాన్ని చేసేసింది. ఇప్పుడు ఈ పూల్‌బాగ్ వచ్చేశాం గనుక, ఇక ప్రాణవాయువు పీల్చు. మనం-మన జీవిత కథ మళ్ళీ మొదటినుంచి ప్రారంభిద్దాం - ఓనమఃల నుంచి - ఏం! అనగా - అనగా ఒక రాజు. ఆ రాజుకో కూతురు. ఆ కూతురు పేరట శాంతట. ఆ శాంతానికి మనో వ్యాధి పట్టుకుందిట - ఎంత మంది వైద్యులు మందిచ్చినా కుదరలేదట. చివరికి ఓ శాస్త్రులు గారు దారమ్మట పోతూంటే - రాజుగారు చూసి పిలిచింది. మా అమ్మాయికి మందిచ్చి కుదిర్చితే అర్ధరాజ్యం-కూతుర్ని ఇస్తామన్నారట - ఓ ఇంత కంటేనా నేచెప్పే వైద్యం - పుచ్చుకోమని, మందులు పత్యం-పానం మాత్రం వేయించాలి అన్నాడుట. ఆ రోజు నుంచి వైద్యం ఏమిటి?- రోజూ ప్రొద్దున్న షికారు - మధ్యాహ్నం స్నేహి తుల యింటికి "విజిట్లు" - సాయంత్రం బీచి - రాత్రి సినిమా - తరువాత కన్నిమేరాలలో భోజనం. రోజు



విడిచి రోజు - ఇంట్లో టీపార్టీ - తెలిసిందా యీమందే మందు! ఇదే సంజీవి!" అంటూ నన్ను చెయ్యిపట్టుకుని లేవదీసి గిర్రని ఉప్పలగుప్ప తిప్పేశాడు! "ఈ కథ బాగుంది. ఈ కథమాత్రం కంచికి వెళ్ళడం - నువ్వు మీ ఇంటికి నేను మాయింటికి వెళ్ళడం మాత్రం ఉండ కూడదు సుమా!" అన్నా. రాత్రి నాటకానికి వెళ్ళేం. సుగుణ విలాస సభవారి తారాశశాంకం. తరువాత - బసోటోలో కాఫీ -ఇంటికొచ్చాం. పిల్లకి మెళుకువొచ్చింది. ఇల్లు కొత్త. అదే ఏడుపు. శాస్త్రికి తలవాల్చగానే గుర్రున నిద్ర-నాకు పట్టలే... మళ్ళీ కథ కొత్తగా మొదలెట్టగలమా? అనినాకు భయంగా వుంది...

44 అతడు

అమ్మయ్య! మళ్ళీ యెప్పుడేనా "నా" అని దేన్నేనా అనగలనా అనిపించింది! ఆ రోజులన్నీ సూర్యుడిముందర పొగమంచులా ఎగిరిపోయాయికద! నా ఇల్లు, నా మోటారు కారు, నా శాంతం, నా పాపాయి - ఇంతకంటే ఏం కావాలి ఎవడికేనా! ప్రపంచంలో నన్ను ఇంక "హా" అని అనేవాడు లేడుకదా! శాంతంలో మునపటి చురుకుదనం మళ్ళీ తీసుకు రావాలి. "నివురు గప్పిన నిప్పువోలె" వున్నదాన్ని కాస్తవూది, నిప్పుని మంటని చెయ్యాలి. అంతే, అప్పుడు మళ్ళీ నా శాంతం అయిపోతుంది. "బారు" వాళ్ళందరికీ వో రెండు డిన్నరు పార్టీలు, క్లబ్బు స్నేహితులకి రెండు గార్డెను పార్టీలు ఇచ్చినా - ప్రాక్టీసుకీ మంచిది, శాంతానికి సరదాగానూ ఉంటుంది "నా" అనగలిగే తాహతు వుంటే యెంత హాయి?! నా శాంతం - నా ఇల్లు - నా మోటారు....అబ్బే! వ్రాసినదే మళ్ళీ వ్రాస్తున్నా నేమిటి?.....

అబ్బ! కొంతమందితో మహాకష్టం. చామంతి పువ్వులంటే మా శాంతం చెవి కోసుకుంటుందా-అలాగని సాయంత్రం ఇంటికొచ్చేటప్పుడు హార్టికల్చరల్ సొసయిటీనుంచి ఎంచి తెచ్చా చామంతులు. శాంతం పుచ్చుకుంది. తల్లోను పెట్టుకోలేదా - పోనీ, "వాజ్"లో పెట్టలేదూ - ఏమిటో అలాగా బల్లమీద అశ్రద్ధగా పడేసింది. అవి కాస్తా వాడి పూరుకున్నాయి. బోలెడు డబ్బయింది కూడాను. మరి యెందుకో ఆ నిస్పృహ, నిరుత్సాహవున్ను? ఏం కొరత - తాజ్‌మహల్ లాంటి యిల్లాయె - నందనవనంలాంటి తోటాయె - బంగారపు బొమ్మ పాపాయి - బేబీ ఆస్టిన్ ఫోర్డూ పోయి, సాక్షాత్తు రోల్సు రాయిస్సాయె - అంట్లుతోమడానికి దాసీ - ఇళ్ళు తుడవడానికి మరో మనిషి - పాపాయి కోసం ఆయా - బట్టలుతకడం, పక్కలు వెయ్యడం వొడ్డిమంగలాడు - గుమ్మంలో హమేషా బంట్రోతు - తోటకారు, తోటకారు పెళ్ళాం - కారు డ్రైవర్లిద్దరూ - గుమాస్తా, గుమాస్తా పెళ్లాం ఎప్పుడేనా ఇంట్లో సానియాకాయె - ఏమిటి తక్కువ? ఆ అదికాదు. ఆ రాయపురం వాతావరణం లక్షణం ఇన్నాళ్ళు ? ఎలా భరించిందో కదా? నాకైతేనా - రోజూ క్లబ్బు, టెన్నీసు, మీటింగులు - ఇవన్నీ వుండేవిగా. పాపం, శాంతానికి ఇల్లు చూచుకోవటం, పిల్లని చూసుకోవడంతోనే సరిపోయేది. నే అనుకున్నట్లు శాంతం నేనూ మళ్ళీ మొదటి దగ్గరినుంచి మొదలెట్టాలి. రాత్రి తెల్లవారంతా, ఆ వరండామీద, నల్లని చీకటిరాత్రిలో మాట్లాడుతూ గడిపేం. నాల్గేళ్ళ క్రింద శాంతంలాగు అగుపించింది. ఎన్నాళ్ళో అయింది ఇంత హాయిగా మాట్లాడుకుని.

మొట్టమొదటి రోజులు జ్ఞాపకం వస్తున్నాయి. ఈ వేళ లాగే ఆ వేళ రాత్రి అంతా మాట్లాడుకున్నాం. కాని ఇప్పట్లా అంతులేని చర్చలు లేవు ఆ రోజుల్లో. ఆ రోజులు తేలికగా వెళ్ళిపోయాయి. ఎంచేతనంటే పువ్వులతోనూ, నిండిపోయేది. ఒకరిని ప్రపంచకం! సంసారం అంతా వలపుతోనూ పువ్వులతోనూ, నిండి పోయేది. ఒకరిని వొకరం ఎడబాసి వుండలేకపోయేవాళ్ళం. మోహంలో లీనం అయిపోయేవాళ్ళం. నిజంగా ఆలోచిస్తే మూడువంతులు వలపు వకవంతు ప్రేమ. ఆ రోజులు తల్చుకుంటే ఇప్పుడు సిగ్గుగా వుంటుంది. ఒకరి నొకరం చూచుకుని మురిసిపోయేవాళ్ళం.

ఇప్పుడు మనసు, వొళ్ళు కూడా సాధువయి పోయాయి.

ఆరోజుల్లో వలపు, ప్రేమ, ఆనందం అనుభవించాము. కాని నూతిలో కప్పల్లాగా వుండేది మా జీవితం. "అజ్ఞానం"లో వుండి హాయి అనుభవించడం ఉత్కృష్ట జీవితమా? లేకపోతే విజ్ఞానం సంపాదించి అసంతృప్తితో బ్రతకడం. ఆ అసంతృప్తే ఆనందం అనుకోవడం ఉత్కృష్టమా? "ఓ" అంటే "నా" రాని వాళ్ళెంత మంది హాయిగా బతకడంలేదు? మొగాడు ఆడదీకూడ రోజల్లా కాయకష్టంపడి, రాత్రి అయేసరికల్లా కలో గంజో తాగి, సంసారాలు చేసుకుంటూ ఆ విధంగా హాయి అనుభవించేవాళ్ళు ఎంత మంది లేరు? వాళ్ళనిచూస్తే నాకు ముచ్చట వేస్తుంది! వాళ్ళకి ఓ రాజకీయం అక్కర్లేదు, ఓ వేదాంతం చర్చలు అక్కర్లేదు. ఓ వాఙ్మయ విమర్శ అక్కర్లేదు, కదా!

అక్కరలేని చిత్తక్షోభ పెట్టుకోకుండా శాంతం నేనూ ఎందుకలా హాయిగా వుండకూడదు? ఈ నాగరికతలూ - ఈ చదువులూ - ఈ సంస్కరణలూ - ఈ చర్చలూ నాకేం నచ్చడం లేదు. నిరాడంబరమైన బ్రతుకు - ఆనందమైన జీవితం ఎందుకు ఆదర్శంగా పెట్టుకోకూడదు - శాంతం నేనూను?....

ఈవాళ ఏమిటో నిస్త్రాణగా ఉంది. హెచ్చరిక లేదు. బ్రతుకంతా అతుకుల బొంతలా ఉంది. అనుకున్నది ఏదీకూడా ఒక వరసా - ఒక వావిలో జరగడం లేదు. ఇంటికెళ్ళాలని బుద్ధె య్యడం లేదు. పని తొందరచేత వూళ్ళోనే భోజనంచేసి ఇంటి కొస్తానని శాంతానికి టెలిఫోనుచేసి లేడీ అయ్యంగారింటికి వెళ్ళి వాళ్ళింట్లో భోజనం చేస్తా.

అదేమిటోకాని ఇంటిగురించి సంసారం గురించి చివరికి నాగురించేనా కూడా ఎవరితో మాట్లాడ్డానికి బుద్ధి పుట్టడం లేదివాళ.మళ్ళీ మరో మాటాలోచిస్తే సంసారం - యిల్లు - పాపాయి - శాంతం మినహాయిస్తే నాకు మిగిలినదేమిటి? నా ఆశలు ఆశయాలు కోర్కెలు ఎవరి కోసం?

పెళ్ళి చేసుకోనంతవరకు గాలి గుడ్డు. మోహంలో పడినంత సేపు ఝంఝూ మారుత బీభత్సం.తరువాత సంసారంలో ఆగమ్యగోచరం అయోమయమున్నా! నాకొక్కడికేనా లేక అందరికీ ఇదే అనుభవమా?

- ఇంకా వుంది.

భారతీయ భాషల్లో ఆధునిక సాహిత్యం

(నిన్నటి సంచిక తరువాయి)

★ విష్ణుశాస్త్రి చిప్లూంకార్ ప్రారంభించిన ఈ పత్రిక బాలగంగాధర తిలక్ నేతృత్వంల ఆ తరువాత దేశవ్యాప్త ప్రచారం పొందింది.

★ **కేశవసుత (1866-1905)** : ఆధునిక మరాఠీ పద్యోద్యమాన్ని 1885లో ప్రారంభించిన ఘనత ఈయనకు దక్కుతుంది.

★ **మాధవ్ జూలియన్ (1894-1939)** : సమకాలీన అభ్యుదయ కవులు, రచయితలతో ఈయన 1923 ప్రాంతంలో 'రవికిరణ్ మండలి' అనే సారస్వత మండలిని ఏర్పాటు చేశారు.

★ అతిత్వరలోనే మరాఠీ సాహితీ ప్రాంగణంలో ఈ మండలి ప్రఖ్యాతమైంది.

★ మాధవ్ జూలియన్ పద్యరచన - 'విరహతరంగ్' ఎంతో పేరుతెచ్చింది.

★ బి.ఆర్.తంబె (1874-1941), చంద్రశేఖర్ గొర్హె (1871-1937), మనోరాంబాయి రణడే (1896-1926) వంటి కవులు కూడా చాలా ప్రఖ్యాతి గాంచారు.

★ ఇక జాతీయోద్యమ కవుల్లో ప్రముఖులు బాలగంగాధర తిలక్, వి.డి.సావర్కర్, జి.టి.దేవేకార్ (1874-1956), ఎస్.ఎస్.రాణడే (1892- 1984), ఎస్.జి.దేశ్‌పాండే, బి.ఎస్.మార్ధేకార్, పి.ఎస్.రాగె, ఎస్.సి.కేల్కార్ (1872-1947), ఎస్.కె.కొల్హాట్కార్, సి.వి.జోశి, విందా కరండికార్, వసంత్ బాపట్, శాంతా షేల్కే వంటివారు ఆధునిక మరాఠీ సాహిత్య నాలుగవ దశలో ఎంతో ప్రఖ్యాతి వహించారు.

మరాఠీ తొలి నవల

★ హరినారాయణ్ ఆప్టే (1864-1919) రచించిన మాధలీ స్థితి, మరాఠీలో ప్రచురితమైన మొట్టమొదటి నవల.

★ బాబా పదంజీ 1857లో రాసిన 'యమునా పర్యటన్' ఎంతో పేరుతెచ్చి పెట్టింది.

★ సాంఘిక సంస్కరణల ఇతివృత్తంగా రాసిన మొట్టమొదటి మరాఠీ నవల ఇది.

★ నాథా మాధవ్, సి.వి.వైద్య, ప్రొఫెసర్ వి.ఎం.జోశీ, వి.ఎస్.ఖండేకర్, సాణెగురూజీ, కుసుంవతీ దేశ్‌పాండే, కమలాబాయ్ తిలక్ వంటివారు మరాఠీ నవలను సుసంపన్నం చేశారు.

★ మరాఠీలు, దళిత సాహిత్యంలో వెలువడిన మొట్టమొదటి ఆత్మకథ 'బలూటా'. దీనిని దయా పవార్ రాశారు.

ఆంగ్ల సాహిత్యం

★ భారతదేశంలో ఆంగ్లేయుల పాలన మూడు ప్రధాన నగరాలైన కోల్‌కతా (కలకత్తా), చెన్నై (మద్రాసు), ముంబాయి (బొంబాయి)లలో ఆంగ్లవిద్య వేళ్లూనుకున్న తరుణంలో అంటే 18వ శతాబ్ది చివర కాలంలో ఇక్కడ ఆంగ్ల సాహిత్యానికి పునాది పడింది.

★ 'ఈస్టిండియా కంపెనీ'గా తరువాత బ్రిటిషర్ల పాలన సాగించింది కోల్‌కతా నుంచే కావడంతో తొలికాలంలోని భారత ఆంగ్ల సాహితీవేత్తలంతా ఈ నగరం వారే కావడం గమనార్హం.

★ ఆంగ్లభాషలో రచనలు సాగించిన ఆద్యుడిగా రామ్‌మనోహర్ రాయ్‌ను పేర్కొనవలసి వస్తుంది. ఆ తరువాత 19వ శతాబ్దంలో ఆయన అడుగుజాడల్లో హెన్రీ డెరోజియో, మైకేల్ మధుసూదన్ దత్ నడిచారు.

★ **టోరుదత్ (1885-1906)** : కేవలం 21 సంవత్సరాల కాలమే జీవించినా టోరుదత్ ప్రభావం భారతీయ ఆంగ్ల సాహిత్యంపై అపారం. ఆమె కేవలం ఆంగ్లంలో పద్యకవిత్వం రాయలేదు. ఫ్రెంచి పద్యాన్ని కూడా ఆమె అనువదించడం గమనార్హం. ఏన్సియంట్ బల్లాడ్స్, లెజండ్స్ ఆఫ్ హిదుస్థాన్ అన్న గ్రంథాలు ఆమెకు ఎనలేని పేరు తెచ్చాయి.

★ **బంకించంద్ర ఛటర్జీ** : బంకింబాబు ఇంగ్లీషులో రాసిన 'రాజ్‌మోహన్స్ వైఫ్' అనే నవల దేశంలో వచ్చిన తొలి ఆంగ్ల సాహిత్యంలో భాగంగా గుర్తింపు పొందింది.

★ **రవీంద్రనాథ్ ఠాగూర్** : ఈ కాలం నాటి ప్రఖ్యాత సాహితీవేత్తగా రబీంద్రనాథ్ ఠాగూర్‌నే చెప్పుకోవాలి. ఆయన బెంగాలీ భాషలో అంతకుముందే రాసిన గీతాలకు ఆంగ్ల రూపమే 'గీతాంజలి'. 1913లో ఈ సాహితీ రూపానికి నోబెల్ బహుమతి లభించింది.

★ **సరోజినీ నాయుడు (1879-1949)** : ఆంధ్రులకు సుపరిచితురాలైన సరోజినీ నాయుడు రాసిన ఆంగ్లపద్య సాహిత్యం అటు ఐరోపాను, ఇటు భారతదేశాన్ని పులకింపజేసింది. 1905లో ఆమె రాసిన 'గోల్డెన్ థ్రెషోల్డ్' 1917 నాటి బ్రోకెన్‌వింగ్ ఎంతో సాహితీ విలువగల గ్రంథాలు.

★ **అరబిందోఘోష్ - (1872-1950)** : అరవిందుడు కేవలం కవే కాదు. గొప్ప తాత్వికుడు. అన్నింటికీ మించి మహా యోగి. ఆయనకు కవిత అనేది యోగం వంటిది. ఆయన ఆవిష్కరించిన 'సావిత్రి' నవల, 'లైఫ్ డివైన్' (రెండు సంపుటాలు) ఆంగ్ల సాహిత్యంలో ఆణిముత్యాలు. భాషాభేదం లేకుండా ఆధ్యాత్మిక సుగంధాన్ని పంచి ఇస్తున్న మలయ మారుతాలు.

★ **గాంధీ** : స్వాతంత్ర్యోద్యమ సారథి మహాత్మా గాంధీ చేతుల్లో ఆంగ్లభాష ఎక్కుపెట్టిన బాణంలా తయారైంది. యంగ్ ఇండియా, హరిజన పత్రికలలోని ఆయన రచనలు బ్రిటీష్ వారికి ఆగ్రహం తెప్పించగా, ప్రజలను చైతన్యపరిచాయి. 'మై ఎక్స్‌పెరిమెంట్ విత్ ట్రూత్' అన్న ఆయన ఆత్మకథ సాహితీపరంగా ఎంతో పేరు తెచ్చుకొంది.

★ **జవహర్‌లాల్ నెహ్రూ (1889-1964)** : భారత్ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆంగ్ల వచన రచనలలో ఉద్దండుడిగా పేరు పొందారు. గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ, డిస్కవరీ ఆఫ్ ఇండియా, బంచ్ ఆఫ్ ఓల్డ్ లెటర్స్ ఆయన గ్రంథాలు.

★ **ఆంగ్ల సాహిత్యంలో ప్రముఖ వ్యక్తులు** : ముల్క్‌రాజ్ ఆనంద్, ఆర్.కె. నారాయణ్, రాజారావు భారత ఇంగ్లీషు నవలాకారులుగా ప్రసిద్ధి చెందారు. ముల్క్‌రాజ్ ఆనంద్ (1905-) రాసిన 'ది లాస్ట్ చైల్డ్' కథానిక ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఆయన పద్యం, గద్యం, నాటకంలోనూ అందెవేసిన చేయి. ఆయన నవలలైన కూలీ(1933), అన్‌టచబుల్ (1935), ది ఉమన్ అండ్ ది కీ (1960) చదివితే భారత సమాజంలోని అట్టడుగు వర్గాల వ్యథలు, బాధలు కళ్లకు కట్టినట్లు కనబడతాయి.

★ **ఆర్.కె.నారాయణ్** : ఆంగ్ల నవలా రచయితగా పేరెన్నికగన్నవారిలో ఆర్.కె. ఒకరు. ఆయన కథలన్నీ 'మాల్గుడి' అనే ఊహాజనిత గ్రామం కేంద్ర బిందువుగా తిరుగుతాయి. ఆయన మొట్టమొదటి నవల స్వామి అండ్ ఫ్రెండ్స్ (1935). తరువాత బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (1937), ది ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ (1952), ది గైడ్ (1959), వెయిటింగ్ ఫర్ ది మహాత్మా (1955) మొదలైనవి ప్రఖ్యాతి పొందిన ఇతర నవలలు. పెయింటర్ ఆఫ్ ది సైన్స్, మై డేట్ లెస్ డైరీ, వెండర్ ఆఫ్ స్వీట్స్, ద మాన్ ఈటర్ ఆఫ్ మాల్గుడి మొదలైనవి వీరి ఇతర రచనలు.

ఇక రాజారావు (1909) చేతినుంచి జాలువారిన నవల 'కాంతాపురం'(1938) గ్రామీణ భారతావనికి ప్రతిబింబంగా చెప్పాలి. ది సర్పెంట్ అండ్ ది రోప్ (1960), ది క్యాట్ అండ్ షేక్స్పియర్ (1965) ఆయన రాసిన ఇతర నవలలు.

★ **నీరద్ సి. చౌదరి (1897-1999)** : 'ఎన్ అన్‌నోన్ ఇండియన్' పేరిట ఆత్మకథ రాసిన నీరద్ చౌదరి కూడా భారత ఆంగ్ల సాహితీకారుల్లో చిరస్మర ణీయులు. ఆయన రచన విశ్వవిఖ్యాతమైనది. ది కాంటినెంట్ ఆఫ్ సర్కస్, టు లివ్ ఆర్ నాట్ టు లివ్, దై హ్యాండ్, గ్రేట్ అనార్క్ 'ది పేసేజ్ టు ఇంగ్లాండ్' వంటి ఇతర రచనలు కూడా ఆయన ఆంగ్ల సాహితీ రచనా పటుత్వానికి మచ్చు తునకలు.

★ **సల్మాన్ రష్దీ** : మిడ్‌నైట్స్ చిల్డ్రన్, షేమ్, గ్రైనస్, ది జాగువాల్ స్మైల్ అనే రచనలు రష్దీకి ప్రఖ్యాతి తెచ్చిపెట్టాయి. 'ది శటానిక్ వర్సెస్'లో ఇస్లామిక్ మతంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇరాన్ మతపెద్దలకు ఆగ్రహాన్ని తెప్పించడమే కాకుండా ఆయనకు మరణశిక్ష విధించేలా చేశారు. అప్పటినుంచీ ఆయన అజ్ఞాతంలో ఉంటున్నారు.

★ **విక్రమ్ శేత్** : ఎ స్యూటబుల్ బోయ్, ది గోల్డెన్ గేట్, ది హంబుల్ ఎడ్మినిస్ట్రేటర్స్ గార్డెన్, ఆర్ యు స్లీప్ టు నైట్, బీస్ట్లీ టేల్స్ ఫ్రం హియర్ అండ్ దేర్ శేత్ రచనలు.

★ **అనితా దేశాయ్** : ఫైర్ ఇన్ ది మౌంటెన్స్, క్లియర్ లైట్ ఆఫ్ ది డే, ది విలేజ్ బై ది సీ, క్రై ది పీకాక్, బైబై బ్లాక్ బర్డ్, ఇన్ కస్టడీ.

★ **కుష్వంత్ సింగ్** : ఈయన ప్రముఖ నవలాకారుడు. కథానిక రచయిత. సింగ్ ప్రఖ్యాత రచన 'ట్రైన్ టు పాకిస్థాన్'. ఆయన ఇతర రచనలు : ఢిల్లీ, ఐషల్ నాట్ హియర్ ది నైటింగ్ గేల్.

★ **అమితవ్ ఘోష్** : ఈయన ప్రముఖ నవలాకారుడు. ముఖ్యంగా సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రలపై రచనలు కొనసాగిస్తారు. ఆయన రచనలు : ది షాడో లైన్స్, ఫ్లడ్ ఆఫ్ ఫైర్, ది గ్రేట్ డిరేంజ్‌మెంట్, ది గ్లాస్ ప్యాలెస్ మొదలగునవి.

★ **సైరస్ మిస్త్రీ** : క్రానికల్స్ ఆఫ్ ఎ కార్ప్స్ బియరర్, ప్యాసన్ ఫ్లవర్, ది రేడియన్స్ ఆఫ్ ఏషెస్ మిస్త్రీకి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి.

★ **కిరణ్ దేశాయ్** : ఈమె రచనలు ప్రారంభం నుండి ముగింపు వరకు చాలా స్పష్టతతో కూడి ఉండటం ప్రత్యేకత. ఈమె ప్రముఖ రచనలు : ది ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ ది లాస్ (ఈ నవలకు 2006లో మ్యాన్‌బుకర్ ప్రైజ్ లభించింది), ఎంబ్లెమ్స్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్, జెనరేషన్ 15 మొదలగునవి

భారత రాజ్యాంగం గుర్తించిన 22 ప్రధాన భాషలు

★ **హిందీ** : దేశంలో అతి ముఖ్యమైన భాష. దేశ జనాభాలో 50శాతం మంది మాట్లాడతారు. ఇది, భారత ప్రభుత్వ అధికార భాష, దీనికి దేవనాగరిక లిపిని వాడతారు.

★ **అస్సామీ** : అస్సామ్ రాష్ట్రభాష. రాష్ట్ర జనాభాలో 65 శాతం మంది మాట్లాడతారు.

★ **బెంగాలీ** : పశ్చిమ బెంగాల్ రాష్ట్ర భాష. ఇది 13వ శతాబ్దంలో అభివృద్ధి చెందింది. సుమారు 200 మిలియన్ల మంది ఈ భాషను మాట్లాడుతారు.

★ **గుజరాతీ** : గుజరాత్ రాష్ట్ర భాష.

★ **కన్నడం** : కర్నాటక రాష్ట్రభాష, 65 శాతం మంది ఈ భాషను మాట్లాడతారు.

★ **కాశ్మీరీ** : జమ్మూకాశ్మీర్‌లో 55 శాతం మంది మాట్లాడతారు.

★ **కొంకణి** : గోవా ప్రాంతంలో మాట్లాడే ద్రావిడ భాష

★ **మణిపురి** : ఈశాన్య రాష్ట్రాలలోని మణిపూర్‌లో ఉన్న వాడుక భాష

★ **మరాఠీ** : మహారాష్ట్రలోని ఈ భాష 13వ శతాబ్దంలో అభివృద్ధి చెందింది.

★ **నేపాలీ** : ప్రజలలో 75 శాతం మంది నేపాల్ జాతీయులుగా ఉన్న సిక్కింలో వాడుకలో ఉన్న భాష.

★ **ఒరియా** : ఒరియా రాష్ట్రం జనాభాలో 87 శాతం మంది మాట్లాడతారు.

★ **పంజాబీ** : పంజాబ్ రాష్ట్ర భాష. సిక్కు గురువు గురు అంగద్ ఈ భాషకు ఒక లిపిని ఏర్పరిచాడు. ఆ లిపిని 'గురుముఖి'గా పేర్కొంటారు.

★ **సంస్కృతం** : ప్రపంచంలో అతి ప్రాచీనమైన భాష. వేదాలతోపాటు రామాయణ, భారతాది పురాణ గ్రంథాలు చాలా ఈ భాషలోనే రాయడం జరిగింది. ప్రస్తుతం దీనిని మృత భాషగా పేర్కొంటున్నారు.

★ **సింధీ** : ఈ భాషా వ్యవహర్తలు భారత, పాకిస్థాన్ దేశాలు రెండింటిలోనూ ఉన్నారు. పాకిస్థాన్‌లోని వారు ఈ భాషకు పర్సొ-అరబిక్ లిపి వాడుతున్నారు. భారతదేశంలో దేవనాగరి లిపి వాడుతున్నారు.

★ **తమిళం** : తమిళనాడు రాష్ట్రభాష. 73 మిలియన్ల మంది మాట్లాడుతున్నారు.

★ **తెలుగు** : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధికార భాష, సంఖ్యపరంగా హిందీ భాషా వ్యవహర్తల తరువాత దేశంలో రెండో స్థానాన్ని ఆక్రమిస్తుంది.

★ **ఉర్దూ** : జమ్మూ-కాశ్మీర్ అధికార భాష. దీన్ని పర్సో అరబిక్ లిపిలో రాస్తారు. ఈ భాషలో అనేకమైన పర్షియన్ పదాలు చేరాయి.

★ **బోడో** : బోడో భాషను అస్సాం ప్రాంతంలో మాట్లాడతారు.

★ **డోగ్రి** : జమ్మూకాశ్మీర్ పరిసర ప్రాంతాల్లో డోగ్రీ భాషను మాట్లాడతారు.

★ **మైథిలి** : మైథిలి భాషను బీహార్, జార్ఖండ్ ప్రాంతాలలో మాట్లాడతారు.

★ **సంతాలీ** : సంతాలీ తెగ గల బీహార్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, ఒడిశా పరిసర ప్రాంతాలలో సంతాలీ భాషను మాట్లాడతారు.

సమాప్తం

భారతదేశ విద్యలో మైలురాళ్లు

1781 - వారన్ హేస్టింగ్స్ కలకత్తాలో మదరసాను స్థాపించారు.

1791 - వారణాసిలో జోనాథన్ డంకన్ మదర్సాను స్థాపించారు.

1792 - బెనారస్‌లో సంస్కృత కళాశాలను స్థాపించారు.

1800 - కోల్‌కతాలో పోర్ట్ విలియమ్స్ కాలేజీని స్థాపించారు.

1817 - ఆ సంవత్సరం జనవరి 20న రాజారామ్మోహన్‌రాయ్ కోల్‌కతాలో హిందూ కాలేజీని స్థాపించారు. (1855లో దీనికి ప్రెసిడెన్సీ కాలేజ్ అని పేరు పెట్టారు)

1821 - పుణెలో సంస్కృత కళాశాల స్థాపన.

1826 - మద్రాసు గవర్నర్ ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో రెండు పాఠశాలలు, తహశీల్ పరిధిలో ఒక పాఠశాలను స్థాపించారు.

1834 - మంగళూరులో బేసెల్ మిషన్ ఏర్పాటు.

1835 - కోల్‌కతాలో మొట్టమొదటి (ఆసియాలోనే మొదటి) వైద్య కళాశాలను స్థాపించారు.

1844 - లార్డ్ హార్డింగ్ బెంగాల్‌లో 101 వెర్నాక్యులర్ స్కూల్స్‌ను ప్రారంభించారు.

1847 - భారత్‌లోనే మొదటి ఇంజినీరింగ్ కళాశాల అయిన రూర్కి ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించారు.

1854 - ఉడ్ డిస్పాచ్ కమిటీ విద్యారంగంలో నూతన సంస్కరణలు తీసుకువచ్చింది. ప్రతి ప్రావిన్స్‌లో సూచనలు ఇవ్వడానికి కొత్త విద్యా విభాగాన్ని సృష్టించారు.

1855 - బొంబాయి, మద్రాస్, బెంగాల్, వాయువ్య రాష్ట్రాలలో ప్రత్యేక విద్యాశాఖల ఏర్పాటు

1857 - విద్యపై హంటర్ కమిటీ నియామకం. మొత్తం విద్యను ప్రభుత్వం నుండి లోకల్ బోర్డ్స్‌కు, ప్రైవేటు రంగానికి గ్రాంట్- ఇన్ ఎయిడ్ విధానానికి మార్చారు.

1882 - పంజాబ్ యూనివర్సిటీ ఏర్పాటు

1887 - అలహాబాద్ యూనివర్సిటీ ఏర్పాటు

1897 - ఉద్యోగాల నియామకాలపై భారత విద్యాసర్వీసు ప్రారంభం

1902 - యూనివర్సిటీ కమిషన్ ఏర్పాటు

1904 - యూనివర్సిటీ చట్టం రూపకల్పన

1906 - బరోడా రాష్ట్రం నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టింది.

1910 - కేంద్రంలో ప్రత్యేక విద్యాశాఖ ఏర్పాటు

1916 - బొంబాయిలో ఎస్ఎన్‌డీటీ మహిళా విశ్వవిద్యాలయ స్థాపన

1917 - స్లాడర్ కమిషన్ నియామకం

1924 - ఇంటర్ యూనివర్సిటీ బోర్డు స్థాపన

1928 - ఆధునిక విద్యాభివృద్ధిని సమీక్షించేందుకు హార్టాగ్ కమిటీ నియామకం

1937 - వార్ధా విద్యా ప్రణాళిక లేదా ప్రాతినిధ్య విద్య

1944 - సార్జంట్ విద్యా ప్రణాళిక

1948 - విశ్వవిద్యాలయాల విద్యపై రాధాకృష్ణన్ కమిటీ ఏర్పాటు, 10+2 విద్యా విధానాన్ని, త్రీ లాంగ్వేజెస్ ఫార్ములాను సూచించారు.

1950 - భారత రాజ్యాంగంలో ఉచిత, నిర్బంధ విద్యను ఒక ఆదేశిక సూత్రంగా ప్రవేశపెట్టడం జరిగింది.

1951 - ఖరగ్‌పూర్‌లో మొట్టమొదటి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ని స్థాపించారు.

1952 - సెకండరీ విద్యపై మొదలియార్ కమిషన్ నియామకం

1953 - స్వయం ప్రతిపత్తిగల యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు

1956 - పార్లమెంట్ చేసిన యాక్ట్ ద్వారా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటైంది

1958 - మహిళా విద్యపై జాతీయ కమిటీ నియామకం

1959 - జాతీయ విద్యామండలి స్థాపన

1964 - అన్ని స్థాయిలలో విద్యపై అధ్యయనం చేయడానికి కొఠారి కమిషన్ నియామకం

1968 - జాతీయ విద్యావిధానం ప్రకటన

1976 - విద్యను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి మార్చారు

1986 - నూతన జాతీయ విద్యావిధానం అమలు

1988 - అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) చట్టబద్ధ హోదాను పొందింది. ఇదే సంవత్సరం నేషనల్ లిటరసీ మిషన్ కూడా ప్రారంభమైంది.

1989 - మహిళలకు పురుషులతోపాటు సమాన విద్య, సాధికారతను సాధించడానికి మహిళా సమాఖ్య కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

2001 - 2005 నాటికల్లా 6-14 సంవత్సరాల మధ్య వయస్సుగల పిల్లలు బడులలో ఉండాలనే లక్ష్యంతో సర్వశిక్ష అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

2002 - నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా పరిగణించడానికి 86వ రాజ్యాంగ సవరణ చేశారు.

2004 - విద్యలో సాంకేతికతను ప్రవేశపెట్టడానికి 'ఎడ్యుశాట్' అనే కృత్రిమ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు.

2008 - దేశవ్యాప్తంగా కొత్తగా 8 ఐఐటీల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

2010 - ఈ ఏడాది ఏప్రిల్ ఒకటిన విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చింది.

విద్యారంగంలో ప్రముఖ సంఘటనలు

1. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్	**- 1956**
2. నేషనల్ బాలభవన్	**- 1956**
3. నేషనల్ బుక్ ట్రస్ట్	**- 1957**
4. జాతీయ విద్యా శిక్షణ, పరిశోధనా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ)	**- 1961**
5. జాతీయ శాస్త్ర ప్రతిభా పరిశోధనా కేంద్రం	**- 1963**
6. కేంద్రీయ విద్యాలయ సంఘతన్	**- 1965**
7. నేషనల్ పాపులేషన్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు	**- 1980**
8. ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం	**- 1985**
9. జాతీయ విద్యావిధానం	**- 1986**
10. ఆపరేషన్ బ్లాక్‌బోర్డు	**- 1987-88**
11. మహిళా సమాఖ్య పథకం	**- 1989**
12. జిల్లా ప్రాథమిక విద్యా పథకం (డీపీఈపీ)	**- 1994**
13. మధ్యాహ్న భోజన పథకం	**- 1995**
14. నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్	**- 1996**

దేశంలోగల సార్వత్రిక విశ్వవిద్యాలయాలు

1. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం	- హైదరాబాద్
2. కోటా సార్వత్రిక విశ్వవిద్యాలయం	- కోటా
3. నలంద సాంస్కృతిక విశ్వవిద్యాలయం	- నలంద (బిహార్)
4. యశ్వంతరావు చౌహాన్ మహారాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం	- నాసిక్
5. మధ్యప్రదేశ్ బోజ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం	- భోపాల్
6. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం	- అహ్మదాబాద్
7. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ సార్వత్రిక విశ్వవిద్యాలయం	- కోల్‌కతా
8. రాజ్‌రుషి టాన్‌డన్ సార్వత్రిక విశ్వవిద్యాలయం	- అలహాబాద్
9. తమిళనాడు రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం	- చెన్నై

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	డాలరు Vs రూపాయి	ముడి చమురు
176.26 ▲	61.60 ▲	-50 ▼	-100 ▼		▲
33,969.64	10,504.80	28,200 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	39,800 (కిలో (రూపాయల్లో))	63.40	67.84 (బ్రెంట్ ధర (డాలర్లలో..))

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటా స్టీల్	760.75	3.74
రెడ్డీల్యాబ్స్	2,409.50	3.14
లార్సెన్	1,315.40	3.08
ఓఎన్‌జీసీ	199.80	2.92
ఏషియన్ పెయింట్స్	1,178.70	2.71

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టాటా మోటార్స్	429.70	-0.81
ఇన్ఫోసిస్	1,015.30	-0.37
మారుతి సుజుకి	9,382.25	-0.37
హీరో మోటార్‌కార్ప్	3,755.00	-0.35
యాక్సిస్ బ్యాంక్	564.95	-0.19

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	63.52	63.40
యూరో	76.44	76.52
పౌండ్	86.26	85.85
ఆస్ట్రేలియా డాలర్	49.76	49.66
సింగపూర్ డాలర్	47.79	47.69

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,050	30,000
చెన్నై	28,060	30,010
బెంగళూరు	27,400	29,304
ముంబై	28,960	30,973
విజయవాడ	28,200	30,450

తగ్గిన బంగారం ధర

న్యూఢిల్లీ: ఆభరణాల వర్తకుల నుండి డిమాండ్ తగ్గడం, అంతర్జాతీయంగా బంగారానికి గిరాకీ తగ్గడంతో బంగారం ధరలు గురువారం తగ్గాయి. బంగారం ధర రూ.85లు తగ్గి 10గ్రాములు రూ.30,365లు పలికింది. వెండి ధర రూ.210 లు తగ్గి కేజీ వెండి రూ.39,640 లు పలికింది. దేశీయ మార్కెట్లో స్థానిక నగలవ్యాపారుల నుండి డిమాండ్ తగ్గడం కూడా మరో కారణంగా ఉంది. అమెరికా ఫెడరల్ వడ్డీరేట్లను పెంచనున్న అంచనాలతో బంగారం బుధవారం మూడున్నరేళ్ల గరిష్టానికి చేరింది. అంతర్జాతీయంగా బంగారం ధర 0.40శాతం తగ్గి ఔన్స్ 1307.30 డాలర్లకు చేరింది. సవరు బంగారం ధర రూ.24,700 పలికింది.

బలపడిన రూపాయి

ముంబై: డాలర్‌తో రూపాయి మారకపు విలువ గురువారం 63.36 వద్ద నిలిచింది. బుధవారం మూడు నెలల కనిష్టానికి దిగజారిన రూపాయి ఫెడరల్ రిజర్వుకు చెందిన యుఎస్ డేటా, మినిట్స్ కరెంటు కరెన్సీ వత్తిడిని తట్టుకోలేకపోయాయి. డాలర్ సూచీ ఇతర దేశాల కరెన్సీలతో చూసుకుంటే సెప్టెంబరు 20 తరువాత అత్యధికంగా దిగజారిందని చెప్పవచ్చు.రూపాయి బలపడటంతో ఈ సెంటిమెంట్ విదేశీ మదుపరులు పెట్టుబడులకు పెట్టేందుకు తోడ్పడింది.ఇంటర్ బ్యాంకు ఫారెన్ ఎక్స్‌చేంజిలో గురువారం రూపాయి 63.30 వద్ద ప్రారంభమైంది.



ఏటీఎంల ద్వారా రూ.200నోట్లు

ముంబై: పెద్దనోట్లను రద్దు చేసి రూ.2000 నోటును తీసుకొచ్చిన తర్వాత ప్రజలకు ఎదురైన చిల్లర కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం రూ.200 నోటును విడుదల చేసిన సంగతి తెలిసిందే. గతేడాది సెప్టెంబరు నుంచి ఈ నోటు చలామణీలోకి వచ్చినా కేవలం బ్యాంకుల ద్వారానే ఇవ్వడంతో విరివిగా వినియోగంలోకి రాలేదు. దీంతో ప్రజలకు చిల్లర సమస్య తీర్చేందుకు ఈ నోట్లను వీలైనంత త్వరగా ఏటీఎంల ద్వారా అందజేయాలని బ్యాంకులను భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ఆదేశించింది. 'రూ. 200 నోట్లను వీలైనంత త్వరగా ఏటీఎం ద్వారా అందించాలని బ్యాంకులను, ఏటీఎం తయారీదారులను ఆర్‌బీఐ ఆదేశించింది' అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న, పేరు చెప్పడానికి ఇష్టపడని ఇద్దరు అధికారులు వెల్లడించారు. ఆర్‌బీఐ ఆదేశాల నేపథ్యంలో బ్యాంకులు కూడా అందుకు ఏర్పాట్లను ప్రారంభించాయట. రూ.200నోట్లను జారీ చేసేందుకు వీలుగా ఏటీఎంలలో మార్పుల ప్రక్రియను చేపట్టాయని సదరు అధికారులు పేర్కొన్నారు. మరో 5 నుంచి ఆరు నెలల్లో ఏటీఎంలలో రూ.200 నోట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అయితే దీనిపై ఆర్‌బీఐ నుంచి ఎలాంటి స్పష్టత లేదు. అయితే రూ.200నోట్లను ఏటీఎంల ద్వారా ఇవ్వాలంటే అందుకోసం వాటిలో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఆ కరెన్సీ సైజుకు తగ్గ వాల్టులను ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుందని ఏటీఎం తయారీ సంస్థలు చెబుతున్నాయి. ఈ మార్పుల కోసం ఒక్కో ఏటీఎంపై సగటున రూ.5000 ఖర్చు చేయాల్సి ఉంటుందట. దేశవ్యాప్తంగా మొత్తం 2.2 లక్షల ఏటీఎంలు ఉండగా.. వీటన్నింటిని మార్చాలంటే రూ.110కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నాయి.

అటవీ భూముల బదలాయింపు వేగవంతం

- ఇప్పటికే రెండు బ్లాకులకు అనుమతి....
- మరో 10 బ్లాకులకు సిద్ధమవుతున్న దస్త్రాలు...
- 2080 హెక్టార్లకు పూర్తయిన కసరత్తు...



విశాలాంధ్ర అమరావతి : అటవీ భూముల బదలాయింపు ప్రక్రియ అత్యంత వేగంగా జరుగుతోంది. డీనోటిఫై చేయాలంటూ కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన దస్త్రానికి ముందడుగు పడనుంది. రాజధాని నిర్మాణంలో భాగంగా అటవిభూముల బదిలీని చంద్రబాబు ప్రభుత్వం కేంద్రం ముందుంచింది. సానుకూలంగా స్పందించిన కేంద్రం ఆటవీశాఖను నివేదికలు సిద్ధం చేసి పంపమంటూ అనుమతినిచ్చింది. ఈక్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం 12 బ్లాకులుగా 7 వేల హెక్టార్లలో భూమిని డీనోటిఫై చేయాలంటూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపింది. క్షేత్రస్థాయిలో జరిగిన కసరత్తు అనంతరం ఈ ప్రక్రియ ప్రారంభం కావటంతో డీనోటిఫై దస్త్రం వేగంగా ముందుకు వెళుతోంది. అయితే ముందుగా రెండు బ్లాకులకి మాత్రమే అనుమతి ఇస్తామని అందుకు సంబంధించిన నివేదికలను పంపాలంటూ కేంద్రం కోరింది.

రెండు బ్లాకులు ఓకే...మిగిలినవి కూడా....

రాష్ట్ర ప్రభుత్వం కోరిన విధంగానే ముందుగా రెండు బ్లాకులలో 2,080 హెక్టార్ల అటవీభూముల బదిలీకి అనుమతి ఇచ్చింది. దీనికి సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రక్రియ కేంద్రం వద్ద అత్యంత వేగంగా కదులుతోంది. వెంకటపాలెంలో 1,850 హెక్టార్లు, తాడేపల్లిలో 230 హెక్టార్ల భూమిని డీనోటిఫై చేసేందుకు మొత్తం 2,080 హెక్టార్లకిరణ్ అనుమతిచ్చింది. అయితే ఈ అంశంపై కేంద్రం ప్రాథమికంగా అనుమతి ఇవ్వటంతో క్షేత్రస్థాయి బదిలీకి కేంద్ర పర్యావరణ శాఖ తీవ్ర కసరత్తు చేస్తోంది. బదిలీ జరిగే ఈ ప్రాంతాల్లో ఆక్టోపస్, గ్రేహౌండ్స్, పోలీస్ శిక్షణా సంస్థలు,ఫైరింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామనే ప్రణాళికలు కేంద్రానికి పంపటంతో కేంద్రం అనుమతి ఇచ్చింది. పూర్తి స్థాయి బదాలయింపునకు ఎక్కువ సమయం పట్టకుండా పూర్తి అనుమతులు ఇచ్చే పనిలో సంబంధిత శాఖల నిమగ్నమయై ఉన్నాయి. అలాగే మరో 10 బ్లాకులలో ఏ విధమైన అభివృద్ధి పనులు చేపట్టనున్నారో కోరుతున్న భూమి అవసరం తెలియ చేస్తూ స్పష్టమైన నివేదికలు పంపాలంటూ కేంద్రం రాష్ట్రానికి సమాచారం ఇచ్చింది. ముందుగా అన్ని బ్లాకులకు అనుమతి ఇవ్వని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వరుస ప్రతి పాదనలు రావటంతో మిగిలిన 10 బ్లాకులకు అనుమతి ఇచ్చింది. 60 శాతం పచ్చదనం కాపాడుకుంటూనే అభివృద్ధి చేసుకోవాలని కేంద్రం సూచించింది. దీంతో సీఆర్డీఏ ఎంపిక చేసుకున్న అటవీ ప్రాంతంలో చేపట్టబోయే అభివృద్ధి ప్రణా ళికలు తయారుచేస్తోంది. సీఆర్డీఏకి ఇస్తున్న భూములకు ప్రత్యామ్నాయంగా రాయలసీమ, ప్రకాశంజిల్లాలో ప్రభుత్వం అటవీశాఖకు భూములు కేటాయించింది. కేటాయించిన భూముల్లో అడవులు అభివృద్ధి చేయటానికి రూ .280 కోట్లు అటవీశాఖకు చెల్లించాల్సి ఉంది.

అనుమతి ఇచ్చిన వాటిపై కసరత్తు..

తొలివిడతగా అనుమతి ఇచ్చిన రెండు బ్లాకులలో 2,080 హెక్టార్ల భూమిని కేంద్రం డీనోటిఫై చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఇందుకు సంబంధించి నివేదికలను అటవీశాఖ సిద్ధం చేస్తోంది. అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా నివేదికలు సిద్ధం కాగానే తొలి విడతలో అనుమతి వస్తున్న భూములకు హద్దులు గుర్తిస్తారు. అటవీభూమికి సరిహద్దులు నిర్ణయించిన వెంటనే ప్రతి 20 మీటర్లకు ఒకచోట అటవీ భూమికి హద్దురాళ్లు ఏర్పాటు చేయనున్నారు. అదీకాక తీసు కున్న భూమిలో 60 శాతం పచ్చదనం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండటంతో ఆయా భూముల్లో ఉద్యానవనాలు, క్రీడా మైదానాలు, హరితభవనాలు, ఉండేలా ప్రణాళికలు రచిస్తోంది. ప్రస్తుతం అనుమతి వచ్చిన భూములలో చేపట్టబోయే అభివృద్ధి పనులు నివేదికలు దాదాపు పూర్తికాగా మరో 10 బ్లాకులుకి సంబంధించిన 5 వేల హెక్టార్ల ప్రాంతంలో ఏ అభివృద్ధి పనులు చేపట్టాలో చర్చిస్తోంది.ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే కేంద్రం అటవీభూములు డీనోటిఫై చేసేందుకు అనుమతి ఇస్తుంది. దీనితో ఆ దిశగా ప్రభుత్వం పూర్తి స్థాయిలో ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. కేంద్ర ఆదేశాలమేరకు తీసుకున్న భూములను సైతం నిర్దిష్ట సమయంలో నిబంధనలు అనుసరించి వినియోగించాల్సి ఉంది. అయితే అమరావతి నిర్మాణంలో అటవీ భూములు కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో అటవీశాఖ భూములు పర్యాటక ప్రాంతంగా అమరావతికి ఆదాయం సమకూర్చనున్నాయి.

కోలుకున్న సూచీలు

లాభాల్లో మెటల్, బ్యాంకింగ్ షేర్లు



ముంబై: రెండు రోజులు ఒడిదుడుకుల అనంతరం దేశీయ మార్కెట్లు గురువారం కోలుకున్నాయి. విదేశీ మదుపరులు పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలంగా ఉండటంతో అంతర్జాతీయంగా సానుకూల ప్రభావం చూపింది. డొమెస్టిక్ సెంటిమెంట్ బలపడటంతో నికీక సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 50.9 చేరింది. నవంబరులో 48.5గా నమోదైంది. 30షేర్ల బీఎస్ఇ ఇండెక్స్ సెన్సెక్స్ అత్యధికంగా నమోదై 33,912.49 డాలర్లకు చేరింది. 33,995.40, 33,802.13 పాయింట్ల మధ్య ఊగిసలాడి చివరకు 176.26 పాయింట్ల లాభంతో 0.52శాతంతో నిలదొక్కుకుంది. గేజ్ 263.45 పాయింట్లు నష్టపోయింది. 50షేర్ల ఎన్ఎస్ఇ ఇండెక్స్ నిఫ్టీ అత్యధికంగా 61.60 పాయింట్లు లాభంతో 0.59శాతంతో 10,504.80 వద్ద నమోదైంది. బిఎస్ఇ సెక్టరల్ సూచీల్లో క్యాపిటల్ గూడ్స్ సూచీ స్టార్‌పెర్‌ఫార్మర్‌గా 2.02శాతం నమోదు చేసింది. మెటల్ 1.96శాతం,కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.69శాతం,పిఎస్‌యు 1.37శాతం లాభాలు నమోదు చేశాయి. రియాల్టీ ఇండెక్స్ సూచీ 0.3శాతం, ఆటో 0.28 శాతం,ఐటి 0.13శాతం నష్టాల్లో ముగిసింది. టిసిఎస్, ఇన్ఫోసిస్ ఫలితాలు వచ్చే వారం వెలువడనున్న నేపథ్యంలో డిసెంబర్ క్వార్టర్ ఫలితాల కోసం మదుపరులు ఎదురుచూడసాగారు. ఎన్ఎస్ఇ సూచీల్లో కోల్ ఇండియా అత్యధిక లాభాన్ని నమోదుచేసింది. నవంబరు 29 తరువాత అత్యధికంగా 2.8శాతం లాభపడింది. ఎల్ అండ్ టి 2.4శాతంతో ఆల్ టైమ్ హైకి చేరింది. టాటాస్టీల్ 2.8శాతంతో 2008 జూన్ తర్వాల అత్యధిక స్థాయిలో లాభాన్ని నమోదుచేసింది. ఎస్‌బీఐ 2శాతం ఎదిగింది. మెటల్ స్టాక్స్ లాభాల్లోనే కొనసాగాయి. నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 1.9శాతం రికార్డు స్థాయిలో ముగిసింది. విదేశీ మదుపరులు 96.31 కోట్ల షేర్లను విక్రయం చేయగా దేశీయ మదుపరులు రూ.269.20 కోట్ల షేర్లు అమ్మారు.

అంతర్జాతీయ షేర్లు: గురువారం ఆసియా షేర్లు 10ఏళ్ల గరిష్టాన్ని నమోదుచేశాయి. ఆసియా పసిఫిక్ షేర్లు జపాన్ వెలుపల 0.1శాతం పెరిగాయి. ఆస్ట్రేలియన్ షేర్లు దశాబ్ద స్థాయికి చేరాయి. జపాన్ నిక్కీ మొదటిరోజు ట్రేడింగ్‌లో 2శాతం లాభాన్ని నమోదు చేసింది. ఎస్ అండ్ పి 500 ఇండెక్స్ 2,700 ఎగువన నమోదు చేసింది. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 98.67 పాయింట్లు పెరిగింది. ఎస్ అండ్ పి 500 17.25 పాయింట్లు లాభాన్ని నమోదు చేసింది.

టాటా వాహనాలకు ఆరేళ్ల వారంటీ...!



విజయవాడ: అన్ని రకాల ట్రాక్టర్లు, ట్రయిలర్లు, మల్టీ యాక్సిల్ ట్రక్కులు, టిప్పర్లకు ఆరేళ్ల వారంటీ ఇస్తున్నట్టు టాటా మోటార్స్ కమర్షిల్ వెహికల్ హెడ్ గిరీష్ వాఘ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తాము ఆరేళ్ల పాటు డ్రైవ్‌లైన్ వారంటీ ఇస్తున్నట్టు ఆయన వివరించారు. దేశంలోని 20 లక్షల ట్రక్కులు, టిప్పర్లకు ఈ వారంటీ వర్తిస్తుంది. దేశంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక టచ్ పాయింటు ఉంటుందని, దాదాపు 1800 టచ్ పాయింట్లలో ఈ వారంటీ అందు బాటులో ఉంటుందని వాఘ్ తెలిపారు. టాటా వాహనాన్ని విక్రయిస్తే కండీషన్‌ను చెక్ చేసి కొనుగోలుదారునికి వారంటీ ఇస్తారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై నిలిచిన వాహనాలను 24 గంటల్లోనే డెలివరీ చేస్తారు. కస్టమర్ కేర్ యాప్ ద్వారా సర్వీస్ బుకింగ్, నిర్వహణ టిప్స్, డీలర్ లొకేషన్, సర్వీసు హిస్టర్, ఎమర్జెన్సీ ఎస్ఓఎస్‌ను ఉపయోగించుకోవచ్చని గిరీష్ వివరించారు. టాటా సురక్ష పథకం ద్వారా ఏడాది పాటు మరమ్మతులు అందుబాటులో ఉంటాయి. టాటా ఫ్లీట్‌మేన్ కింద వెహికల్ ట్రాకింగ్, జియో ఫెన్సింగ్, ట్రిప్ మేనేజ్‌మెంట్, ఇంధనం ఆదా, ఇంధన చోరీ నివారణ, డ్రైవింగ్ పర్యవేక్షణ తదితర అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి. టాటా కవాచ్ కింద 15 రోజుల్లో మరమ్మతులు చేస్తారు. అలా కాని పక్షంలో టీజీపీ కూపన్‌లు అందజేస్తారు. మొబైల్ సర్వీస్ వెహికల్ ద్వారా వాహనదారుడి ఇంటి ముంగిటే సేవలను అందజేస్తారని గిరీష్ వాఘ్ వివరించారు.

ప్లాస్టిక్, కెమికల్స్,అటవీ ఉత్పత్తుల

ఎగుమతులపై భారత్ దృష్టి



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్‌లో ప్లాస్టిక్, రసాయనాలు, అటవీ ఉత్పత్తులకు భారీ గిరాకీ ఉండటంతో దేశీయంగా సుమారు 2000 బిలియన్ డాలర్లకుపైగా ఎగుమతులు చేయనున్నట్లు తెలుస్తోంది. మన దేశం ఈ ఉత్పత్తులను 2శాతానికి తక్కువగానే ఎగుమతి చేసినట్లు తెలుస్తోంది. మార్చిలో ముంబైలో జరగనున్న ప్రదర్శనలో భాగంగా వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు ఎగుమతులు పెరుగుదలకు తోడ్పడతాయని పేర్కొన్నారు. గత ఏడాది దేశీయ ఎగుమతులు 36 బిలియన్ డాలర్లు కాగా ఇప్పటివరకు నమోదైన గణాంకాల ఆధారంగా ఈ ఉత్పత్తుల ఎగుమతులు 12శాతం పెరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రదర్శనలు కొనుగోలుదారులకు నూతన మార్కెట్లను పరిచయం చేస్తాయన్నారు. కాప్‌ఇండియా 2018 నిర్వహించిన ఈ ప్రదర్శన షల్లాక్ అండ్ ఫారెస్ట్ ప్రోడక్ట్స్, ప్లాస్టిక్స్,బేసిక్ కెమికల్స్,కాస్మటిక్ అండ్ డౌన్, కెమికల్ అండ్ అల్లాయిడ్ ఐటిమ్స్ వంటి నాలుగు ఎగుమతులు ప్రోత్సాహక కౌన్సిళ్ల తోడ్పాటుతో జరిగింది. 700 ప్రదర్శనలో 30 దేశాల నుండి 400 అంతర్జాతీయ కొనుగోలుదారులతో పాటు 10,000 మంది సందర్శకులు ఈ ప్రదర్శనను తిలకించారు.

నాలుగు నగరాల్లో ఏసీటీ సేవలు అప్‌గ్రేడ్...!



విజయవాడ : ప్రముఖ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ ఏసీటీ తాజాగా అదనంగా సొమ్ము వసూలు చేయకుండానే తన సేవలను విస్తరించింది. జనవరి 2 నుంచి ఏడాది మొత్తం ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఏపీలోని నాలుగు ప్రధాన నగరాల్లో ఎఫ్‌యూపీ పరిమితిని, వేగాన్ని రెట్టింపు చేసింది. వైజాగ్‌లో మంత్లీ ప్లాన్ ఏసీటీ సిల్వర్‌లో 140 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 200 జీబీ ఎఫ్‌యూపీకి, 10 ఎంబీపీఎస్ వేగాన్ని 20 ఎంబీపీఎస్‌కు పెంచింది. ఏసీటీ గోల్డ్‌లో 200 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 300 ఎఫ్‌యూపీకి, 25 ఎంబీపీఎస్ వేగాన్ని 40 ఎంబీపీఎస్‌కు అప్‌గ్రేడ్ చేసింది. ఏసీటీ డైమండ్‌లో 250 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 400 ఎఫ్‌యూపీకి, 50 ఎంబీపీఎస్ వేగాన్ని 60 ఎంబీపీఎస్‌కు పెంచింది. ఏసీటీ ప్లాటినంలో 350 ఎఫ్‌యూపీ పరిమితిని 600 జీబీ ఎఫ్‌యూపీకి, 75 ఎంబీపీఎస్ వేగాన్ని 100 ఎంబీపీఎస్‌కు పెంచింది. ఏలూరు, విజయవాడ, గుంటూరులో మంత్లీ ప్లాన్ ఏసీటీ సిల్వర్‌లో 150 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 250 జీబీ ఎఫ్‌యూపీకి, 20 ఎంబీపీఎస్ వేగాన్ని 30 ఎంబీపీఎస్‌కు పెంచింది. ఏసీటీ గోల్డ్‌లో 250 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 400 ఎఫ్‌యూపీకి, 50 ఎంబీపీఎస్ వేగాన్ని 60 ఎంబీపీఎస్‌కు అప్‌గ్రేడ్ చేసింది. ఏసీటీ డైమండ్‌లో 300 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 600 ఎఫ్‌యూపీకి, 75 ఎంబీపీఎస్ వేగాన్ని 100 ఎంబీపీఎస్‌కు పెంచింది. వైజాగ్‌లో ఎస్‌వోహెచ్‌వో ప్లాన్ ఏసీటీ ఎస్‌వోహెచ్‌వో లైటినింగ్‌ను 300 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 800 జీబీ ఎఫ్‌యూపీకి, 50 ఎంబీపీఎస్ వేగాన్ని 100 ఎంబీపీఎస్‌కు పెంచింది. ఏసీటీ ఎస్‌వోహెచ్‌వో ఫోర్స్‌ను 600 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 1000 ఎఫ్‌యూపీకి, 80 ఎంబీపీఎస్ వేగాన్ని 100 ఎంబీపీఎస్‌కు అప్‌గ్రేడ్ చేసింది. ఏసీటీ ఎస్‌వోహెచ్‌వో ఇన్‌క్రిడిబుల్‌ను 800 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 1250 ఎఫ్‌యూపీకి, 100 ఎంబీపీఎస్ వేగాన్ని 125 ఎంబీపీఎస్‌కు పెంచింది. ఏలూరు, విజయవాడ, గుంటూరులో ఏసీటీ ఎస్‌వోహెచ్‌వో లైటినింగ్‌లో 300 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 800 జీబీ ఎఫ్‌యూపీకి, 40 ఎంబీపీఎస్ వేగాన్ని 100 ఎంబీపీఎస్‌కు పెంచింది. ఏసీటీ ఎస్‌వోహెచ్‌వో ఫోర్స్‌లో 500 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 1000 ఎఫ్‌యూపీకి, 60 ఎంబీపీఎస్ వేగాన్ని 100 ఎంబీపీఎస్‌కు అప్‌గ్రేడ్ చేసింది. ఏసీటీ ఎస్‌వోహెచ్‌వో ఇన్‌క్రిడిబుల్‌లో 700 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 1250 ఎఫ్‌యూపీకి, 80 ఎంబీపీఎస్ వేగాన్ని 125 ఎంబీపీఎస్‌కు పెంచింది. ఏసీటీ ఫైబర్‌నెట్ ఎస్ఎంఈ ప్లాన్‌లను ఏలూరు, విజయవాడ, గుంటూరుల్లోనూ అందుబాటులోకి తీసుకువచ్చింది. వైజాగ్‌లో ఎస్ఎంఈ ప్లాన్‌లను అప్‌గ్రేడ్ చేసింది. వైజాగ్‌లో ఏసీటీ ఎస్ఎంఈ అల్ట్రా ఫాస్ట్‌ను 750 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 1500 జీబీ ఎఫ్‌యూపీకి, 150 ఎంబీపీఎస్ వేగాన్ని 150 ఎంబీపీఎస్‌కి అప్‌గ్రేడ్ చేసింది. ఏసీటీ ఎస్ఎంఈ ఎక్సెప్షనల్‌ను 1000 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 2000 ఎఫ్‌యూపీకి, 200 ఎంబీపీఎస్ వేగాన్ని 200 ఎంబీపీఎస్‌కు అప్‌గ్రేడ్ చేసింది. ఏసీటీ ఎస్ఎంఈ ఫినోమినల్‌ను 1250 జీబీ ఎఫ్‌యూపీ పరిమితిని 2500 ఎఫ్‌యూపీకి, 250 ఎంబీపీఎస్ వేగాన్ని 250 ఎంబీపీఎస్‌కు పెంచింది.

విజ్ఞానం

ఆల్కాహాల్‌తో డిఎన్‌ఏ డ్యామేజ్

ఆల్కాహాల్ వినియోగం స్టెమ్‌సెల్‌లోని డిఎన్‌ఏను శాశ్వతంగా నాశనం చేస్తుంది. ఇది కేన్సర్ అభివృద్ధిచెందే ప్రమాదాన్ని పెంచుతుందని భారతీయ సంతతి శాస్త్రవేత్త హెచ్చరిస్తున్నారు. కణాల పరిశోధనలో మద్యం కేన్సర్‌కు కారణమయ్యే వివిధ అంశాలను పరిశీలించారు. తాజాగా ఎలుకలపై చేసిన పరిశోధనలో ఆల్కాహాల్ వినియోగంతో శాశ్వతంగా జెనెటిక్ డ్యామేజ్‌ను యుకెలోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ మాలిక్యులర్ బయాలజీ వెల్లడించింది. డైల్యూటెడ్ ఆల్కాహాల్ (ఇథనాల్) ఎలుకలకు ఇచ్చి చూడగా, ఆల్కాహాల్ వినియోగంతో ఎసిటాల్‌డిహైడ్ జెనెటిక్ డ్యామేజ్‌కు కారణమైనట్లు తెలిసింది. స్టెమ్ సెల్స్‌లోని డిఎన్‌ఏ అత్యంత హానికరమైన ఎసిటాల్‌డిహైడ్ దెబ్బతీసినట్లు తేలింది. కొన్నిరకాల కేన్సర్లు స్టెమ్‌సెల్‌లోని డిఎన్‌ఏ డ్యామేజ్ కావడంతో ఏర్పడతాయని ప్రొఫెసర్ కేతన్‌పటేల్ వెల్లడించారు. అల్కాహాల్ వినియోగంతో బ్రెస్ట్, బవల్ కేన్సర్లతోపాటు ఏడు రకాల కేన్సర్లు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి.

రక్తంలో కెఫీన్ శాతంతో

పార్కిన్‌సన్స్ గుర్తింపు..!



కాఫీ వినియోగం బాడీమెటబాలిజంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. దీనిద్వారా పార్కిన్‌సన్స్ వ్యాధిని గుర్తించవచ్చునని తాజా అధ్యయనం వెల్లడించింది. న్యూరోజనరేటివ్ డిజార్డర్ ఉన్న వారి రక్తంలో కెఫీన్ శాతం తక్కువగా ఉన్నట్లు జపాన్‌లోని జుంటెండో యూనివర్సిటీ వెల్లడించింది. రెండు గ్రూపులపైచేసిన పరిశోధనలో భాగంగా నిత్యం రెండు కప్పుల కాఫీ ఇచ్చి చూడగా పార్కిన్‌సన్స్ వ్యాధి ఉన్నవారిలో కెఫీన్ శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. న్యూరోడిజనరేటివ్ డిజార్డర్ అయిన పార్కిన్‌సన్స్ వ్యాధిని నడకలో స్వల్ప తేడాలతో గుర్తించవచ్చు. ప్రస్తుతం పార్కిన్‌సన్స్ వ్యాధిని ముందుస్తుగానే గుర్తించే మార్గాలు లేవనే చెప్పవచ్చు. పలు ఫిజికల్ లక్షణాలతో ఈ వ్యాధిని చాలా లేటుగానే గుర్తించే పరిస్థితి. 108మంది పార్కిన్‌సన్స్‌వ్యాధి ఉన్నవారిపై ఆరు సంవత్సరాలపాటు చేసిన పరిశోధనలో 31మందిలో ఈ వ్యాధి లేనట్లు పరిశీలించారు. ఒకరాత్రి ఉపవాసం అనంతరం చేసిన పరిశోధనలో ఈ వ్యాధి ఉన్నవారిలో కెఫీన్‌శాతం తక్కువ ఉన్నట్లు గుర్తించారు. మూడింట ఒక వంతు మాత్రమే రక్తంలో కెఫీన్‌ను గుర్తించడమైంది. వ్యాధి తీవ్రమైనవారిలో కెఫీన్ శాతాన్ని గుర్తించలేకపోయారు.

మెడిసిన్ ఖరీదు రూ.5కోట్లు

అంధత్వ నివారణ ఖాయం

అమెరికాలోని ఫిలడెల్ఫియాకు చెందిన స్పార్క్ థెరపిటిక్స్ అనే సంస్థ అంధత్వాన్ని తగ్గించేందుకు అత్యంత ఖరీదైన మెడిసిన్ తయారు చేసింది. లక్స్‌టర్నా అనే పేరుగల ఈ మెడిసిన్ వంశపారపర్యంగా వచ్చే రెటీనా జీవకణజాల క్షీణతకు సంబంధించిన రుగ్మతను తగ్గిస్తుందట. దీని ధర రూ.5,39,79,250 (8,50,000 డాలర్లు)గా నిర్ణయించింది. మెడిసిన్ ఒకే డోసులో ఉంటుందని కంపెనీ వెల్లడించింది. ఒక కన్నుకే అయితే రూ.2,69,89,625(4,25,000 డాలర్లు) అని తెలిపింది. ఎఫ్‌డీఏ అను మతి కోసం ప్రతిపాదనలు పంపినప్పుడు ఒక్కో కన్నుకు మెడిసిన్ ధర 10 లక్షల డాలర్లుగా పేర్కొనగా.. ప్రస్తుతం ధర తగ్గించారు. ఈ ఇంత ఖరీదైన మెడిసిన్‌పై అమెరికాలో చర్చ జరుగుతోంది. మెడిసిన్ పనిచేయకపోతే డబ్బు తిరిగి ఇచ్చేస్తామని కంపెనీ చెప్తోంది. ప్రస్తుతం వంశపారపర్యంగా వచ్చే ఈ రెటీనా క్షీణతకు సంబంధించి అమెరికాలో 1000 కేసులు ఉన్నట్లు సమాచారం. ఏటా పది నుంచి ఇరవై కొత్త కేసులు చేరుతున్నాయట. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మెడిసిన్ గ్లైబెరా. దీన్ని డచ్‌కు చెందిన యూనీక్యూర్ అనే కంపెనీ పది లక్షల డాలర్లకు అమ్ముతోంది. ఇది జన్యుపరమైన సమస్యలను నయం చేసేందుకు ఉపయోగపడుతుంది.

భారీగా పెరిగిన చమురు ధరలు



సింగపూర్: గత రెండున్న రేళ్లలో గురువారం పెరిగిన ముడి చమురు ధరలు గరిష్టానికి చేరాయి. 2014-15 సంవత్సరాల్లో వస్తువుల మార్కెట్‌లో ఏర్పడిన తీవ్ర ఆర్థిక ఒడిదుడుకుల్లో సైతం ఈ పరిస్థితి ఎదురవ్వలేదు. కీలక చమురు ఉత్పత్తి దారులు ఇరాన్, ఒపెక్ దేశాల్లో ముడి చమురు ఉత్పత్తిని తగ్గించడం ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగాఉంది. ఈ కారణంగా ఆసి యా స్టాక్ మార్కెట్ ధరలుపెరగడంతోపాటు అమెరికా, జపాన్, జర్మనీ వంటి ప్రముఖ ఆర్థిక రంగాల నుండి బలమైన డేటాతో గురువారం ముడి చమురు ధరలు 10ఏళ్ల గరిష్టానికి చేరాయి. యుఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్ మీడియట్ క్రూడ్ బ్యారెల్ చివరిగా ముగిసిన రేటుతో పోల్చుకుంటే 0.9 శాతం పెరిగి 62.16 డాలర్లుగా నమోదైంది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ బ్యారె ల్ 2015 మేలో 68.27 డాలర్ల నుండి 39 సెంట్లు పెరిగి 68.23 డాలర్లు పలికింది. అంతర్జాతీయంగా మూడవ అతిపెద్ద చమురు ఉత్పత్తి దారు అయిన ఇరాన్‌లో నెలకొన్న తీవ్ర అనిశ్చిత పరిస్థితి, ప్రభుత్వానికి వ్యతి రేకం గా జరుగుతున్న పలు ప్రదర్శనలు, ధర్నాలు ధరలు పెరిగేందుకు దోహదపడింది.

పెరిగిన సేవల రంగం విస్తృతం



న్యూఢిల్లీ: నిక్కీ సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ సూచీ ప్రకారం సేవలరంగ కార్యకలాపాల సూచీ నవంబరులో 48.5 నుండి డిసెంబరులో 50.9గా నమోదైంది. నిక్కీ ఇండియా కాంపోజిట్ నికరంగా పెరిగిన పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎమ్‌ఐ) ఉత్పత్తి నవంబరులో 50.3కాగా డిసెంబరులో 53గా ఉంది. నెలవారీ సూచీల్లో 50 రీడింగ్‌ల కన్నా పెరిగితే ఉత్పత్తి సామర్థ్యం పెరిగినట్లే...50కన్నా తక్కువ నమోదైతే తగ్గినట్లు. తాజా సర్వేప్రకారం, డిసెంబరులో కొత్త ఆర్డర్లు నిలకడగా ఉండగా, సెప్టెంబరు నుండి ఉద్యోగ సృష్టి వేగవంతమైనట్లు తెలుస్తోంది. మొత్తంమీద చూస్తే నమోదుచేయబడిన సగటు కంటే వ్యాపార రంగ అభివృద్ధి డిసెంబరులో తక్కువగానే ఉంది. భారత సర్వీసు రంగం డిసెంబరులో కొంత వరకు విస్తృతమైనట్లు తెలుస్తోంది. 2016 అక్టోబరు నుండి మొత్తంమీద ఆర్థికవ్యవస్థ పనితీరు రికార్డు నెలకొల్పింది. ఉద్యోగ సృష్టికి కీలక రంగాలైన సేవలరంగంతోపాటు, మాన్యుఫ్యాక్చరింగ్ రెండు రంగాల్లో చారిత్రక సగటును అధిగమించాయి. జిఎస్‌టీ ప్రభావం మాత్రం డిసెంబరులో తయారీరంగంపై ప్రతికూల ప్రభావం చూపినట్లు తెలుస్తోంది.

క
థ



గాడిద తెలివి

ఓ పల్లెకు దూరంగా ఏటి ఒడ్డున ఒక చిట్టడివి ఉంది. ఆ చిట్టడివిలో పచ్చగడ్డి బాగా పెరిగింది. ఆ అడవికి సమీపంలోని గ్రామంలో ఒక గాడిద ఉండేది. దానికి లేలేత పచ్చగడ్డి తినాలనే కోరిక ఉండేది. అడవిలో చక్కగా పెరిగిన పచ్చగడ్డిని చూడగానే దానికి నోరూరింది. గబగబా అడవిలో ఉన్న పచ్చగడ్డిని ఆబగా తినటం ప్రారంభించింది. గాడిద గడ్డితినే ప్రాంతంలో పొదలు ఉన్నాయి. ఆ పొదల్లో ఒక తోడేలు దాక్కొని ఉంది. అది పొదల్లో దాక్కుని వచ్చిపోయే జంతువులను ఆరగించేస్తుంది. ఇది గాడిద గమనించలేదు. తోడేలు గాడిదను చూసింది. అమాంతంగా గాడిద ముందు నిలబడింది. అంతే తోడేలును చూడగానే గాడిదకు పైప్రాణాలు పైనే పోయాయి. ఏం చేయాలో తోచక కంగారుపడింది గాడిద. ఇంతలో గాడిద బుర్రలో ఒక మెరుపులాంటి ఆలోచన మెదిలింది. అంతే గాడిద నెమ్మదిగా కుంటుతూ మెల్లగా నడవసాగింది. ఏం పాపం కాలు కుంటుతున్నావు అని అడిగింది తోడేలు. ఏం చేయమంటావ్ అంతా నా కర్మ మా ఇంటి దగ్గర ఒక కంచె ఉంది. ఆ కంచె దాటుతుంటే నా ఎడం కాలిలో ఓ ముల్లు దిగబడింది. మీలాంటి వాళ్ళ నోట్లో చావడానికి కథ భగవంతుడు మమ్మల్ని పుట్టించాడు. ఈనాడు నా వంతు వచ్చింది. నిన్ను తప్పించుకుపోలేను కదా అంది గాడిద. అయితే ఇప్పుడు ఏమంటావు అంది తోడేలు. ఏంలేదు నా కాల్లో దిగబడ్డ ముల్లు విషపూరితం. దాంతో పాటు నన్ను తింటే నీకు ప్రమాదం. ఆ ముల్లు తీసేసి నా బాధ తొలగించు. ఆ తరువాత తృప్తిగా నేను నీకు ఆహారం అవుతాను అంది గాడిద. సరే ముల్లు తీద్దాం పద అంటూ గాడిదను తొందరపెట్టింది తోడేలు. దేవుడిచ్చిన ఆహారాన్ని వదలకూడదు. ఈ గాడిదను నేను వదలకూడదు అని మనసులో అనుకుంటుంది తోడేలు. సరే పద నీ కాలిలో గుచ్చుకున్న ముల్లును తీసేస్తా నడువు అని గాడిదను తొందరపెట్టింది తోడేలు. ఏ కాలు చూపించు అని గాడిద వెనుకవైపు చేరి అడిగింది. గాడిద కాలు ఎత్తి వెనుకకు చూస్తూ తోడేలు. అంతే గాడిద ఫెడేల్‌మంటూ తోడేలు మూతిమీద తన్ని పరుగు అందుకుంది గాడిద. ఆ దెబ్బకి వెల్లకిలా పడిపోయింది తోడేలు. అది తెప్పరిల్లటానికి కొంత సమయం పట్టింది. తోడేలు కళ్ళు తెరుచుని చూసేసరికి గాడిద కనుచూపు మేర దాటిపోయింది. అటు ఆహారం లభించక, తోడేలు ఒళ్ళు హూనమయింది. తోడేలు బతుకు జీవుడా అనుకుంటూ అడవిలోకి పరుగెత్తింది.

భారతదేశ నదులు






భారతదేశంలోని నదులను హిమాలయ నదులు, దక్కన్ నదులు అని రెండు రకాలుగా విభజించారు. మనదేశంలో ముఖ్యంగా మూడు ప్రాంతాలు నదుల జన్మస్థానాలు.. అవి ఒకటి హిమాలయాలు, రెండు వింధ్య సాత్పుర పర్వతాలు, పడమటి కనుమలు. భూగర్భశాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం దక్కన్ నదులు హిమాలయ నదుల కన్నా ప్రాచీనమైనవి. దక్కన్ నదులు చాలావరకు రుతువుల మీద ఆధారపడి ఉంటాయి. హిమాలయ నదులు వర్షాల వలన, వేసవిలో మంచు కరగటం వలన సంవత్సరం పొడవునా ప్రవహిస్తూ ఉంటాయి. అందుకే వీటిని శాశ్వత నదులు అంటారు. హిమాలయ నదులు దేశంలోని మొత్తం నీటిలో 70శాతం నీటిని సముద్రంలోకి చేరవేస్తాయి. దక్కన్ నదులు 30 శాతం నీటిని చేరవేస్తాయి.

హిమాలయ నదుల్లోని సింధునది వలనే మన దేశానికి హిందూదేశం అని పేరు వచ్చింది. సింధునది టిబెట్‌లోని మానస సరోవర్ దగ్గర కైలాస శిఖరంలో పుట్టి హిమాలయాల మీదుగా పాకిస్థాన్ గుండా ప్రవహించి కరాచీ దగ్గర అరేబియా సముద్రంలో కలుస్తుంది. గంగానది హిమాలయాల్లోని గంగోత్రి దగ్గర పుట్టి ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాల గుండా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. బ్రహ్మపుత్ర నది మానస సరోవర్‌లో జన్మించి టిబెట్, అరుణాచలప్రదేశ్, అస్సాం, బంగ్లాదేశ్ గుండా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. దక్కన్ నదుల్లో మహానది, గోదావరి, కృష్ణ, కావేరి, పెన్న.. లాంటి నదులు తూర్పు వైపునకు ప్రవహిస్తాయి. నర్మద, తపతి, శరావతి, నేత్రావతి నదులు పశ్చిమ దిక్కుగా ప్రవహిస్తాయి.

తూర్పు వైపునకు ప్రవహించే నదులు పడమటి కనుమల్లో పుట్టి దక్కన్ పీఠభూమికి అడ్డంగా, తీరమైదానాల గుండా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తాయి. పశ్చిమ వైపునకు ప్రవహించే నదులు అరేబియా సముద్రంలో కలుస్తాయి.

కింది గడులలో సరైన పదాన్ని నింపండి




పొడుపు కథలు

1. దోసెడు నీళ్లలో దొరసాని జలకాలాడుతుంది. ఏమిటిది?
2. గోడమీద బొమ్మ, గొలుసుల బొమ్మ, వచ్చే పోయేవారికి వడ్డించే బొమ్మ ఏమిటిది?
3. రాజావారి తోటలో రోజాపూలు చూసేవారేగానీ కోసేవారు లేరు?
4. ముక్కు మీద కెక్కు, ముందరి చెవులనొక్కు, టక్కునిక్కుల పొక్క, జారిందంటే పుటుక్కు ఏమిటి?
5 పచ్చపచ్చని తల్లి, పసిడి పిల్లల తల్లి, తల్లిని చీల్చితే, తియ్యని పిల్లలు ఏమిటిది?

సమాధానాలు : 1. వెన్నముద్ద 2. తేలు
3. ఆకాశ నక్షత్రాలు 4. కళ్లజోడు
5. పనసపండు

దారి కనుక్కోండి



సాక్షి అగర్వాల్ న్యూ లుక్



బాలీవుడ్ జంట రహస్య వివాహం!



ఈ మధ్య కాలంలో సెలబ్రిటీల పెళ్ళిళ్ల ఎంత సీక్రెట్‌గా జరుగుతున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రేమాయణంపై పలు పుకార్లు వస్తున్నా, దానిపై స్పందించని ప్రేమ జంట సడెన్‌గా మంచి ముహూర్తం చేసుకొని ఏడడుగులు వేస్తున్నారు. రీసెంట్‌గా కోహ్లి, అనుష్క జంట అలానే ఇటలీలో రహస్య వివాహం చేసుకొని అందరికి షాక్ ఇచ్చింది. ఇక ఇప్పుడు బాలీవుడ్ నటులు టైగర్ ష్రాఫ్, దిశా పతానీలు రహస్య వివాహం చేసుకున్నారని వార్తలు వస్తున్నాయి. లోఫర్ అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకులకి పరిచయమైన దిశా రెగ్యులర్‌గా టైగర్‌తో కనిపిస్తూ ఉంటుంది. వీరిద్దరు కలిసి బేఫిక్రా అనే ఆల్బమ్‌లోను నటించారు. రీసెంట్‌గా బాఘీ2 అనే చిత్రంలోను నటించగా , ఈ మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే కొత్త సంవత్సరం సందర్భంగా శ్రీలంకకి వెళ్లిన ఈ జంట సీక్రెట్ మ్యారేజ్ చేసుకుంటున్నట్టు బాలీవుడ్ మీడియా చెబుతుంది. టైగర్, దిశాలు ఒకరికొరు దండలు మార్చుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ గాసిప్ గుప్పుమంది. గతంలో వీరి ప్రేమకి సంబంధించి టైగర్ ఇంట్లో తెలియగా టైగర్ ష్రాఫ్ తండ్రి జాకీ ష్రాఫ్ ఓకే అన్న తల్లి అయేషా మాత్రం ఒప్పుకోలేదని తెలుస్తుంది. మరి ఈ వార్తపై పూర్తి క్లారిటీ రావాలంటే కొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

విశాలాంధ్ర సినిమా

విష్ణు కొడుకుకి భలే పేరు..



నటుడు, నిర్మాత మరియు ఎడ్యుకేషనలిస్ట్ మంచు విష్ణు ఇంట నూతన సంవత్సరం రోజున ఆనందం రెట్టింపు అయిన సంగతి తెలిసిందే. న్యూ ఇయర్‌కి గ్రాండ్ వెల్కమ్ చెబుతూ ఆనంద క్షణాలను గడుపుతున్న టైంలో వారింట పండంటి బిడ్డ జన్మించడం మంచు ఫ్యామిలీకి ఇది డబుల్ బొనాంజానే అని చెప్పవచ్చు. తమ కుటుంబంలోకి వచ్చిన ఆ చిన్నారికి మంచు కుటుంబ సభ్యులు ఆసక్తికర పేరు పెట్టారు. అవ్రామ్ భక్త అని చిన్నారికి పేరు పెట్టిన విష్ణు దాని అర్థం కూడా తెలియజేశాడు . అవ్రామ్ అంటే ఎవరు ఆపలేరని అర్థమని అన్నాడు. ఇక డిసెంబర్ 2011లో జన్మించిన ట్విన్స్‌లలో ఒకరైన అరియానాని 'బేబీ లయన్' అని, వివియానా 'బేబీ టెడ్డీ బేర్' అని పిలుస్తున్నట్టు విష్ణు తన ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. విష్ణు ప్రస్తుతం ఆచారి అమెరికా యాత్ర అనే చిత్రంతో బిజీగా ఉండగా ఈ చిత్రాన్ని జి నాగేశ్వర్ రెడ్డి తెరకెక్కిస్తున్నాడు. ఇక మదన్ తెరకెక్కిస్తున్న గాయత్రి చిత్రంలోను విష్ణు ముఖ్యపాత్ర పోషిస్తున్నాడు.

అన్నీ శాశ్వతంగా ఉండిపోవు : టబు



కొన్ని అనుభవాలు, జ్ఞాపకాలు శాశ్వతంగా మనతోనే ఉండిపోవు అని అంటున్నారు నటి టబు. ఈ ఏడాది 'గోల్‌మాల్ ఎగైన్' సినిమాతో ఆమె ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కామెడీ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమాలో ఆమె కీలక పాత్రలో నటించారు. ఏడాదికో సినిమా చేస్తూ వివిధ పాత్రలో నటిస్తున్న టబుకి విభిన్న పాత్రల్లో అలరించడం అలవడిందని అంటున్నారు. 'ఒక పాత్రలో నటిస్తున్నప్పుడు మన ధ్యాస ఆ పాత్ర మీదే ఉండిపోతుందని చెప్పలేం. సెట్స్‌లో షూటింగ్ అయిపోయాక మన క్యారెక్టర్‌లోకి వచ్చేస్తాం. ఒక్కోసారి కేవలం మనం చేసిన పాత్రే కాదు తోటి నటులతో నటించినప్పుడు ఏర్పడిన జ్ఞాపకాలు కూడా మనతో పదిలంగా ఉంటాయి. కొన్ని శాశ్వతంగా ఉండకపోవచ్చు కూడా. బాలీవుడ్‌లో 'బీవీ నెం.1', 'హేరా ఫేరీ' తదితర చిత్రాల్లో నటించాను. ఆ రెండూ కామెడీ నేపథ్యంలో వచ్చినవే. దాంతో ఒకే తరహా పాత్రల్లో నటిస్తున్నానని కొత్తగా ప్రయత్నించాలని చాలా మంది దర్శకులు, అభిమానులు చెప్తుంటారు' అని చెప్పుకొచ్చారు.

'అ!' టీజర్ విడుదల



యువ కథానాయకుడు నాని తొలిసారి నిర్మాతగా తెరకెక్కిస్తున్న చిత్రం 'అ!'. కాజల్, రెజీనా, నిత్యామీనన్, ప్రియదర్శి, మురళీ శర్మ, అవసరాల శ్రీనివాస్, కాజల్, రవితేజ, నాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వీరందరికీ సంబంధించిన విభిన్నమైన ఫస్ట్‌లుక్‌లను విడుదల చేసిన చిత్రబృందం ఇప్పుడు సినిమా టీజర్‌ను విడుదల చేసింది. టీజర్‌లో చేపకు వాయిస్ ఓవర్ ఇస్తున్న నాని మాట్లాడుతూ.. 'మీకొక కథ చెప్తా. అనగనగా ఓ రాజు. ఆ రాజుకి ఏడుగురు కొడుకులు. ఆ ఏడుగురూ నాలాంటి ఏడు అమాయక చేపల్ని పట్టుకున్నారు' అని ఏడుస్తూ అంటాడు. ఇందుకు చెట్టుకు వాయిస్ ఓవర్ ఇస్తున్న రవితేజ స్పందిస్తూ..'నేను విత్తనంగా ఉన్నప్పటి నుంచి వింటున్నా. కొత్తగా ఏదన్నా చెప్పండ్రా' అని అనడం నవ్వులు పూయిస్తోంది. రవితేజ ప్రశ్నకు నాని.. 'కొత్తగా అంటే.. ఈ టీజర్ చూడండి' అంటాడు. టీజర్‌లో నిత్యమీనన్, మురళీ శర్మ, ఈషా రెబ్బా, రెజీనా, అవసరాల శ్రీనివాస్‌ల పాత్రలను చూపించారు. అనంతరం టీజర్ గురించి రవితేజ స్పందిస్తూ.. 'అదిరిపోయింది. ఇంతకీ హీరో ఎవరో..' అని అడుగుతాడు. ఇందుకు నాని..'కథే హీరో' అంటాడు. నాని సమాధానం విని 'అ!' అంటాడు రవితేజ. 'అదే టైటిల్' అని నాని అనడం సినిమాలపై అంచనాలను పెంచేస్తోంది. ప్రశాంత్ వర్మ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దాదాపు పూర్తయింది. ఫిబ్రవరిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

వెంకీతో త్రివిక్రమ్ రీమేక్



ఫ్యామిలీ హీరో వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందిస్తున్నట్టుగా హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ఇప్పటికే ప్రకటించింది. అయితే ఈ సినిమా బాలీవుడ్ సూపర్ హిట్ జాలీ ఎల్ఎల్‌బి 2 చిత్రానికి రీమేక్ అన్న టాక్ వినిపిస్తోంది. ఇటీవలే జాలీ ఎల్ఎల్‌బి 2 నిర్మాతలను రాధాకృష్ణ కలిసి చిత్ర హక్కులను తీసుకున్నారట. అయితే అది వీరిద్దరి కాంబినేషన్లో వచ్చే సినిమానే అని అధికారికంగా ప్రకటించలేదు. రీమేక్ సినిమాలు చేయటంలో వెంకటేష్‌కు తిరుగులేని రికార్డ్ ఉంది. ఆయన కెరీర్‌లో అత్యధిక విజయాలు రీమేక్స్ రూపంలోనే వచ్చాయి. రీసెంట్‌గా గురు సినిమా కూడా రీమేక్‌గా తెరకెక్కి విజయం సాధించింది. అయితే త్రివిక్రమ్ ఇంతవరకు ఏ సినిమాను రీమేక్ చేయలేదు. అయితే ఈ సినిమా ఓకే అయితే మొదటిసారిగా త్రివిక్రమ్ రీమేక్ చేసే సినిమా ఇదే అవుతుంది. వీరిద్దరి కాంబినేషన్ అనగానే మనకు గుర్తొచ్చే సినిమా నువ్వు నాకు నచ్చావ్. విజయ్ భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు త్రివిక్రమ్ రచయితగా పనిచేశాడు. అందులో తన మార్క్ డైలాగ్‌లతో, కామెడీతో తన ముద్ర వేశాడు. ఇప్పుడు కూడా అలాంటి ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రావొచ్చని అభిమానులు భావిస్తున్నారు.

ప్రపంచ ఉత్తమ నటుడు మోడీ !

దళితనేత జిగ్నేష్ మెవానీ నిశిత విమర్శ



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోడీపై దళిత నాయకుడు, గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగ్నేష్ మెవానీ మరోసారి విమర్శల వర్షం కురిపించారు. మోడీని ప్రపంచ ఉత్తమ నటుడిగా అభివర్ణించారు. మోడీపై విమర్శలు సంధిస్తూ వరుసగా ట్వీట్ల బాణం వదిలారు. 21వ శతాబ్దపు ప్రపంచ ఉత్తమ నటుడు మోడీ అని ట్వీట్ చేశారు. 21వ శతాబ్దపు ప్రపంచ ఉత్తమ నటుడు అవార్డు భారత్‌కు చెందిన వారికే వస్తుందని నోస్ట్రాడమస్ జోస్యం చెప్పారని మరో ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లకు వీడియోను సైతం మెవానీ విడుదల చేశారు. 'నాపై దాడి చేయండి. అంతేగానీ నా దళిత సోదరులు, సోదరీమణులపై కాదు' అని మోడీని ఉద్దేశించి స్పష్టం చేశారు. భీమా కోరెగావ్ ఘర్షణల నేపథ్యంలో మోడీపై మెవానీ ట్వీట్లు దుమారం రేపాయి. దళితులను ఉద్ధరిస్తున్నట్టు మోడీ గొప్పగా నటిస్తున్నారని, వాస్తవంగా దళితుల పట్ల ప్రధానికి ఎలాంటి గౌరవం, బాధ్యత లేదని మెవానీ విమర్శించారు. మోడీ రేడియో ప్రసంగం మన్‌కీ బాత్‌పైనే ట్వీట్ చేశారు. 'నేను ప్రేమను పంచడానికే వచ్చాను. ద్వేషాన్ని పంచడం లేదు. నా మాటలు వినండి. మీ మాటలు నేను వినడం కాదు' అంటూ మోడీ చేసిన ప్రసంగంపైనా విమర్శలు గుప్పించారు. మరోవైపు, డిసెంబరు 31న నగరంలో జరిగిన కార్యక్రమంలో రెచ్చగొట్టే ప్రసంగం చేశారని ఆరోపిస్తూ మెవానీ, ఢిల్లీలోని జేఎన్‌యూ వర్సిటీ విద్యార్థి ఉమర్ ఖలీద్‌పై పూనె పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. భీమా కోరెగావ్ యుద్ధం జరిగి 200 ఏళ్లు అయిన సందర్భంగా ఎల్గార్ పరిషద్ నిర్వహించిన కార్యక్రమంలో మెవానీ, ఖలీద్ ప్రసంగించారు. వీధుల్లోకి వచ్చి తిరుగుబాటు చేయండని మెవానీ దళితులను రెచ్చగొట్టారని, దీనివల్ల ప్రజలు వీధుల్లోకి వచ్చారని, ముంబై, పూనె సహా మహారాష్ట్రలో ఉద్రిక్తతలకు కారణమయ్యారని వారిపై కేసు నమోదైంది.

ఆయుష్ టీచర్లకు

అర్హత పరీక్ష తప్పనిసరి

న్యూఢిల్లీ : పరిశోధన, బోధన ప్రమాణాల మెరుగుకు ప్రత్యామ్నాయ వైద్య విభాగాలైన ఆయుర్వేద, యోగా, నేచురోపతి, యునానీ, సిద్ధ, హోమియోపతిలకు చెందిన నూతన ఉపాధ్యాయుల కోసం ఒక ప్రవేశస్థాయి పరీక్షను నిర్వహించేందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. 'ఆయుష్‌కు చెందిన నూతన టీచర్ల కోసం ఒక అర్హత పరీక్షను రూపొందిస్తున్నాం. అభ్యర్థి మంచి వైద్యుడు కావచ్చు కానీ మంచి ఉపాధ్యాయుడు కానక్కరలేదు. ఈ అర్హత పరీక్ష వారి జ్ఞానాన్ని, ఆప్టిట్యూడ్‌ను తనిఖీ చేస్తుంది' అని ఆయుష్ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచ తెలిపారు. 30 వేల మంది యోగా టీచర్లతోపాటు సుమారు 5 వేల మంది హోమియోపతి టీచర్లతో సహా 18 వేల మంది ఆయుష్ ఉపాధ్యాయులున్నట్లు అంచనా. పరిశోధన, బోధనలో ఆసక్తి ఉన్న నాణ్యమైన ఉపాధ్యాయులు మంచి విద్యార్థులను తీర్చిదిద్దుతారు. ఆయుష్‌లో ప్రపంచశ్రేణి మానవ వనరుల ఉత్పత్తిని మేము లక్ష్యం పెట్టుకున్నాం. నిర్ధారిత ప్రణాళిక చర్యల్లో ఒకటిగా ఈ పరీక్ష ఉంటుంది' అని వైద్య కొటేచ పేర్కొన్నారు. కాగా ఈ అర్హత పరీక్ష వల్ల ఏటా ఆయుష్ విభాగాలకు చెందిన 4 వేల మందికిపైగా పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. ఇక ఉపాధ్యాయులందరి హాజరు పరిశీలనకు ఒక ఏకీకృత ధ్రువీకరణ కోడ్‌ను కేటాయించారు. 'మన విద్యా వ్యవస్థలో నాణ్యత, పారదర్శకత తీసుకు వచ్చేందుకు మేము ప్రయత్నిస్తున్నాం' అని చెప్పారు.

రూ.80వేల కోట్లతో

బ్యాంక్ రీక్యాపిటలైజేషన్

పార్లమెంటు ఆమోదాన్ని కోరిన కేంద్రం

న్యూఢిల్లీ : ప్రతిపాదిత రీక్యాపిటలైజేషన్ (పున:మూలధనీకరణ) బాండ్ల ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులకు మరింత మూలధనం సమకూర్చే ఉద్దేశంతో రూ.80వేలకోట్ల అదనపు వ్యయానికిగాను ఆమోదం తెలపాలని పార్లమెంటును కోరినట్టు ఆర్థికశాఖ గురువారం వెల్లడించింది. ప్రతిపాదిత బాండ్లకు ఎస్ఎల్ఆర్ (స్టాట్యూటరీ లిక్విడిటీ రేషియో) హోదా ఉండదని, అవి వ్యాపారసహితం కాదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. 2017-18కి సప్లిమెంటరీ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ మూడో బ్యాచ్ రూపేణ రూ.80వేల కోట్లను ప్రభుత్వం కోరినట్టు తెలిపాయి. మొండిబకాయిల కారణంగా రెండేళ్లుగా నష్టాలను చవిచూస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు చేయూత అందించే ఉద్దేశంతో ప్రతిపాదించిన రూ.1.35లక్షల కోట్ల పున:మూల ధనీకరణ బాండ్లలో భాగంగా ఈమేరకు నిధులు సమకూర్చుతున్నట్టు వివరించాయి. ప్రభుత్వ సంరక్షణ (గవర్నమెంట్ సెక్యూరిటీస్) నేపథ్య ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీలు) రీక్యాపిటలైజేషన్ దిశగా అదనపు ఖర్చు కోసం పార్లమెంటు ఆమోదాన్ని కోరినట్టు ఆర్థికశాఖ పేర్కొంది. గవర్నమెంట్ సెక్యూరిటీస్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆయా బ్యాంకుల డిపాజిట్లలో ఎస్ఎల్ఆర్ ఓ భాగమని వెల్లడించింది. మొదటి త్రైమాసికంలోనే నిధులను సమకూర్చే అవకాశమున్నట్టు అధికారి ఒకరు తెలిపారు. నష్టపోయిన ప్రభుత్వ రంగ బ్యాంకులను బలపర్చేందుకుగాను రెండేళ్ల కార్యాచరణ ప్రణాళికను అక్టోబరులో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించడం విదితమే.

బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో మోడీ భేటీ..?

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జనవరి 10న దేశానికి చెందిన ప్రముఖ ఆర్థిక వేత్తలతో ఒక సమావేశం నిర్వహించే అవకాశాలున్నట్లు సమాచారం. బడ్జెట్ ముందు ఈ సమావేశం నిర్వహించడం సర్వసాధారణం. నోట్ల రద్దు ప్రభావం పడిన 2017, డిసెంబరులో కూడా మోడీ ఇలాంటి సమావేశాన్ని నిర్వహించారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి తుది బడ్జెట్ అయిన 2018-19 కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి ఒకటో తేదీన సమర్పించనున్నారు. కాగా 30 మందికిపైగా ప్రముఖ ఆర్థికవేత్తలతో ప్రధాన మంత్రి మోడీ సమావేశం కానున్నారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, నీతి అయోగ్ సీఈవో అమితాబ్ కాంత్, నీతి అయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్, ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ వివేక్ దేబ్‌రాయ్, ఆర్థిక సలహా మండలి ఇతర సభ్యులు కూడా హాజరయ్యారు. అమితాబ్ కాంత్, రాజీవ్ కుమార్‌లు ఈ సమావేశంలో నీతి అయోగ్ చేసిన పని గురించి కూడా ఒక సవివరమైన నివేదిక సమర్పించవచ్చు. ప్రధాన మంత్రి కూడా ఆర్థిక పరిస్థితిని సమీక్షించవచ్చని భావిస్తున్నారు.

•15 మంది

పాక్ రేంజర్లు ఖతం..!





- పాక్‌కు భారత్ దీటైన జవాబు
- సరిహద్దు చొరబాటుయత్నం భగ్నం
- హెడ్ కానిస్టేబుల్ హజ్రా మృతి
- ఘనంగా అంతిమ వీడ్కోలు

శ్రీనగర్ : తమ జవాన్‌ను పొట్టనబెట్టుకున్న పాకిస్తాన్ సైన్యంపై భారత ఆర్మీ ప్రతీకార దాడికి దిగింది. సుమారు 15 మంది పాక్ రేంజర్లను ఖతం చేసింది. బుధవారం సాయంత్రం పాక్ ఆర్మీ కాల్పుల ఉల్లంఘనకు దిగిన విషయం తెలిసిందే. ఎలాంటి కవ్వింపు చర్యలు లేకపోయినా.. ఏకపక్షంగా భారత సైన్యం లక్ష్యంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఆర్పీ హజ్రా తీవ్రంగా గాయపడ్డారు. పుట్టినరోజు నాడే పాక్ కాల్పుల్లో గాయపడిన హజ్రా చికిత్స పొందుతూ ఆసుపత్రిలో ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనతో భారత సైన్యం రగిలి పోయింది. తరచుగా సరిహద్దుల్లో కాల్పుల ఉల్లంఘనకు పాల్పడుతూ.. భారత సైన్యాన్ని ఏమార్చి ఉగ్రమూకల చొరబాటుకు పాక్ సైనికులు సహకరిస్తున్నారు. ఓ వైపు చొరబాటుదారులను అడ్డుకుంటూనే పాకిస్థాన్ కవ్వింపు చర్యలపై భారత్ ఆర్మీ సంయమనంతో వ్యవహరిస్తోంది. పాకిస్థాన్ మాత్రం? చిన్నపాటి ఆయుధాలు, మోటార్ షెల్స్ దాడులతో కవ్విస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఆపరేషన్ నిర్వహించిన భారత్ సైన్యం సరిహద్దుల దాటి పాక్ పోస్టులను మూడింటిని ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్‌లో 12 నుంచి 15మంది పాక్ రేంజర్లు హతమైనట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే..పాక్ కాల్పుల్లో అమరుడైన బీఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఆర్పీ హజ్రాకు గురువారం భారత సైన్యం ఘనంగా అంతిమ వీడ్కోలు పలికింది. సాంబ సెక్టార్‌లో హజ్రాకు సైనికులు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాశ్మీర్ డీజీపీ ఎస్పీ వసిద్ పాల్గొని హజ్రాకు శాల్యూట్ చేశారు.

జాతీయ సదస్సుకు బ్రేక్!?

- జాతీయ సదస్సుకు బ్రేక్?!
- ముంబై పోలీసుల దాష్టీకం
- చివరి నిముషంలో అనుమతి రద్దు
- విద్యార్థుల ప్రతిఘటన
- నేతల అరెస్టు?విడుదల
- విద్యార్థి సంఘాల ఖండన



ముంబై : కోరెగావ్ హింసకు నిరసనగా?దళితులు చేపట్టిన మహారాష్ట్ర బంద్ విజయవంతంగా ముగియగా గురువారం ముంబై నగరం దైనందిన కార్యక్రమంలో బిజీబిజీగా మారిన తరుణంలో గుజరాత్ దళిత నేత జిగేస్ మేవానీ, విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్ పాల్గొనే విద్యార్థి సదస్సును ముంబై పోలీసులు అడ్డుకున్నారు. అక్కడకు చేరుకున్న విద్యార్థులను పశుబలంతో చెదరగొట్టారు. ఈ మేరకు విలే పార్లేలోని భారు దాస్ హాల్ ఆడిటోరియంను పూర్తిగా పోలీసులు తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అఖిల భారత విద్యార్థుల సదస్సు కోసం చాలా రోజుల కిందటే విద్యార్థులు అనుమతి తీసుకున్నప్పటికీ.. పోలీసులు ఇప్పుడు హఠాత్తుగా అడుకున్నారు. ఆడిటోరియం పరిసర ప్రాంతాల్లో 149 సెక్షన్ విధించారు. పలువురు విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు నిర్వాహకుడు, ఛత్ర భారతి ఉపాధ్యక్షుడు సాగర్ భాలేరావ్ ప్రకటించారు. ఐతే, అంతక ముందు విద్యార్థులు ఆగ్రహంతో పోలీసులపై తిరుగుబాటు చేశారు. ఆడిటోరియంలో అనుమతి ఇవ్వక పోతే నడిరోడ్డుపై సదస్సును నిర్వహిస్తామని వాగ్వాదానికి దిగారు.

తాము సదస్సు నిర్వహించి తీరుతామని హటాయించారు. విద్యార్థి నాయకులు, విద్యార్థులను అరెస్టు చేసి జుహు పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు జుహు పోలీసు స్టేషన్ ఎదుట బైటాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతున్న తరుణంలో విద్యార్థి నాయకులకు స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారు. ఈ సదస్సును ముంబై పోలీసులు అడ్డుకోవటంపై దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. అలహాబాద్ వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు రీచా సింగ్ పోలీసు చర్యలను తీవ్రంగా ఖండించారు. దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలను ప్రభుత్వం లక్ష్యం చేసుకుందని, అక్రమ నిర్బంధం కొనసాగిస్తోందని, ఈ చర్యలను తాము తిప్పికొడతామని, గల్లీ నుంచి ఢిల్లీ వరకూ ఉద్యమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

అంగడిలో ఆధార్!?

న్యూఢిల్లీ : ఆధార్‌లో సమాచారం ఎట్టి పరిస్థితిలోనూ బయటపడే అవకాశం లేదని, అందుకు అన్ని జాగ్రత్తలూ తీసు కున్నామని పదే పదే యూనిక్ ఐడెంటి ఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా గొప్పలు పోతుండగా ప్రస్తుతం ఆధార్ రహస్య వివరాలను కొందరు ఇట్టే లీక్ చేస్తున్న విషయం కలవరం సృష్టిస్తోంది. ఆధార్ భద్రతలోని లోపాన్ని ట్రిబ్యూన్ పత్రిక బయటపెట్టింది. 12 అంకెల ఆధార్ నెంబర్ ద్వారా ఎంతటి వక్తుల వివరా లను మరెవరైనా సరే సులభంగా సంగ్ర హించవచ్చని ట్రిబ్యూన్ నిరూపించింది. ఇందుకు కేవలం రూ.500లు ఖర్చు చేస్తే చాలు, మొత్తం సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తేలింది. వాట్సప్ ద్వారా ఈ వివరాలు అందించే వ్యక్తిని పరిచయం చేసుకున్న ట్రిబ్యూన్ విలేఖరి పేటీఎం ద్వారా రూ.500 చెల్లించాడు. పది నిమిషాల్లోనే లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఆ రిపోర్టర్‌కు అందాయి. ఇందులో వంద కోట్ల మంది ఆధార్ వివరాలు ఉన్నాయి. ఏ ఆధార్ నంబర్‌నైనా ఎంటర్ చేస్తే చాలు దానికి సంబంధించిన పేరు, అడ్రెస్, పిన్ కోడ్, ఫోన్, ఫొటో ఇలా అన్ని వివరాలు చూసుకోవచ్చు. మరో రూ.300 ఇస్తే ఆధార్ కార్డును ప్రింట్ చేసే సాఫ్ట్‌వేర్ కూడా ఇవ్వడానికి ఆ ఏజెంట్ అంగీకరించాడు. యూఐఏడీఐ మాత్రం ఈ వార్తలను ఖండించింది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నదని ఆరోపించింది. ఆధార్ వివరాలు పూర్తి భద్రంగా ఉన్నాయని, ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని స్పష్టంచేసింది.

'చిలకా'కు తగ్గిన దూరపు చుట్టాలు

- సరస్సు నీటిమట్టం పెరగడమే కారణం
- ఈ ఏడాది కనిపించిన 'రివర్ లాప్వింగ్'
- ఫ్లెమింగోలు రాక తగ్గింది



బరంపూర్ : ఒడిశాలోని చిలకా సరస్సుకు ఈ సీజన్‌లో వలస పక్షుల రాక తగ్గింది. గత ఏడాదితో పోల్చితే 53,000 కంటే తక్కువ సంఖ్యలో ఇక్కడకు వచ్చాయి. వార్షిక గణాంకాల ప్రకారం ఈ ఉప్పు నీటి సరస్సుకు 147 వేర్వేరు జాతులకు చెందిన 8,93,390 పక్షులు వచ్చాయి. గత శీతాకాలంలో 167 వేర్వేరు జాతులకు చెందిన 9,47,119 పక్షులు సరస్సుకు వలస రాగా, వాటిలో 3,74,756 పక్షులు 15.59 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని నలబనా పక్షి అభయారణ్యానికి వచ్చినట్లు డివిజనల్ అటవీ శాఖాధికారి(చిలకా వన్యప్రాణి డివిజన్) బికాష్ రంజన్ తెలిపారు. అయితే ఈ సీజన్‌లో నలబనా పక్షి అభయారణ్యం వద్ద 3,20,826 పక్షులు కనిపించాయని ఆయన వివరించారు. భారీ వర్షాల కారణంగా సరస్సు నీటి మట్టం పెరిగిన కారణంగా ఈ ఏడాది సరస్సుకు వచ్చే వలస పక్షుల సంఖ్య తగ్గిందని డీఎఫ్‌వో వివరించారు. అంతేకాక ఈ ఏడాది షెడ్యూల్‌కు 10 రోజుల ముందు వలస పక్షుల సంఖ్యను లెక్కించడం జరిగిందన్నారు.

దాస్ మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా స్థానిక పక్షి 'రివర్ లాప్వింగ్' సరస్సు వద్ద కనిపించిందని తెలిపారు. ఈ పక్షులు సాధారణంగా నదీ ప్రవాహాలపై ఉంటాయన్నారు. మహానది వద్ద వీటి సంతానోత్పత్తి జరిగినప్పటికీ ఎన్యూమరేటర్లు ఈ పక్షిని చిలకా సరస్సు వద్ద గుర్తించారని అన్నారు. గత ఏడాది ఫ్లెమింగోల సంఖ్య 3,800గా ఉండగా, ఈసారి 347కి పడిపోయినట్లు చెప్పారు. కాగా వన్యప్రాణి కార్యకర్తలు, అనేక మంది పక్షి శాస్త్రవేత్తలు, వన్యప్రాణి సంస్థల అధికారులు, బాంబే నాచురల్ హిస్టరీ సొసైటీ(బీఎన్‌హెచ్ఎస్)కి చెందిన పక్షి శాస్త్రవేత్తలతో సహా సుమారు 100 మంది బుధవారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల మధ్య పక్షుల లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఏటా తీవ్రమైన శీతాకాలంలో ఈ వలస పక్షులకు చిలకా సరస్సు ఆతిథ్యమిస్తుంది. తమ సొంత ప్రాంతాల్లో తీవ్రమైన చలి నుంచి తప్పించుకునేందుకు కాస్పియన్ సముద్రం, బైకాల్ సరస్సు, అరల్ సముద్రం, రష్యాకు చెందిన ఇతర మారుమూల ప్రాంతాలు, మంగోలియాకు చెందిన కిర్గిజ్ గడ్డి మైదానాలు, మధ్య, ఆగ్నేయ ఆసియాల నుంచి పక్షులు చిలకా సరస్సుకు వలస వస్తాయి. అయితే వేసవి సీజన్ ప్రారంభంలో ఈ వలస పక్షులు తమ స్వదేశానికి వెళ్లడం ప్రారంభిస్తాయి. యూరాసియన్ విజన్స్ ఈసారి పెద్ద సంఖ్యలో దాదాపు 1.57 లక్షల వరకు వచ్చాయన్నారు. ఇక పిన్‌టెయిల్స్, గడ్వాల్స్ పక్షులు లక్షకుపైగా కనిపించాయని వివరించారు. మరో విషయమేమిటంటే, కొత్త ప్రాంతాల్లో ఇరావాడి డాల్ఫిన్లు ఉన్నట్లు చెప్పారు.

చిలకా డెవలప్‌మెంట్ అథారిటీ(సీడీఏ) ప్రధాన కార్య నిర్వాహణాధికారి మాట్లాడుతూ ఈసారి రుతుపవనాలు పక్షులకు అనుకూలంగా లేవు. భారీ వర్షాల కారణంగా అధిక నీటి మట్టంతో వలస పక్షులు తగ్గాయన్నారు. గత ఏడాది అనేక అల్పపీడన ద్రోణుల కారణంగా అకాల వర్షాలు కురిశాయి. దీని ఫలితంగా నలబనాతోపాటు చిలకా సరస్సు సమీపంలోని నీటి వనరుల వద్ద అధిక నీటిమట్టం ఉందని వివరించారు. 'ఫిబ్రవరి నెలలో వలస పక్షులకు సంబంధించి రెండోసారి పరిశీలన జరపాలని మేము నిర్ణయించాం' అని పేర్కొన్నారు.

'ఒక కుటుంబం-ఒక కారు'కు ఎన్‌జీటీ నో

న్యూఢిల్లీ : ఢిల్లీలో 'ఒక కుటుంబం, ఒక కారు' నిబంధనకు సంబంధించిన విజ్ఞప్తిని పరిశీలించి ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) తిరస్కరించింది. అనేక ప్రైవేట్, కమర్షియల్ వాహనాల నుంచి వెలువడే కార్బన్ ఉద్గారాల వల్ల పర్యావరణం దెబ్బతిని మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని న్యాయవాది సజన్ కే సింగ్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. అయితే దీనిపై ఇప్పుడే ఒక నిర్ణయం తీసుకోలేమని ఈ పిటిషన్‌పై విచారణను స్వీకరించిన చైర్‌పర్సన్ జస్టిస్ యూడీ సాల్వితో కూడిన ధర్మాసనం పేర్కొంది.

ఆరేళ్లుగా వార్షిక రాబడి చూపని ఎన్‌జీఓలు

న్యూఢిల్లీ : దాదాపు పదివేలకు పైగా స్వచ్ఛంద సంస్థలు ఆరు ఆర్థిక సంవత్సరాల వార్షిక రాబడికి సంబంధించిన వివరాలను దాఖలు చేయలేదని రాజ్యసభ బుధవారం వెల్లడించింది.2010-11 నుంచి 2015-16 ఆర్థిక సంవత్సరాల వరకు అంచనా వ్యయం, వార్షిక ఆదాయంకు సంబంధించిన వివరాలను ఈ స్వచ్ఛంద సంస్థలు దాఖలు చేయలేదని హోంశాఖ సహాయమంత్రి కిరణ్‌రిజ్జు దీనికి సంబంధించిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా బదులిచ్చారు. విదేశీ సహకార నియంత్రణ చట్టం ప్రకారం, కేంద్ర మంత్రిత్వ శాఖకు వార్షిక రాబడి వివరాలను దాఖలు చేయడం తప్పనిసరని, లేదంటే ఆయా సంస్థలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రొహింగ్యాలకు ఆధార్, పాన్‌లున్నాయి : కేంద్రం

న్యూఢిల్లీ : కొంతమంది రొహింగ్యా ముస్లింలు ఆధార్, పాన్, ఓటరు కార్డులను పొందినట్లు తెలుస్తోందని, అయితే అక్రమ వలసదారులకు నివాసం సౌకర్యం కల్పించిన దాఖలాలు ఏమీ లేవని హోంశాఖ సహాయ మంత్రి కిరణ్‌రిజ్జు స్పష్టంచేశారు. రాజ్యసభలో దీనికి సంబంధించిన ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ, కొంతమంది రొహింగ్యాలకు అక్రమంగా నివాస సౌకర్యం కల్పించినట్టు నిర్దిష్టమైన నివేదికలేమీ లేవని పేర్కొన్నారు. ఇటువంటివి జరిగినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ఆయా రాష్ట్ర అధికారులు వారి డాక్యుమెంట్ల రద్దుకు తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

యూపీ ప్రభుత్వానికి ఎన్‌హెచ్ ఆర్సీ నోటీసు

న్యూఢిల్లీ : జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. బారాబంకీ జిల్లాలోని ప్రజారోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో డాక్టర్, ఫార్మసిస్టు విధులను వార్డుబాయ్ నిర్వర్తిస్తుండగా, మీడియా ప్రసారం చేయడంతో దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మీడియా ప్రసారాలను ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా స్వీకరించిందని అధికారిక ప్రకటన వెలువడింది. ఆ పీహెచ్‌సీలో ఎటువంటి సౌకర్యాలు లేనందువల్ల ఎవరూ అక్కడికి వెళ్లడం లేదని స్థానికులు తెలిపారు. డాక్టరు, ఫార్మసిస్టు 10-15 రోజులకు ఒకసారి వస్తుంటారని వారు ఫిర్యాదు చేయడంతో పీహెచ్‌సీ దుస్థితిని మీడియా వెలుగులోకి తెచ్చింది.

ఎన్‌కౌంటర్‌లో గజదొంగ మృతి

బులంద్‌షార్ : ఉత్తరప్రదేశ్‌లో పేరుమోసిన గజదొంగ గురువారం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మంగళవారం స్యానా రోడ్డులో దోపిడీదారుడు సత్వీర్, ఆయన సహచరుడు రూ.10.60 లక్షలు దోపిడీ పాల్పడ్డారని, వారిని అడ్డగించిన పోలీసు బృందంపై వాళ్లు కాల్పులు జరిపారని చెప్పారు. దీంతో పోలీసులు కాల్పులు జరిపారన్నారు.ఇరువురి మధ్య హోరాహోరీగా కాల్పులు జరిగాయని ఆ క్రమంలో గజదొంగ మృతిచెందాడని తెలిపారు. ఆయన అనుచరుడు పరారయ్యాడని చెప్పారు.

నగదు బదిలీ కేసులో వ్యాపారికి బెయిలు

బులంద్‌షార్ : నగదు బదిలీ కేసులో అరెస్టయిన ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త గంగన్ ధావన్‌కు ప్రత్యేక కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, అంతే మొత్తం నగదు పూచికత్తుతో అదనపు సెషన్స్ జడ్జి సిద్ధార్థ శర్మ ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. 2017 నవంబరు 1న అరెస్టయిన ఆయన్ని అదే నెల 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఆయన పలు బ్యాంకుల నుంచి మొత్తం రూ.5 వేల కోట్లు రూపాయలు నగదు మళ్లింపు, దుర్వినియోగం చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ పేర్కొంది.

థామస్ చాందీపై కేసు నమోదుకు కోర్టు ఆదేశం

కొట్టాయం : కేరళలోని అలాప్పుజ్జా జిల్లాలో తన సొంత లేక్ రిసార్ట్‌కు వరి పొలాల మధ్యలో నుంచి నిబంధనలు ఉల్లంఘించి రోడ్డు వేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి థామస్ చాందీపై కేసు నమోదు చేయాలని వీఏసీబీని కోర్టు ఆదేశించింది. దీనిపై త్వరితగతిన నివేదిక అందించాలని కొట్టాయం ప్రత్యేక విజిలెన్స్ కోర్టు జడ్జి వి దిలీప్ ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేశారు.

పరువు హత్య కేసులో తండ్రీకొడుకులు అరెస్ట్

జంషెడ్‌పూర్ : జార్ఖండ్‌లో జార్ఖండ్‌లోని తూర్పు సింఘ్‌భూవమ్ జిల్లాలో గొలౌధిలో పరువు హత్య కేసులో తండ్రి కొడుకులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. వేరే సామాజిక వర్గానికి చెందిన యువకుడిని ప్రేమిస్తుందన్న ఆరోపణలతో బాలిక తండ్రి దశరథ్ మహతో (55), సోదరుడు రాజ్‌కిషోర్ మహతో (22) జనవరి 1న ఆమెను గొడ్డలితో నరికి చంపివేశారని పోలీసులు తెలిపారు. వీరిద్దరినీ స్థానిక కోర్టులో హాజరుపరిచిన అనంతరం జైలుకు తరలించినట్టు చెప్పారు.

భీమ్‌సేన కార్యకర్తలు ఇద్దరు అరెస్టు

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లో ముజఫర్‌నగర్‌లో భీమ్‌సేనకు చెందిన ఇద్దరు కార్యకర్తలను అరెస్టు చేసినట్టు పోలీసులు గురువారం తెలిపారు. మన్సుపూర్‌లో నౌనా గ్రామంలో హిందూ దేవుళ్లను కించపరిచేలా ప్రవర్తించారని మాన్‌సింగ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసినట్టు చెప్పారు. భీమ్‌సేన నాయకుడు తన కార్యకర్తలతో కలిసి తమ ఇంటి వద్దకు వచ్చి గొడవ చేశారని వాళ్లు ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

ఉత్తరప్రదేశ్ గజగజ

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో రోజురోజుకు చలి విపరీతంగా పెరుగుతుంది. రాష్ట్రంలో పలుచోట్ల గురువారం ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. చలిగాలులు కొనసాగుతున్నాయి. ముజఫర్‌నగర్‌లో 3.4 అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. బరైలీ, గోరఖ్‌పూర్, మొరదాబాద్ డివిజన్స్‌లో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయని, ఫైజాబాద్, ఆగ్రా, మీరట్‌లలో సాధారణం కంటే తక్కువగా, లక్నోలో సాధరణ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపారు.

బీహార్‌లో బ్యాంకు దోపిడీ

సమస్తిపూర్ : బీహార్‌లో గురువారం బ్యాంకు దోపిడీ జరిగింది. బ్యాంకు సిబ్బంది, కస్టమర్లను తుపాకితో బెదిరించి క్యాష్ బాక్స్ నుంచి సుమారు రూ.50 లక్షల నగదు తీసుకుని పరారయ్యారని పోలీసులు తెలిపారు. ఉదయం దాదాపు ఆరుగురు దోపిడీదారులు మోటారుసైకిళ్లపై వచ్చి సమస్తిపూర్‌లో గోలా రోడ్డులోని యూఎస్ఓ బ్యాంకులో నగదు దోపిడీ చేశారని తెలిపారు. రూ.48.49 లక్షలు దోచుకున్నట్టు బ్యాంకు మేనేజర్ తెలిపారన్నారు.

మెత్తబడ్డ గుజరాత్ మంత్రి

అహ్మదాబాద్ : ప్రాధాన్యత లేని మంత్రిత్వశాఖ ఇచ్చినందుకు నిన్నటి దాకా అలిగి కూర్చున్న గుజరాత్ మత్స్యశాఖమంత్రి, కోలీ వర్గ నాయకుడు పురుషోత్వం సోలంకి గురువారం మెత్తబడ్డారు. తదుపరి కేబినెట్ విస్తరణలో మంచి శాఖ కేటాయిస్తానని ముఖ్యమంత్రి విజయ్ రూపానీ హామీ ఇచ్చారని చెప్పుకొచ్చారు. మరోవైపు, తమ నాయకుడు, ఎమ్మెల్యే జేతా భర్వాడ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన మద్దతుదారులు ఆందోళనకు దిగారు. అయితే, అలాంటి డిమాండు ఏదీ తాను చేయలేదని ఆ ఎమ్మెల్యే చెప్పారు.

మేఘాలయలో కాంగ్రెస్‌కు మరో షాక్

షిల్లాంగ్ : మేఘాలయలో కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురితో సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కేంద్రంలోని ఎన్‌డీఏలోని బీజేపీ మిత్రపక్షం నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ)లో చేరారు. దీంతో త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిల్లినట్లయ్యింది. ఇటీవల శాసనసభకు రాజీనామా చేసిన ఈ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గురువారం షిల్లాంగ్‌లో ఎన్‌పీపీ ర్యాలీ సందర్భంగా ఆ పార్టీలో చేరారు. వీరితోపాటు గిరిజన ప్రతిపత్తి మండళ్లకు చెందిన 10 మంది సభ్యులు కూడా పార్టీలో చేరినట్లు ఎన్‌పీపీ అధికార ప్రతినిధి జేమ్స్ కె.సంగ్మా ప్రకటించారు.

సమగ్ర యువజన విధానం ప్రకటించాలి



విశాలాంధ్ర-కాకినాడ : యువతకు ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం సమగ్ర యువజన విధానం అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ తూర్పు గోదావరి జిల్లా కౌన్సిల్ సమావేశం గురువారం కాకినాడలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో వై.బావి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా లెనిన్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు నిరుద్యోగులకు ప్రస్తుత సీఎం చంద్రబాబు, ప్రధాన మోడీ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి ఇస్తామంటూ హామీలు గుప్పించినా ఒక్కటీ అమలు చేయలేదన్నారు. స్వయం ఉపాధి కల్పన రుణాల మంజూరులోనూ నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం మోసం చేయడమే అన్నారు. నిరుద్యోగులకు తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలని ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో నూతన పరిశ్రమలు నెలకొల్పాలని డిమాండ్‌చేశారు. ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి నక్కా కిషోర్ మాట్లాడుతూ యువత విద్య, వైద్యం, ఉపాధి ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, సురేష్, బాబీ, ఎల్లా రాము పాల్గొన్నారు.

2013 భూసేకరణ చట్టానికి సవరణలు వద్దు



విశాలాంధ్ర - కాకినాడ : 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన సవరణ బిల్లును రాష్ట్రపతి ఆమోదించరాదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రైతు సంఘం కార్యాలయంలో గురువారం జంపన ప్రసాదరావు అధ్యక్షతన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో అన్ని రాజకీయ పార్టీలు ఆమోదించిన 2013 భూసేకరణ చట్టానికి దుర్మార్గ పూరితంగా సవరణలు తెచ్చేందుకు విఫలయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదించవద్దంటూ పోరాటం నిర్వహించనున్నట్టు చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు కల్పిస్తామన్న నేతల హామీలు అమలు కాలేదన్నారు. రైతు సాధికార సంస్థకు పూర్తిస్థాయి సీఈఓను నియమించడంతోపాటు రుణమాఫీ సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి చెల్లుబోయిన కేశవశెట్టి, జిల్లా గౌరవాధ్యక్షులు కె.సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

279 జీవో రద్దుకు రాజీలేని పోరాటం



విశాలాంధ్ర - చీరాల : రెండేళ్లుగా 279 జీవో రద్దు కోసం కార్మికుల పక్షాన రాజీలేని పోరాటం చేస్తున్న ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కిర్ల కృష్ణారావు అన్నారు. ప్రకాశం జిల్లా చీరాలలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం యూనియన్ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల 18వ తేదీన కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెపై 16న మున్సిపల్ సంచాలకులకు, జేఏసీ సంఘాలకు మధ్య జరిగిన చర్చల్లో ఒకరోజు వాయిదా పడిందన్నారు. దీనికి అన్ని కార్మిక సంఘాలు అంగీకరించినప్పటికీ సీఐటీయూ, దాని అనుబంధ సంఘాలు సమ్మెకు వెళ్లినా సాధించిందేమీ లేదన్నారు. కేవలం సమ్మెతోనే అన్ని సమస్యలు పరిష్కారం కావన్నారు. 98 సంవత్సరాలుగా కార్మిక, ఉద్యోగ, అణగారిన వర్గాల పక్షాన ఏఐటీయూసీ రాజీలేని పోరాటంలో కార్మికులు ఐక్యంగా పాల్గొంటున్నారన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్డీ సర్దార్, నియోజకవర్గ కార్యదర్శి సామియేలు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ముస్లింల ఆత్మగౌరవ చైతన్యయాత్ర

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో ముస్లింల హక్కుల సాధనతో పాటు ఆత్మగౌరవాన్ని కాపాడు కునే విధంగా ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు ముస్లింల ఆత్మగౌరవ చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు ముస్లింల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు షేక్ జలీల్ తెలిపారు. విజయవాడలోని వేదిక కార్యాలయంలో గురువారం చైతన్యయాత్రల పోస్టర్‌ను ముస్లిం ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అత్యంత పేదరికంలో జీవిస్తున్న అధికశాతం ముస్లింలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. నూర్‌బాషాలకు కార్పొరేషన్ ఏర్పాటుచేసి వెయ్యి కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. ఆత్మగౌరవ చైతన్యయాత్ర 30వ తేదీ నుంచి చిత్తూరుజిల్లా కుప్పంలో బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. సమావేశంలో జాతీయ అధ్యక్షులు షేక్ అబ్దుల్ రహమాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మౌలానా షేక్ ఆరీఫ్ పాషా, ఎస్.కె.షాజీ పాల్గొన్నారు.

8న విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : ఏపీ విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 12వ రాష్ట్ర మహాసభ, డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ సభ ఈనెల 12వ తేదీన విజయవాడలోని ఎన్.వి.ఎస్.కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ జెడ్.వి. గణేష్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను బీసీ ఉద్యోగులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు జనభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర రాజధానిలో విద్యుత్ ఉద్యోగులకు ఇండ్ల స్థలాలు కేటాయించడంతో పాటు కార్యాలయానికి భూమి ఇవ్వాలన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొంటూ ఉద్యోగ నియమాకాల్లో అక్రమాలను అరికట్టాలన్నారు. ఉద్యోగుల పదోన్నతల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కేంద్రం బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ మహాసభలకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య వస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు వివిబి.శ్రీనివాసరావు,పి.సుబ్బారావు, పూర్ణచంద్రరరావు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3,4 తేదీల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య రజతోత్సవ వేడుక



విశాలాంధ్ర - విజయవాడ : ప్రపంచ తెలుగు సమాఖ్య 11వ ద్వైవార్షిక మహాసభలు, రజతోత్సవ వేడుకలను ఫిబ్రవరి 3,4 తేదీల్లో చెన్నైలో నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. విజయవాడలోని ఓ హోటల్‌లో గురువారం ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రధాన కార్యదర్శి జేఎం నాయుడు మాట్లాడుతూ చెన్నైలోని కలైవనార్ అరంగం ఆడిటోరియంలో సభల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారిని సంఘటిత పర్చి తెలుగు భాష ఔన్నత్యం, సంస్కృతీ సంప్ర దాయాలను చాటిచెప్పే తరహాలో సమాఖ్య అధ్యక్షురాలు వీఎల్ ఇందిరాదత్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు రూపొందించామన్నారు. రెండు రోజుల మహాసభల్లో వివిధ దేశాల నుంచి వేయిమందికి పైగా ప్రముఖులు హాజరుకానున్నట్లు వివరించా రు. సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు ఏపీ శివరామప్రసాద్, వి. చంద్ర‌మౌళి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

తిరువూరు కోర్టులో డిజిటల్ విధానం ప్రారంభం



విశాలాంధ్ర - తిరువూరు : కృష్ణాజిల్లా తిరువూరు కోర్టుకు వచ్చే కక్షిదారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సబ్ కోర్టు ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలిస్తామని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణాజిల్లా పోర్టు పోలియో జడ్జి రామసుబ్రహ్మణియన్ తెలిపారు. దక్షిణ భారత దేశంలో తొలిసారి తిరువూరులో రూ.26 లక్షలతో నిర్మించిన అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును డిజిటల్ విధానంలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా జడ్జి వై.లక్ష్మణరావు, అదనపు జిల్లా జడ్జిలు వెంకటేశ్వరప్రసాద్, వేణుగోపాలరావు, తిరువూరు, అవనిగడ్డ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

తేమ సాకుతో ధరలో కోత

- ప్రభుత్వ మద్దతు ధర గగనం
- ఎకరాకు రూ.6 వేల నష్టం
- కౌలు రైతుకు గడ్డి కూడా కష్టమే
- కమీషన్ వ్యాపారుల కక్కుర్తి
- కృష్ణాజిల్లాలో బహిరంగ దోపిడీ

ధాన్యం కొనుగోళ్లలో మాయాజాలం



విశాలాంధ్ర - విజయవాడ : ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతులను కమీషన్ వ్యాపారులు నిలువునా దోపిడీ చేస్తూనే ఉన్నారు. కృష్ణాజిల్లాలో ధాన్యం కొనుగోలులో కమిషన్ వ్యాపారుల కక్కుర్తి రైతులను కన్నీరుపెట్టిస్తోంది. కూలీల వేతనాలు పెరిగిపోవడంతో పెట్టుబడిని అంచనా వేస్తున్న రైతులు వరికోత యంత్రాల ద్వారా కుప్ప నూర్పిడిలు పూర్తి చేస్తున్నారు. ఈ ధాన్యంలో తేమశాతం ఎక్కువ ఉందంటూ అప్పటికప్పుడే మద్దతు ధరలో భారీ కోత పెడుతున్నారు. ధాన్యం కల్లంలో పెట్టుకుని కాపలా కాయలేక రైతులు తెగనమ్ముతున్నారు. దీంతో ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన అన్నదాతకు ఏమీ మిగలని దుస్థితి నెలకొంది. కమీషన్ వ్యాపారుల మోసాలకు కౌలు రైతులు నిలువునా నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ - గ్రేడ్ రకం ధాన్యం మద్దతు ధర క్వింటాకు రూ.1,590గా ప్రకటించింది. ఈ లెక్కన 75 కిలోల బస్తాకు రూ.1,192 చెల్లించాల్సి ఉంది. తేమశాతం పేరుతో కళ్ల ముందే ధర తగ్గించేస్తున్నారు.

కళ్ల ముందే ధరల్లో కోత

వరికోత యంత్రం ద్వారా కోసిన ధాన్యంలో తేమశాతం ఎక్కువ ఉంటే ఒక్కో పాయింటుకు రూ.16 చొప్పున కోత పెడుతున్నారు. 17 శాతానికి మించి తేమశాతం అధికంగా ఉంటే ధరలో భారీ వ్యత్యాసం వస్తోంది. ఏ -గ్రేడ్ ధాన్యం రకాలైన 1061, 1075 వరి వంగడాలకు వ్యాపారులు బస్తా ధర రూ.1,220గా నిర్ణయిస్తున్నారు. ఈ ధాన్యంలో 17శాతం లోపు తేమ ఉంటేనే ఈ ధర చెల్లిస్తామని చెబుతున్నారు. 28 శాతం మేర తేమ ఉంటే ధర 12 పాయింట్లకు ఒక్కో పాయింటుకు రూ.16 చొప్పున బస్తాకు రూ.192 తగ్గించి ధర నిర్ణయిస్తున్నారు. దీంతో బస్తా ధాన్యం ధర రూ.1,028కి పడిపోతోంది. ఎకరానికి కనీసం 30 బస్తాల దిగుబడి వస్తే ఆరువేల రూపాయలను రైతు నష్టపోవాల్సి వస్తోంది. కమీషన్ వ్యాపారి వద్ద పెట్టుబడి కోసం ముందుగా అప్పు తీసుకున్న రైతులు కిమ్మనని స్థితి. ధాన్యం కొనుగోలు కేంద్రాల కంటే బహిరంగ మార్కెట్‌లో బస్తాకు రూ.60 నుంచి రూ.70 ఎక్కువ ధర చెల్లిస్తున్నారని పౌరసరఫరాలశాఖ అధికారులే రైతులకు చెప్పడం గమనార్హం. లోపాయికారిగా కొనసాగుతున్న తంతును అదుపు చేసేందుకు ఎలాంటి చర్యలు కానరావడం లేదు.

13.50 లక్షల టన్నుల దిగుబడి అంచనా

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 5.11 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. సుమారు13.50 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. వీటిలో బీపీటీ రకం ధాన్యం 5.28 లక్షల టన్నులు, మిగిలిన ముతకరకం ధాన్యం 8.22 లక్షల టన్నులుగా ఉంది. బీపీటీ ధాన్యం కొనుగోలుకు హైదరాబాద్ వ్యాపారులు బస్తాకు రూ.1,500 చొప్పున ధర చెల్లిస్తున్నారు. కమీషన్ వ్యాపారులు రూ. 1,340 నుంచి రూ.1,400 మాత్రమే ఇస్తున్నారు. బీపీటీ రకం కొనుగోలులో తేమ, తాలు, తప్ప వంటివి పట్టించుకోని వ్యాపారులు ముతక ధాన్యానికి ఆంక్షలు పెట్టడం గమనార్హం. ఇప్పటివరకు బీపీటీ ధాన్యం 1.20 లక్షల టన్నులు, ముతక రకం 2.10 లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మినుము పంట వేయడంతో కొన్ని ప్రాంతాల్లో ఇంకా కుప్పలపైనే వరి ఉంది. కుప్పల నూర్పిడి సమయానికి కమీషన్ వ్యాపారులు ఎలాంటి ఎత్తుగడలు ప్రయోగిస్తారోనని రైతుల్లో భయం నెలకొంది. మార్చి నెల వరకు ధాన్యం కొనుగోలుకు అనుమతి ఉన్నప్పటికీ వ్యాపారులు ఎన్ని కుట్రలు చేస్తారో అనే చర్చ సాగుతోంది.

కౌలు రైతు కన్నీరు

జిల్లాలో కౌలు రైతులు 1.65 లక్షల మందికిపైనే ఉన్నారు. వీరంతా సుమారు 3.50 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పురుగుమందులు, ఎరువుల ధరలు పెరగడంతో సాగు ఖర్చులు పెరిగాయి. వరి పంటకు ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. 17 బస్తాల వరకు కౌలు చెల్లించాల్సి ఉంది. ఎకరానికి సగటున 26 బస్తాల నుంచి 32 బస్తాల దిగుబడి వస్తోంది. ముతక రకం ధాన్యం కొనుగోలు సమయంలో వ్యాపారులు అంక్షలు పెడుతుండటంతో వరిగడ్డి కూడా మిగలని పరిస్థితి. సాగు ఖర్చులు, పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీ వంటివి లెక్క వేస్తే కౌలు రైతు ఖాళీ చేతులతో ఇంటికి రావాల్సిందే.

త్వరలో బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు



విశాలాంధ్ర - విజయవాడ : బీఎస్ఎన్ఎల్ ద్వారా త్వరలో 5జీ సేవలు అందుబాటులోకి రానున్నట్టు బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎ. పూర్ణచంద్రరావు తెలిపారు. విజయవాడలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ వైఫై ద్వారా బీఎస్ఎన్ఎల్ సేవలను రాష్ట్రంలో మొట్టమొదటిసారి అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ 5జీ సేవలు 40 ఎంపీపీఎస్ స్పీడుతో పనిచేస్తాయని వివరించారు. మిగిలిన నెట్‌వర్క్‌లతో పోల్చుకుంటే బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలను అందుబాటులోకి తేవడంలో ముందంజలో ఉందన్నారు. ల్యాండ్‌లైన్ కనెక్షన్ ద్వారా వైఫై కనెక్షన్‌లను లిమిటెడ్‌ఫిక్స్‌డ్ మొబైల్ టెలిఫోన్ పద్ధతిలో వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు వివరించారు. టికోనా పద్ధతిలో వైఫై ద్వారా బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. 602 వైఫై హాట్‌స్పాట్‌ల ద్వారా సేవలు అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఈ ఏడాది 48 వేల ల్యాండ్‌లైన్ కనెక్షన్లు, 36 వేల బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు కొత్తగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. బీఎస్ఎన్ఎల్ అమలు చేస్తున్న ప్లాన్‌లను చొక్కాపై రాసుకుని ప్రచారం చేస్తున్న ఉద్యోగి వెంకటరమణను ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ దుర్గారాణి, డీజీఎం నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పెరగనున్న వీఐపీ దర్శన టికెట్ ధరలు

ఎల్-1 టికెట్ రూ.5 వేలు



విశాలాంధ్ర - తిరుమల : వీఐపీ దర్శన టికెట్ ధరలు పెంచేందుకు టీటీడీ అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రథమ ప్రాధాన్యం ఎల్-1 టికెట్ ధర రూ.500 నుంచి రూ.5,000 వరకు, ద్వితీయ ప్రాధాన్యం ఎల్-2 టికెట్ ధర రూ.500 నుంచి రూ.2,000 కు పెంచాలన్న ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఎల్-1 టికెట్లకున్న ఒత్తిళ్ల నేపథ్యంలోనే టీటీడీ అధికారులు ఈ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఎల్-3 టికెట్ ధరను మాత్రం యథాతథంగా ఉంచనున్నారు. ప్రభుత్వానికి చేరిన ఈ కొత్త ఈ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే అమలుకు సమాయత్తమవుతున్నారు. ఎల్-1, ఎల్-2 టికెట్లకున్న డిమాండ్ దృష్ట్యా ఐదేళ్లుగా ధరలు పెంచే అవకాశం పలుమార్లు తెరపైకి వచ్చింది. ఇటీవల ధర్మకర్తల మండలిలో కూడా దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. తొలుత మెజారిటీ సభ్యుల వ్యతిరేకత వస్తుందన్న అభిప్రాయం వ్యక్తం చేయడంతో ధరల పెంపు వాయిదా వేస్తూ వచ్చారు. ప్రస్తుతం ధర్మకర్తల మండలి లేకపోవడంతో ఇదే సరైన సమయంగా భావించిన ఉన్నతాధికారులు వీఐపీ టికెట్ ధరలు పెంచాలన్న నిర్ణయానికి వచ్చారు. ఆరునెలలుగా ఎల్-1 టికెట్లను ప్రొటోకాల్ వర్తించే ప్రముఖులకు మాత్రమే కేటాయిస్తున్నారు. అప్పటి నుంచి ఎల్-1 టికెట్ల కోసం అధికారులపై ఒత్తిళ్లు బాగా పెరిగాయి.

సేవా టికెట్లపైనా ప్రభావం

వీఐపీ దర్శన టికెట్ల ధరల పెంపు ప్రభావం ఇతర సేవా టికెట్లపై పడే అవకాశాలు ఉన్నాయి. సుప్రభాతం, తోమాల, అర్చన, వారపు సేవల టిక్కెట్ ధరలు రూ. వందల్లోనే ఉన్నాయి. ఈ టికెట్లతో స్వామి వారిని అరగంట పాటు వీక్షించవచ్చు. ఈ దృష్ట్యా ఎల్-1కు బదులుగా సేవా టికెట్లను కేటాయించాలని ప్రముఖులు పట్టుబట్టే అవకాశం లేకపోలేదు. ఈ తరుణంలో సేవా టికెట్ల ధరలను కూడా పెంచేందుకు టీటీడీ అధికారులు దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది.

మన సంస్కృతిని కాపాడుకుందాం

సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ




విశాలాంధ్ర- అనంతపురం అర్బన్ : మారుతున్న కాలానికనుగుణంగా ప్రజలు మోడ్రన్ సినిమాలనే ఆదరిస్తున్నారని ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. అన్ని రంగాల్లో గ్లోబలైజేషన్ ప్రవేశించిన నేపథ్యంలో వ్యవస్థను మార్చగల శక్తి కళా ప్రదర్శనలకు ఉందన్నారు. సమ సమాజ శ్రేయస్సు కాంక్షించే సంస్కృతిని కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో 'సాంస్కృతిక రంగం- నేటి సవాళ్లు' అనే అంశంపై విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం నాయకురాలు డాక్టర్ ప్రగతి అధ్యక్షతన సదస్సు జరిగింది. భరద్వాజ మాట్లాడుతూ వ్యవస్థలో ప్రజలను ఆలోచింపచేసే శక్తి సినిమా రంగం, మీడియా, సోషల్ మీడియాకు ఉందన్నారు. గతంలో సమాజాన్ని ప్రభావితం చేసే సినిమాలు వచ్చాయని, తప్పుదోవ పట్టించే సినిమాలు కూడా వచ్చాయన్నారు. రాను రాను ప్రజలు మోడ్రన్ సినిమాలను కోరుకోవడంతో దర్శకులు, నిర్మాతలు, నటులు అలాంటి కథలకు అనుగుణంగా నటిస్తున్నారన్నారు. సమాజాన్ని తప్పుదోవ పట్టించే సంస్కృతిని విడనాడి సమ సమాజ స్థాపన, ఆరోగ్యవంతమైన సమాజ ఏర్పాటుకు కృషిచేసేలా సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఉండాలన్నారు. నైతికతను చాటడానికి, ప్రజల్లో చైతన్యం నింపడానికి మీడియా, సినిమా రంగం, సోషల్ మీడియా పనిచేయాలని కోరారు.

ప్రజానాట్యమండలి తెలంగాణ అధ్యక్షులు దేవేంద్ర మాట్లాడుతూ నేడు దేశంలో, రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛ హరించబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల మధ్య ఏర్పడే సంబంధ బాంధవ్యాలే గొప్ప సంస్కృతి అన్నారు. ప్రజాస్వామ్య సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రామిక వర్గ భావజలం సామాన్యుని పక్షాన నిలుస్తుందన్నారు. సమాజంపై ఆధిపత్య సంస్కృతి దాడికి అడ్డుకట్ట వేసేలా సాంస్కృతిక కళలు, కళా రూపాల ప్రదర్శన జరగాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందురాజులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నగర కార్యదర్శి నాగేంద్రకుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పాల్గొన్నారు.

'కనిగిరి' కుటుంబం ఆత్మహత్య

- పిల్లలకు విషమిచ్చి చంపేశారు
- ఉరివేసుకొని తల్లిదండ్రులూ ఆత్మహత్య
- ఆత్మహత్య ముందు బంధువులకు సమాచారం
- విశాఖ ఆరిలోవలో ఘటన





విశాలాంధ్ర - విశాఖపట్నం క్రైం: విశాఖపట్నం ఆరిలోవ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముస్తాఫా కాలనీలో గురువారం విషాదం చోటుచేసుకుంది. దంపతులు ఇద్దరి పిల్లల్ని చంపేసి, ఆపై వారు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం వివరాలు..ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన రాజేష్, సౌమ్య దంపతులు ముస్తాఫా కాలనీలో ఎనిమిది నెలలుగా నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం చెన్నైలోని బంధువులకు ఫోన్ చేసిన దంపతులు తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు.

చెన్నైలోని బంధువుల ద్వారా గురువారం సాయంత్రం సమాచారం అందుకున్న విశాఖ పోలీసులు తొమ్మిది గంటల సమయంలో ఇంటికి వెళ్లగా లోపల గడియపెట్టి ఉంది. ఇంటి తలుపులు బద్దలుకొట్టారు. పిల్లలిద్దరు విష్ణు(7), జాహ్నవి(5) చనిపోయినట్టు గుర్తించారు. దంపతులిద్దరూ రాజేష్, సౌమ్య ఉరివేసుకొని ఉన్నారు. ఆత్మహత్యపై లేఖ కూడా రాసినట్టు పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు. క్రైం సీఐ షణ్ముకరావు దర్యాప్తు చేస్తున్నారు. వీరి ఆత్మహత్యపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



చంద్రబాబు హామీ అమలుకు
మార్చి 31 డెడ్‌లైన్

విశాలాంధ్రబ్యూరో - తిరుపతి : కాపుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అమలుకు మార్చి 31వ తేదీ డెడ్‌లైన్ అని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. తిరుపతిలో గురువారం కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్‌తో ముద్రగడ భేటీ అయ్యారు. రెండు గంటల పాటు కొనసాగిన భేటీ అనంతరం ముద్రగడ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు కానుకతో మా కడుపు నిండలేదన్నారు. కాపులు ఎమ్మార్వో ఆఫీసుకు వెళ్ళి బీసీ సర్టిఫికెట్ తీసుకున్న నాడే మాకు అసలైన పండుగ అని, అప్పటి వరకు కాపు ఉద్యమం ఆగదన్నారు. భవిష్యత్‌లో ఓబీసీలు, కాపులు, దళితులు ఐక్యంగా కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. చింతామోహన్ మాట్లాడుతూ దేశంలోని 25 రాష్ట్రాల్లో సామాజిక న్యాయం ఉన్నప్పటికీ ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగలేదన్నారు. ఈ రాష్ట్రంలో గత 6 దశాబ్దాల కాలంలో 40 ఏళ్లపాటు ఒక సామాజికవర్గం ముఖ్యమంత్రి పదవి చేపట్టిందన్నారు. మరో సామాజిక వర్గం 20 ఏళ్లు పాలించిందన్నారు. విభజన తరువాత 13 జిల్లాల్లో 5 జిల్లాలు పశ్చిమగోదారి, తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నుండి గత 70 సంవత్సరాల్లో ఏ ఒక్కరూ ముఖ్యమంత్రి కాకపోవడం అప్రజాస్వామికమన్నారు. జరగబోవు ప్రజా యుద్ధంలో 90 శాతంపైగా జనాభా కలిగిన ఓబీసీలు, కాపు, బలిజ, దళితులు కలిసి రాజ్యాధికారం చేపట్టాలని పిలుపు నిచ్చారు. వచ్చే ఎన్నికలు దోపిడీదారులు, నిరుపేదలకు మధ్య జరబోయే యుద్ధమన్నారు. సంపన్నులు, పేదలకు మధ్య జరిగే ఎన్నికల రణక్షేత్రంలో అంతిమ విజయం నిరుపేదలదే అన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు ఆకుల రామకృష్ణ, ఏసుదాసు, ప్రకాష్, గుండా రమణ, చంటిబాబు, తుమ్మల రమేష్, రవికుమార్, పూతలపట్టు ప్రభాకర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర

జన్మభూమి-మాఊరు' కార్యక్రమం విజయవంతం : పరకాల

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో జన్మభూమి - మా ఊరు కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందని ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ చెప్పారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. గత మూడు రోజులుగా ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వివరాలను ఆయన వివరించారు. మొదటి రోజు మొత్తం వినతులు 67,003 రాగా 3,53,241 మంది ప్రజలు పాల్గొన్నారని, 13,943 రేషన్‌కార్డులు, కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు 7,953, ఇళ్ల స్థలాల పంపిణీ 2,567, వివిధ రకాల పనిముట్ల క్రింద 2,368 పంపిణీ, 1,180 హెల్త్ క్యాంపుల ద్వారా 68,021 మంది రోగులు నమోదు పేర్లు నమోదు చేసుకున్నారని, వెటర్నరీ క్యాంపులు 2,095, యాక్టివిటీ, వివిధ రకాల పోటీల ద్వారా విజేతలకు బహుమతులు 7,410 పంపిణీ చేయటం జరిగిందని, అదే విధంగా 3వ తేదీన మొత్తం వినతులు 1,65,841, ప్రజలు 8,47,470 పాల్గొనగా రేషన్ కార్డుల 35,277 పంపిణీ, కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు 16,747, ఇళ్ల స్థలాల పంపిణీ 4,494, వివిధ రకాల పనిముట్ల పంపిణీ 3,468, నిర్వహించిన హెల్త్ క్యాంపులు 2,915, నమోదు చేసుకున్న రోగుల సంఖ్య 1,65,523, నిర్వహించిన వెటర్నరీ క్యాంపులు 9,162, వివిధ పోటీలు, కార్యక్రమాలలో 35,217 విజేతలకు బహుమతులు, 4వ తేదీన అందిన సమాచారం ప్రకారం మొత్తం వచ్చిన వినతులు 67,726, మొత్తం ప్రజల సంఖ్య 3,31,615, రేషన్ కార్డుల పంపిణీ 10,588, కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు 6,059, ఇళ్ల స్థలాల పంపిణీ 2,359, వివిధ రకాల పనిముట్ల పంపిణీ 4,290, నిర్వహించిన హెల్త్ క్యాంపులు 1,161, నమోదు చేసుకున్న రోగుల సంఖ్య 75,133, నిర్వహించిన వెటర్నరీ క్యాంపులు 1,813, వివిధ పోటీలు, కార్యక్రమాలలో విజేతలకు 11,522 మందికి బహుమతులు పంపిణీ చేశారన్నారు 2, 3, 4 తేదీలు కలిపి మొత్తం వచ్చిన వినతులు 3,00,570, పాల్గొన్న ప్రజలు 15,32,336, అత్యధికంగా గృహనిర్మాణం, రేషన్ కార్డులు, పెన్షన్లకు సంబంధించి వినతులు ఎక్కువగా వచ్చాయన్నారు. వీటన్నింటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సీఎం ఆదేశించారని ప్రభాకర్ తెలిపారు.



స్పష్టమైన సాంస్కృతిక విధానం ప్రకటించాలి

- అన్ని జిల్లాల్లో ఆడిటోరియంలు నిర్మించాలి
- 'థియేటర్ ఆర్ట్స్' డిప్లమో కోర్సులు ప్రవేశపెట్టాలి
- అర్హులందరికీ పెన్షన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి
- ప్రజానాట్యమండలి రౌండ్‌టేబుల్ సమావేశంలో నల్లూరి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రభుత్వం స్పష్టమైన సాంస్కృతిక విధానాన్ని ప్రకటించడమేకాకుండా ప్రత్యేకంగా సాంస్కృతిక శాఖను ఏర్పాటు చేయాలని ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) డిమాండు చేశారు. సమైక్యాంధ్రలో నిర్వహించినట్లే నంది నాటకోత్సవాలను నవ్యాంధ్రలో కొనసా గించడం అభినందనీయమన్నారు. అయితే గత ఏడాది జరిపిన పద్ధతి ఏమాత్రం సరిగా లేదన్నారు. నాటకోత్సవాలకు హాజరయ్యే కళాకారులకు భోజన, వసతి సదుపాయాలను ప్రభుత్వమే కల్పించాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'నవ్యాంధ్రలో సాంస్కృతిక రంగం ఎదుర్కొంటున్న సమస్యలు'పై ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి నల్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం' అనే నినాదంతో 1943లో ప్రజానాట్యమండలి ఏర్పాటైందన్నారు. అయితే కాలానుగుణంగా కళలకు ఆదరణ తగ్గడమే కాకుండా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరవవుతోందన్నారు. సాంస్కృతిక రంగం బతకా లంటే ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించాల్సి ఉందన్నారు. నాటకోత్సవాల్లో అంతరించిపోతున్న జానపద కళారూపాలను కూడా పోటీలకు ఆహ్వానించి, తగిన పారితోషికాలను అందచేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. నాటకాలను ప్రదర్శించేందుకు వీలుగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఆడిటోరియంలను నిర్మించాల న్నారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో 'థియేటర్ ఆర్ట్స్' డిప్లమో కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా యువతను కళలపట్ల ఆకర్షితులయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సంగీత నాటక అకాడమీతోపాటు జానపద కళల అకాడమీ, లలిత కళల అకాడమీ, సాహిత్య అకాడమీలను వీలైనంత త్వరలో ఏర్పాటు చేసి తగినన్ని నిధులను సమకూర్చాలన్నారు. జానపద కళాకారులు, పద్య కళాకారులు, తమ కళను వృత్తిగా చేసుకొని జీవించే వేలాది మంది వృద్ధాప్యం వల్ల ప్రదర్శనలివ్వలేని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పెన్షన్‌గా చెల్లిస్తున్న రూ.1500 ఏమాత్రం చాలడం లేదన్నారు. సంఖ్యతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి కళా కారునికి రూ.5 వేలు పెన్షన్‌ను చెల్లించడమే కాకుండా ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని నల్లూరి కోరారు. దర్శకుడు, నటుడు నాయుడు గోపి, 'అభిరుచి' శ్రీనివాస్, రచయిత సుకమంచి కోటేశ్వరరావు, డాక్టర్ స్టాలిన్ తదితరులు మాట్లా డుతూ క్రీడాకారులకు అందచేసే విధంగానే కళాకారులకు కూడా ఉద్యోగాల్లో కోటా కల్పించాలన్నారు. ప్రదర్శనల నిమిత్తం వివిధ ఊళ్లకు వెళ్లేవారికి బస్సు, రైళ్లలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలన్నారు. వివిధ కేంద్రాల్లో నాటక పరిషత్‌లను ఐదేళ్లు వరుసగా నిర్వహిస్తున్న వారికి సబ్సిడీలను అందచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక మండలిలో అర్హులకే స్థానం కల్పించాలని డిమాండు చేశారు. కళాకారుల సమస్యలపై ఏకతాటిపైకి వచ్చి నాటక అకాడమీ సహకారంతో ముఖ్యమంత్రిని కలిసి విన్నవించాలని సూచిం చారు. కళాకారుల సూచనలు, సలహాలతో వినతి పత్రాన్ని రూపొందించి సీఎంను స్వయంగా కలసి అందచేయాలని సమావేశంలో నిర్ణయించారు. తొలుత పలువురు కళాకారులు అభ్యుదయ గేయాలను ఆలపించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి అధ్యక్షుడు గని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.చంద్రా నాయక్, కోశాధికారి కేవీ అప్పారావు, నాయకులు ఆర్.పిచ్చయ్య, ఎస్.కె.నజీర్, గొల్లపల్లి జాన్సీ, కేవీ భాస్కరరావుతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కె.సీతారామయ్య, హృదయరాజ్, పీవీఎన్ కృష్ణ, సూర్యనారాయణ, లక్ష్మణరావు, తాతారెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



నాస్తిక మహాసభలకు
తెలుగు బృందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి (తిరుచ్చి)లోని పెరియార్ సెంటినరీ భవనంలో ఈ నెల 5,6,7 తేదీలలో నిర్వహించనున్న 10వ ప్రపంచ నాస్తిక మహాసభలకు హాజరయ్యేందుకుగాను తెలుగు రాష్ట్రాల నుంచి 25 మంది నాస్తిక సమాజం ప్రతినిధులు గురువారం పయనమయ్యారు. ఏపీలోని కృష్ణా, గుంటూరు, గోదావరి, విశాఖపట్నం జిల్లాల ప్రతినిధులకు నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్ నాయకత్వం వహిస్తారు.

ఈ మహాసభలకు దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు ప్రపంచ దేశాల ప్రతినిధులు హాజరవుతారు. పర్యావరణ మూఢనమ్మకాలు, సామాజిక, సమస్యలు, మతోన్మాదం తదితర అంశాలపై సభలలో చర్చిస్తారు. దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సంఘ శక్తుల ఆగడాలు, దేవుడు-మతం పేరుతో కొనసాగుతున్న రాజకీయాలపై సమీక్షిస్తారు. ఈ బృందం లో నాస్తిక సమాజం నాయకులు కోటేశ్వం రావు, గౌరవ్, గోపు చంద్రారావు, జయ ప్రకాష్, ఎస్.నాగిరెడ్డి, రామ్ ప్రభు, ఎంఎన్ బుద్ధ ఉన్నారు.

రాష్ట్రానికి లక్ష ఇళ్లు



- నిర్మాణ వ్యయం రూ.3,604.20 కోట్లు
- 84 పట్టణాలకు కేంద్రం ఆమోదం
- ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్ కింద నిర్మాణం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ప్రతి ఒక్కరికీ ఇల్లు (హెచ్‌ఎఫ్‌ఏ) అనే నినాదంతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం కింద రెండో దశలో రాష్ట్రానికి 1,02,977 ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్రంలోని 84 పట్టణాలలో లబ్ధిదారుల ఎంపిక జరగాల్సి ఉంది. ఎన్‌టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఈ ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. పట్టణ స్థానిక సంస్థలలో (యూఎల్‌బీ)లో చేపట్టనున్న గృహనిర్మాణ పథకంలో ఒక్కో యూనిట్ రూ.3.50 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. అందులో భాగంగానే రూ.3,604.20 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో కేంద్రం రూ.1,544.66 కోట్లు సబ్సిడీ ఇస్తుండగా, రాష్ట్రం రూ.1,29.77 కోట్ల సబ్సిడీ ఇస్తోంది. లబ్ధిదారులు తమ వాటా రూ.277.33 కోట్లుగా ఉంది. బ్యాంకుల నుంచి రూ.772.33 కోట్ల రుణం ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గృహనిర్మాణశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి, గృహనిర్మాణ సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లోని 84 పట్టణ స్థానిక సంస్థలకు (యూఎల్‌బీ) కేంద్ర ప్రభుత్వం గత ఏడాది జులై, ఆగస్టులోనే ఆమోదం తెలిపింది. ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్ కింద చేపట్టే ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలను, రాష్ట్రం రూ.లక్షను సబ్సిడీగా ఇస్తుండగా, లబ్ధిదారుడు రూ.25 వేలు తన వాటాగా భరించాల్సి ఉంది. మిగిలిన రూ.75 వేలును లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలను ప్రభుత్వమే ఇప్పిస్తుంది. 2016-17లో 31 యూఎల్‌బీలో 32 ప్రాజెక్టుల కింద కేంద్రం 73,041 ఇళ్లను ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యుఎస్) మంజూరు చేయగా, ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్ కింద వీటి నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది.

జీ ప్లస్ వన్‌కూ అనుమతి

ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకం కింద 84 పట్టణ ప్రాంతాలలో నిర్మించే ఇళ్లను జీ ప్లస్ వన్ విధానంలోనూ నిర్మించుకునే సౌలభ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఇంటి నిర్మాణ ప్రదేశం కనీసం 30 చదరపు మీటర్లుగా ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒక వేళ స్థలాభావం ఉంటే జీ ప్లస్ వన్ విధానంలోనూ లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. అయితే కనీసం ఒక బెడ్ రూమ్, హాల్ విత్ కిచెన్‌తోపాటు టాయ్‌లెట్, బాత్‌రూమ్ మాత్రం ఉండాలని గృహనిర్మాణశాఖ స్పష్టం చేసింది. ఇంటి నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులు తమకు తగ్గట్టుగా డిజైన్ చేసుకునే సౌలభ్యాన్ని కూడా కల్పించటం విశేషం. ఇదిలావుండగా, పట్టణాలలో ఇళ్లు లేని వారికి, ఇప్పటి వరకు ప్రభుత్వ నుంచి ఇంటిని పొందని వారికి ఈ పథకంలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. స్థానిక సంస్థల మున్సిపల్ కమిషనర్లు అర్హులైన వారి జాబితాను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తారు. తుదిగా కలెక్టర్ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను విడుదల చేస్తారు.

ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్ కింద 84 పట్టణాలకు మంజూరైన ఇళ్ల వివరాలు

జిల్లా పేరు	మంజూరైన ఇళ్లు
శ్రీకాకుళం	8,216
తూర్పు గోదావరి	16,530
పశ్చిమ గోదావరి	5,510
కృష్ణా	8,142
గుంటూరు	9,190
నెల్లూరు	7,285
చిత్తూరు	5,965
ప్రకాశం	3,308
కడప	9,241
కర్నూలు	15,157
అనంతపురం	14,433
మొత్తం	**1,02,977**

ఇంటి నిర్మాణ వ్యయం వివరాలు

వనరులు (రూపాయలలో)	వ్యయం
కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ	1,50,000
రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ	1,00,000
లబ్ధిదారుడి వాటా	25,000
బ్యాంకు రుణం	75,000
మొత్తం	**3,50,000**

కార్పొరేట్‌లకు మోడీ ఊడిగం

- దళితులు, మైనారిటీలకు రక్షణ కరువు
- టీడీపీ పాలనలో అవినీతి, లంచగొండితనం
- 2018లో మిలిటెంట్ పోరాటాలకు రూపకల్పన
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విశాలాంధ్ర-గుంతకల్లు (అనంతపురం) : దేశం లోని కార్పొరేట్ సంస్థలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఊడిగం చేస్తున్నారని, రాష్ట్రంలోని చంద్ర బాబు పాలన అస్తవ్యస్తంగా అవినీతి, లంచగొండిత నంలో కూరుకుపోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. అలూరు నియోజకవర్గంలో జరుగుతున్న సీపీఐ మహాసభలో పాల్గొనేందుకు వచ్చిన రామకృష్ణ పట్టణంలోని బిటి ఫక్కీరప్ప భవన్‌లో గురువారం ఉదయం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు జిల్లా రుద్రవరంలో దళితులను సంఘ బహిష్కరణ చేయడం దారుణమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జనవరి 20న సీపీఐ నియోజకవర్గ, మండల స్థాయి మహాసభలు జరుగుతాయన్నారు. ఏప్రిల్ 7,8,9 తేదీల్లో కడప జిల్లాలో సీపీఐ 26వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు. ఏప్రిల్ 7న కడపలో అన్ని జిల్లాల కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ రాష్ట్ర మహాసభలకు సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, జాతీయ నాయకులు కె.నారాయణ, అజీజ్ పాషా హాజరవుతున్నట్లు తెలిపారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చిస్తామన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, ఆర్థిక విధానాలను అవలంబిస్తోందన్నారు. గో రక్షణ పేరుతో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. మహారాష్ట్రలో దళితులపై దాడులకు నిరసనగా చేపట్టిన బంద్‌కు సీపీఐ, సీపీఎం మద్దతు ఇచ్చాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం అభివృద్ధి చెందిందని మాట్లాడుతున్నారని, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. క్షయవ్యాధి గ్రస్థులు చనిపోతున్నా చర్యలు లేవన్నారు. పోలవరం, అమరావతి జపం చేస్తూ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ అప్పు ఇస్తుంటే కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఎందుకు రాబట్టడం లేదని, దీనిపై చంద్రబాబు వైఖరి స్పష్టం చేయాలన్నారు. పోలవరానికి నాబార్డు నిధులు ఇస్తుంటే చంద్రబాబు ఏమి చేస్తున్నట్లు అని రామకృష్ణ ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చిస్తూ 2018 సంవత్సరంలో మిలిటెంట్ పోరాటాలకు రూపకల్పన చేయనున్నామన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల చెరువులకు హంద్రీ-నీవా కాలువ నుండి నీరు అందించేందుకు రాగులపాడు నుండి లిఫ్ట్‌ను ఏర్పాటు చేసి కాలువ పనులకు చేపట్టడానికి రూ.42 కోట్లు విడుదలైనా ఇప్పటి వరకు కార్యచరణకు నోచుకోలేదన్నారు. వెంటనే నిధులతో కాలువ పనులు చేపట్టాలని ఆయన డిమాండు చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భీమలింగప్ప, నియోజకవర్గ కార్యదర్శి గోవిందు, పట్టణ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, నాయకులు అబ్దుల్ వాహబ్, ఎస్.ఎం.డి.గౌస్, మగ్బుల్ బాషా, చల్లా నాగేంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ తరహాలో
కృష్ణానదిలో హౌస్ బోట్

తొలి దశలో 15 బోటుల ఏర్పాటు : ఎస్సీ యువతకు ప్రాధాన్యం : పర్యాటకశాఖ కార్యదర్శి మీనా



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : కేరళ తరహాలో పర్యాటకులను ఆకర్షించేందుకు రాష్ట్ర పర్యాటకశాఖ సన్నాహాలు చేస్తోంది. సాంఘిక సంక్షేమశాఖ సహకారంతో కేరళ రాష్ట్ర పర్యాటకానికి ధీటుగా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా కార్యాచరణను సిద్ధం చేశారు. కేరళలో మాదిరిగా హౌస్ బోటులను కృష్ణానదిలో విహరింప చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 15 బోటులను నదిలో నడిపేందుకు కసరత్తు జరుగుతోంది. ఇందుకు పర్యాటక రంగంలో ఎస్సీ యువతకు ఉపాధి కల్పించేందుకు ఆయన శ్రీకారం చుడుతున్నారు. అందులో భాగంగానే వెలగపూడిలోని సచివాలయంలోని తన చాంబర్ మీనా పర్యాటకశాఖపై సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ద్వారా ఎస్సీ యువతకు సబ్సిడీ ఇప్పించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలోనే ఇంటి తరహాలో ఉండే బోటు గురించి ఆయన వివరించారు. ఈ తరహా బోటులను తయారు చేసేందుకు సుమారు రూ.కోటి ఖర్చవుతుందని, అందులో 15 శాతాన్ని ఏపీటీడీసీ సబ్సిడీగా అందజేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ కొంత మొత్తాన్ని సబ్సిడీగా భరించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు మీనా తెలిపారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ఎస్సీ యువతతోపాటు సాధారణ యువత కూడా ముందుకు వస్తే వారికి కూడా 15 శాతం సబ్సిడీ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. అయితే మిగిలిన 85 శాతాన్ని బ్యాంకుల నుంచి రుణం రూపంలోగానీ, స్వయంగాగానీ సమకూర్చుకోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ మొత్తం వ్యవహారాన్ని ఎపిటిడిసి పర్యవేక్షించ నుండగా, వీరికి అవసరమైన ఆన్‌లైన్ టికెటింగ్, మార్కెటింగ్ బాధ్యతను పర్యాటక శాఖ తీసుకుంటుందని ఆయన తెలియజేశారు. లబ్ధిదారుల ఎంపికలో అనుభవానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని, అదే క్రమంలో ఆదాయ భాగస్వామ్య ఆవశ్యకతను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు చెప్పారు. కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజీ ఎగువన ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు సాంఘిక సంక్షేమశాఖ, ఎస్సీ కార్పొరేషన్‌తో సంప్రతింపులు జరుపుతున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ ఎండీ హిమాన్షు శుక్లా, ప్రాజెక్టు మానిటరింగ్ ఓఎస్‌డీ లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ విధానాల అమల్లో లోపాలు
లక్ష కోట్ల ఆదాయానికి గండి : సీఎస్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఫుడ్ ప్రాసెసింగ్ విధానాల సమర్థ వినియోగం లేకపోవడం ద్వారా లక్ష కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ చెప్పారు. లోపాలను గుర్తించి సమర్థవంతంగా వినియో గించగలిగితే గణనీయమైన ఆదాయం లభిస్తుందన్నారు. గురువారం స్థానిక శేషసాయి కళ్యాణవేదిక ప్రాంగణంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ శిఖరాగ్ర సమా వేశం మూడు రోజుల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ రాష్ట్రంలో మెగా ఫుడ్ పార్క్, శీతల గొలుసు కార్యక్రమాలను అభివృద్ధి చేసి ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల విస్తరణకు చర్యలు చేపడుతున్నామ న్నారు. 351 ఒప్పం దాల ద్వారా రూ.10 వేల 551 కోట్ల పెట్టుబడిని సాధించగలి గామన్నారు. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమకోసం అనేక కార్యక్రమాలను రూపొం దించడంతోపాటు ప్రోత్సా హకాలను కూడా అందిస్తున్నామన్నారు. దేశంలో వంట కోత వ్యర్థ సమస్యలతో రైతులు బాధపడుతున్నారన్నారు. పండ్లు, కూరగాయల రంగంలోనే 30 నుంచి 40 శాతం మేర ఫుడ్ ప్రాసెసింగ్ రంగం సమర్థ వినియోగం లేకపోవడం వల్ల నష్టపోతున్నామన్నారు. రవాణా, నిల్వ సామర్థ్యం, మార్కెటింగ్, ప్రాసెసింగ్ వంటి వాటి లభ్యత ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ గణనీయమైన పురోగతి సాధించగలుగుతామన్నారు. కోల్డ్ స్టోరేజ్ చైన్ కార్పొరేషన్ స్థాపన ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన విధానంలో చర్యలు తీసుకోగలుగుతున్నామన్నారు. ఆహార ఉత్పత్తులు వృథాను తగ్గించడం ద్వారా రైతులు పండించే పంటకు సరైన ఆదాయాన్ని అదనంగా అందించడం సాధ్యమవుతుందన్నారు. దేశంలోని మొత్తం రొయ్యల ఉత్పత్తుల్లో 70 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే ఉత్పత్తి అవుతున్నాయన్నారు.

రజత్ భార్గవ బదిలీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఢిల్లీలోని ఏపీభవన్ స్పెషల్ కమిషనర్‌గా చేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ బదిలీ అయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దినేష్‌కుమార్ గురువారం జీవో జారీ చేశారు. ఆయనకు ఏపీ ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖలో పోస్టింగ్ ఇవ్వనున్నారు. 1990 బ్యాచ్‌కు చెందిన భార్గవకు గతంలో విజయవాడ సబ్ కలెక్టర్‌గా, మున్సిపల్ కమిషనర్‌గా చేసిన అనుభవం ఉంది.

శుభ్రత కోసం ఉద్యమిద్దాం మొదటిపేజీ తరువాయి

తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై వుందని అన్నారు.. కరెంటు కోతను అధిగమించాం రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందని సీఎం అన్నారు. 2014 నాటికి కరెంటు కొరత ఉన్న మనరాష్ట్రంలో కరెంటు కొరతను అధిగమించామని, ప్రస్తుతం మన రాష్ట్రంలో మిగులు విద్యుత్ పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇది టీడీపీ ప్రభుత్వం ఘనతగా పేర్కొన్నారు. భవిష్యత్తులో కరెంటు చార్జీలు పెంచే ప్రసక్తిలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదకన జరుగుతున్నాయని అన్నారు. వంశధార నది నీటిని ఇచ్ఛాపురం వరకు తీసుకువస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేసి ఆయకట్టు ప్రాంతాన్ని మరింతగా విస్తరింపజేస్తామని పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం : రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ద్వారా సుమారు రూ.4వేల కోట్లు పెట్టుబడి పెట్టి మోసపోయిన 20 లక్షల మంది బాధితులకు త్వరలో న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. కోర్టు వ్యవహారాలు పూర్తయిన వెంటనే అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మి బాధితులకు పూర్తి మొత్తాలు చెల్లిస్తామని పేర్కొ న్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అత్యధిక బాధితులు ఉన్నారని చెప్పారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం అందించామని అన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులను స్వీకరించి ఆయా మొత్తాలను చెల్లించేందుకు ముంబైలోని ఓ ట్రస్టు ఆసక్తి చూపుతోందని, కోర్టు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ విషయం ఆలోచిస్తామని చెప్పారు.

పోషకాహారం బహుదూరం..

- కుదింపులో సబల పథకం
- బడిబయట బాలికలపై ఆంక్షలు....
- సర్కార్ స్పందనపై సర్వత్రా ఆసక్తి....



విశాలాంధ్ర అమరావతి : మహిళలలో రక్తహీనతకు పరిష్కార చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. నోటికందాల్సిన ఆహారాన్ని నిబంధనల పేరిట నిర్దాక్షిణ్యంగా లాగేస్తున్నారు. కేంద్రం పోషకాహార కార్యక్రమంలో నిబంధనలు మార్పు చేయడంతో కొత్త ఇబ్బందులు ఎదురుకానున్నాయి. రక్తహీనత సమస్యని అధిగమించేందుకు జాతీయ పోషకాహార కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికల కోసం అమలవుతున్న "సబల" ప్రాజెక్టు పరిధిలో కేంద్రం అనూహ్య కుదింపు విధించింది. దీనితో రాష్ట్ర పరిధిలో ఉన్న మొత్తంగా 55,607 అంగన్వాడీలలో ఇంటికి రేషన్ తీసుకెళ్తున్న 15 - 18 ఏళ్ళ లోపు బాలికలకు ఈ సదుపాయం నిలిచిపోనుంది. సబల పథకం కింద 11 - 14 మధ్య వయస్సు ఉన్న బాలికలు బడి బయట ఉన్న బాలికలకు మాత్రమే (డ్రాప్ ఔట్స్) అదనపు పోషకాలు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సవరించటమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 2.68 లక్షల మంది బాలికలు పోషకాహారం అందించే 'సబల'కి దూరం కానున్నారు. రక్తహీనత సమస్యని అధిగమించాలనే లక్ష్యంతో 2011 లో దేశవ్యాప్తంగా 200 జిల్లాల్లో సుమారు కోటి మంది కిశోర బాలికలకు అదనపు పోషకాహారాన్నందించేలా సబల కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా అమల్లోకి తెచ్చారు. అయితే తాజాగా ఈ కార్యక్రమాన్ని 'నేషనల్ న్యూట్రీషియన్ మిషన్' పరిధిలోకి తెచ్చారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలకు దీన్ని వర్తింప చేసే పనిలో కేంద్రం నిమగ్నమైంది. కాగా ఇప్పటికే కేంద్రం నిర్దేశించిన ప్రకారం 11 - 14 మధ్య వయసు బడి బయట వారికి మాత్రమే 'సబల' అమలు చేయాలని కేంద్రం రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

పథకం తీరుతెన్నులు.....

'సబల పథకం' ఎందరో బాలికలుకు వరదాయనిగా మారింది. రాష్ట్రంలో 11-14 సంవత్సరాల మధ్య ఉన్న 14వేల మంది బాలికలకు 15-18 మధ్య నుండే 2.68లక్షల మందికి 'సబల' చేయూతని అందిస్తుంది. వీరందరికి నెలలో 25 రోజులకు 3 కిలోల బియ్యం, అర కిలో కందిపప్పు, 16 గుడ్లు అందచేస్తున్నారు. కొద్దిరోజుల కిందటి వరకు ఒక్కొక్క బాలికకు రూ.5 కాగా, ఇటీవల కేంద్రం రూ. 9.50కి పెంచింది. 34 కోట్ల మేర నిధుల ఇందుకోసం వెచ్చిస్తుంది. అయితే ప్రస్తుత నిబంధనలతో 11-14 వయసు కలిగిన బడి బయట ఉన్న 14 వేల మంది బాలికలకు మాత్రమే 'సబల' రేషన్ అందనున్నది.

మరి వారి పరిస్థితేమిటి.....

ఇప్పటివరకు సబల కార్యక్రమం కింద పోషకాహారం పొందుతున్న 15-18 ఏళ్ళ బాలికల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటివి ఇవ్వటంతో పాటు పౌష్టికాహారం యొక్క విలువలను తెలియచేయటం సబల లక్ష్యం. ఏ బాలిక కూడా రక్తహీనత బారిన పడకుండా కాపాడటమే ధ్యేయంగా 'సబల'ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయి. అయితే వీరి విషయంలో అటు విద్యాశాఖ, ఇటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ కొంత నిర్లక్ష్య ధోరణి కనబరచటం వలనే బడిబయట ఉన్న పిల్లల సంఖ్యలో ఇబ్బందులు ఎదురౌతున్నట్లు తెలుస్తోంది. రెండు శాఖల సమన్వయంతో సబల వంటి కార్యక్రమాన్ని అమలు చేయాల్సి ఉంది. కానీ ఈ రెండు శాఖల నడుమ సమన్వయం కొరవడటంతో 15 ఏళ్లనుంచి 18 ఏళ్ళ బాలికలకు పోషకాహారాలు దూరమవుతున్నాయి. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో 15-18 ఏళ్ళ వయసు బాలికలకు పోషకాహారంతో పాటుగా వైద్య పరమైన అవగాహనాలు కూడా దూరం కానున్నాయి. విజయవంతంగా నిర్వహిస్తున్న పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి కిశోర బాలికల సంక్షేమానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాష్ట్ర సర్కారు స్పందిస్తేనే....

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 2.68 లక్షల మంది నష్టపోతున్న కిశోర బాలికలు, వారి సంక్షేమంపై చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. అత్యధిక శాతం మంది బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ తరుణంలో రక్తహీనత నివారణకు నిధులు కేటాయించి బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచాలి. అంగన్ వాడీలు ద్వారా ప్రస్తుతం ఎంత మంది అయితే పోషకాహారం పొందుతున్నారో వారందరికి లబ్ధి చేకూర్చాల్సిన ఆవశ్యకత ఉంది. సంబంధిత శాఖ అధికారులు పూర్తిస్థాయిలో చర్చించి సబల కార్యక్రమానికి రాష్ట్ర నిధులు కేటాయించి, రక్తహీనత బారినుంచి బాలికలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై చంద్రబాబు సర్కార్ ఏ విధంగా స్పందిస్తుందో అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

12
విజయవాడ
శుక్రవారం
05 జనవరి 2018
విశాలాంధ్ర
క్రీడలు

కోహ్లినే లక్ష్యం కాదు : ఫిలాండర్



కేప్‌టౌన్: సాధారణంగా టీమిండియాతో క్రికెట్ మ్యాచ్‌లంటే ప్రత్యర్థులందరి దృష్టి పరుగుల యంత్రం, ఛేజ్ మాస్టర్ విరాట్ కోహ్లిపైనే ఉంటుంది. అతడ్ని వీలైనంత తొందరగా పెవిలియన్‌కు పంపితే చాలు 50 శాతం విజయం సాధించినట్లే అని ఇప్పటికే ఎంతో మంది క్రికెటర్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎందుకంటే కోహ్లి మైదానంలో ఉంటే ఏ క్షణాన్నైనా మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేస్తాడని అందరికీ తెలిసిందే. ఐతే.. దక్షిణాఫ్రికా బౌలర్ ఫిలాండర్ మాత్రం తమ లక్ష్యం కోహ్లి ఒక్కడే కాదని, మొత్తం 11 మంది అని తెలిపాడు. భారత్-దక్షిణాఫ్రికా మధ్య శుక్రవారం తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఫిలాండర్ మీడియాతో మాట్లాడుతూ..'భారత్‌తో మేము బ్యాట్, బంతితో మాత్రమే ఆడతాం. అంతేకానీ జట్టులోని ఏ ఒక్క ఆటగాడి పేరుతో కాదు. ఆ జట్టులో మిగతా బ్యాట్స్‌మెన్‌ను ఎలా పరిగణలోకి తీసుకుంటామో కోహ్లినీ అంతే. ఒక్కో టెస్టులో అతన్ని రెండుసార్లు ఔట్ చేయాలి. భారత్ ఎక్కువ మ్యాచ్‌లను తన సొంత గడ్డపైనే ఆడింది. ఇప్పుడు విదేశీ పర్యటనకు వచ్చింది. ఇప్పుడు మా గడ్డపై ఎలా రాణిస్తుందో చూడాలి. భారత్ పిచ్‌లకు ఇక్కడి పిచ్‌లకు ఏమాత్రం పోలిక లేదు. కేప్‌టౌన్‌లో జరగబోయే మొదటి టెస్టులో ఎలా ఆడతారో చూద్దాం' అని ఫిలాండర్ అన్నాడు.

మేలు జరిగితే చాలు :విజయ్



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో శుక్రవారం నుంచి మొదలయ్యే మొదటి టెస్టులో తన తరహా ఆటను ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఓపెనర్ మురళీ విజయ్ ప్రకటించాడు. మ్యాచ్‌పై పాజిటివ్ దృక్పథంతోనే ఆడతానని, ఎలాంటి ఒత్తిడికి గురయ్యే ప్రసక్తే లేదని చెప్పాడు. 'క్రీజ్‌లోకి వెళ్లి విసిరిన బాల్‌ను చక్కగా కొట్టి మంచి గేమ్ ఆడాలని నా పథకం. దీంతో ఇండియాకు మేలు జరిగితే అదే చాలు' అని తెలిపాడు. మ్యాచ్ గురించి అతిగా ఆలోచించడం లేదనీ, రాబోయే రోజుల్లో ఏం జరిగితే అదే జరుగుతుందని తెలిపాడు. పరిస్థితులను పక్కనబెడితే పిచ్ పరిస్థితులు ఫాస్ట్‌బౌలర్లకు అనుకూలించేలా ఉన్నాయి కదా అని అడిగితే.. పేసర్లే కాదు.. స్పిన్నర్లకు కూడా అనుకులించే అవకాశం ఉందని తెలిపాడు. సరైన సమయంలో స్పిన్నర్లకు గనుక బౌలింగ్ ఇస్తే వాళ్లు కూడా వికెట్లు తీసే అవకాశం ఉంటుంది. దీంతో అది జట్టుకు మంచి ఉపయోగంగా మారుతుందని చెప్పాడు. క్రితంసారి కన్నా ఈసారి తను ఈ మ్యాచ్‌కు బాగా ప్రిపేపర్ అయ్యానని తెలిపాడు. ఇక పిచ్ గురించి మాట్లాడుతూ 'పిచ్ చూడ్డానికి గ్రీన్‌గా కనబడుతోంది. మొదటిరోజు ఎలా స్పందిస్తుందో చెప్పలేను. మొదట బ్యాటింగ్ చేసే ఆటగాళ్లు పేసర్లను ఎదుర్కోడం కష్టం. వ్యక్తిగతంగా అయితే పేస్‌ను ఎదుర్కొనే సత్తా నాకుంది. అయితే అనూహ్యంగ బాల్ తిరిగితే మాత్రం ఎవరూ ఏమీ చేయలేరని వివరించాడు.



మధ్యాహ్నం 2 గం॥కు
స్టార్‌స్పోర్ట్స్-1లో
ప్రత్యక్ష ప్రసారం

భారత్‌కు టెస్టు

నేటి నుంచి భారత్-దక్షిణాఫ్రికా టెస్టు మొదలు

- వరుస గెలుపులతో ఊపుమీదున్న టీమిండియా
- ఫాస్టు బౌలర్లే ఆయుధంగా ప్రోటీస్

స్వదేశంలో అప్రతిహత జైత్రయాత్ర చేసిన భారత్‌కు నేటి నుంచి సౌతాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా మరికొన్ని గంటల్లో రియల్ 'టెస్ట్' మొదలుకాబోతోంది. వరుస విజయాలతో ఊపుమీదున్న భారత్‌కు ఎలాగైనా కళ్లెం వేయాలని ప్రోటీస్ చూస్తోంటే, తమ జైత్రయాత్రను కొనసాగించాలని కోహ్లిసేన పట్టుదలగా ఉంది.

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా వేదికగా భారత్-దక్షిణాఫ్రికాల మధ్య మూడు టెస్టు సిరీస్‌ల మ్యాచ్ శుక్రవారం న్యూలార్డ్స్ గ్రౌండ్ వేదికగా ప్రారంభంకానున్నది. వరుస విజయాలతో ఊపుమీదున్న భారత్‌ను దక్షిణాఫ్రికా తక్కువ అంచనా వేయడం లేదు. సౌతాఫ్రికాలో భారత్ రికార్డుల పరంగా వెనుబడి ఉన్నా, స్వదేశంలో వరుసగా సిరీస్‌లు గెలిచి ఊపుమీదున్న టీమిండయా పేసర్లు, స్పిన్నర్‌లను దక్షిణాఫ్రికా పరీక్షించనున్నది. కేప్‌టౌన్, సెంచూరియన్, జొహెన్స్‌బర్గ్ వేదికగా జరిగే ఈ మూడు మ్యాచ్‌లు ఒకరకంగా కోహ్లిసేనకు రియల్ 'టెస్ట్' అని చెప్పవచ్చు. అయితే మొదటి టెస్టుకు ఆనందించదగ్గ పరిణామం ఏంటంటే... అరవీర భయంకరమైన బంతులు విసిరే దక్షిణాఫ్రికా ఆటగాళ్లకు ఈసారి న్యూలార్డ్స్ పిచ్ అంతగా అనుకూలించేలా కనబడటం లేదు. అక్కడ నెలకొన్న తీవ్ర నీటి కరవు పరిస్థితుల కారణంగా పచ్చిక పిచ్‌లను తయారు చేయలేకపో యినట్లు క్యూరేటర్ చెప్పిన విషయం తెలిసిందే. ఇది ఒకరకంగా కోహ్లిసేనకు కలిసొచ్చే అంశమే. ఎందుకంటే ఫాస్ట్‌ట్రాక్ పిచ్‌ను తయారు చేయలేని సందర్భంలో తప్పనిసరిగా పిచ్ స్పిన్నర్‌లకు అనుకూలిస్తుంది. దీంతో ప్రస్తుతం న్యూలార్డ్స్ పిచ్ ఇంచుమించుగా భారత్‌లోని పిచ్‌లను పోలిఉంటుంది. భారత్ పేసర్లయిన మొహ్మద్ షమీ, ఇషాంత్ శర్మ, భువనేశ్వర్ కుమార్‌లు పొడిబారిన పిచ్‌పై ఏ మేరకు ప్రభావం చూపగలరో చూడాలి. దీంతో స్పిన్నర్‌లపై భారం పడే అవకాశం ఉన్నప్పుడు ఈ క్రమంలో ముందుకు వచ్చేది రవీంద్ర జడేజా. భారత్ కనుక మొదట బ్యాటింగ్ తీసుకుంటే ఈ భారం కచ్చితంగా జడేజాపైనే పడే అవకాశం ఉంది. అనూహ్యంగా జడేజా మొదటి టెస్టుకు అందుబాటులో లేకపోవడంతో అతడి స్థానంలో రవిచంద్రన్ అశ్విన్ ఆడే అవకాశం ఉంటుంది. కాబట్టి అశ్విన్ స్పిన్నర్‌లను సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ఇక బ్యాటింగ్ విభాగంలో ముంబై జంట రోహిత్ శర్మ, అజింక్యా రహానె ఉన్నారు. వీరిద్దరూ హాట్‌సీట్ కోసం పోటీ పడుతున్నారు. అయితే ఇదంతా ప్రస్తుతమే. ఇక సిరీస్ ముందుకు సాగుతున్న కాలం ఎవరైనా ఈ హాట్‌సీట్‌కు పోటీపడే అవకాశం ఉంది. సౌతాఫ్రికాలో భారత్‌కు చాలా బలహీనమైన రికార్డు ఉంది. ఇప్పటి వరకూ ఆరు సిరీస్‌లు జరగ్గా వాటిలో ఐదుకోల్పోయి, ఒకటి మాత్రం డ్రాగా ముగిసింది. 1992 నుంచి సౌతాఫ్రికాగడ్డపై టీమిండియా 17 టెస్టు మ్యాచ్‌లు ఆడగా, కేవలం రెండింటిలోనే గెలుపొందింది. అదికూడా 2006-07లో ద్రవిడ్ సారథ్యంలో, 2010-11లో ధోనీ సారథ్యంలో విజయాలు దక్కాయి. 2013-14 టీంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఉన్న టీంలో అనుభవం, బలమైన బెంచ్ కనడుతోంది. దీంతో విజయావకాశాలు శాతం కూడా పెరిగే అవకాశం ఉంది.

జట్ల అంచనా

భారత్ : విరాట్ కోహ్లి (కెప్టెన్), శిఖర్‌ధావన్, మురళీ విజయ్, కేఎల్ రాహుల్, ఛెతేశ్వర్ పుజారా, అజింక్యా రహానె, రోహిత్ శర్మ, వృద్ధిమాన్ సాహా(వికెట్‌కీపర్), హార్దిక్ పాండ్య, ఆర్. అశ్విన్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, ఇషాత్ శర్మ, ఉమేష్ యాదవ్, మొహ్మద్ షమీ, జస్ప్రీత్ బూమ్రా, పార్థివ్ పటేల్.

దక్షిణాఫ్రికా : డుప్లెసిస్ (కెప్టెన్), డీన్ ఎలగర్, ఐడెన్ మార్‌క్రమం, హషీమ్ ఆమ్లా, తెంబా బావుమా, థూనిస్ డీ బ్రూయన్, క్వింటన్ డీకాక్ (వికెట్ కీపర్), కేశవ్ మహరాజ్, మోర్నీ మోర్కెల్, డేల్ స్టెయిన్, క్రిస్ మోరిస్, వెరోన్ ఫిలాండర్ కాగిసో రబద, యాండిలీ పెహ్‌లుక్వో



ధోనీ గ్రేడ్‌కు ఎసరు..?

న్యూఢిల్లీ: భారత మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ 'ఏ' గ్రేడ్‌కు బీసీసీఐ ఎసరు పెట్టినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించిన ధోనీని బీసీసీఐ అగ్రశ్రేణి కాంట్రాక్టులో ఉంచడంపై ఇప్పటికే పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తాజా కాంట్రాక్టులో అతడి పేరును అగ్రశ్రేణి నుంచి తప్పించాలని బీసీసీఐ అడ్మినిస్ట్రేషన్ కమిటీ(సీవోఏ) భావిస్తున్నట్లు సమాచారం. ఆటగాళ్ల జీతాలు పెంచాలని గత ఏడాది నవంబరు 30న సారథి విరాట్ కోహ్లి, ధోనీతో పాటు కోచ్ రవిశాస్త్రి బీసీసీఐ సీవోఏను కోరిన సంగతి తెలిసిందే. దీనిపై కసరత్తులు చేపట్టిన సీవోఏ కొన్ని మార్పులు, చేర్పులతో ఇప్పటికే తుది నివేదిక తయారు చేసిందట. దీన్ని త్వరలో బీసీసీ ఫైనాన్స్ కమిటీకి అందజేయనుంది. ఏ ప్లస్, ఏ, బీ, సీ ఇలా నాలుగు శ్రేణుల ద్వారా ఆటగాళ్లకు జీతాలు అందజేయాలనుకుంటుంది. ఈ తాజా నివేదికలో ధోనీ తన అగ్రశ్రేణి కాంట్రాక్టును కోల్పోయినట్లు తెలుస్తోంది. ఎందుకంటే అంతర్జాతీయ క్రికెట్‌లో టెస్టు, వన్డే, టీ20 ఈ మూడు ఫార్మాట్లు ఆడే ఆటగాళ్లను మాత్రమే ఏ ప్లస్ శ్రేణిలో చేర్చినట్లు సమాచారం. దీంతో టెస్టులకు వీడ్కోలు పలికిన ధోనీ అగ్రశ్రేణి కాంట్రాక్టును కోల్పోక తప్పదు. గతంలో టాప్ కాంట్రాక్టులో ఉన్న ఆటగాడికి వేతనంగా ఏడాదికి రూ.2 కోట్లు అందేవి. ఇప్పుడు ఇది భారీ మొత్తంలో పెరిగి రూ.5కోట్లకు పెరిగినట్లు సమాచారం. టెస్టుల్లో మాత్రమే ఆడుతోన్న రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-5లో కొనసాగుతున్నారు. దీంతో వీరికి టాప్ కాంట్రాక్టే దక్కనున్నట్లు సమాచారం. ఎవరు ఏ శ్రేణిలో చోటు దక్కించుకుని ఎంతెంత అందుకుంటారో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి ఉండాల్సిందే.

తలకిందులుగా త్రివర్ణ పతాకం



కేప్‌టౌన్: జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఏవైనా పోటీలు జరుగుతుంటే ఆతిథ్యం ఇస్తున్న దేశంతో పాటు ఆ టోర్నీలో పాల్గొన్న ఆయా దేశాల జాతీయ జెండాలు రెపరెపలాడుతూ కనిపిస్తుంటాయి. అలాగే క్రికెట్‌లో ఆతిథ్య దేశ జాతీయ జెండాతో పాటు ఆ దేశ క్రికెట్ బోర్డుకు సంబంధించిన జెండా, అలాగే పర్యాటక జట్టు జెండాలు మైదానంలో ఓ పక్కన ఎగురుతూ ఉంటాయి. ఇప్పుడు ఇదంతా ఎందుకంటే దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో మన త్రివర్ణపతాకాన్ని తిరగేసి ఎగురవేశారు. ఆ తర్వాత గుర్తించి సరి చేశారు. ప్రస్తుతం కోహ్లిసేన దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. కేప్‌టౌన్‌లో న్యూలాండ్స్‌లో టీమిండియా కొద్ది రోజుల నుంచి క్రమం తప్పకుండా ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటోంది. ఇరుజట్ల మధ్య మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జనవరి 5న మొదటి టెస్టు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కేప్‌టౌన్ మైదానాన్ని సిబ్బంది మ్యాచ్ కోసం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా మన దేశ త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. ఆ తర్వాత ఎవరో వచ్చి భారత పతాకాన్ని తప్పుగా ఉంచినట్లు గుర్తించి మైదానం సిబ్బందికి సూచించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది తమ తప్పును సరిదిద్దుకున్నారు. సిబ్బంది తప్పును సరిదిద్దుకునేలోపే ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం మొదలుపెట్టాయి.

రెండు నిమిషాలే స్నానం

కోహ్లిసేనకు దక్షిణాఫ్రికా సూచన



కేప్‌టౌన్: రెండు నిమిషాలు మాత్రమే స్నానం చేయాలని కోహ్లిసేనకు దక్షిణాఫ్రికా సూచించిందట. ఎందుకో తెలుసా! నీటి సమస్య కారణంగా. కేప్‌టౌన్‌లో నీటి సమస్య ఎక్కువగా ఉన్నందున టీమిండియా ఆటగాళ్లకు రెండు నిమిషాల కంటే ఎక్కువ సమయం స్నానం చేయవద్దని స్థానిక అధికారులు కోరారట. దీంతో ఆటగాళ్లు ఎప్పుడు స్నానం చేసినా రెండు నిమిషాలలోపే వచ్చేస్తున్నారట. దీనిపై ఓ మీడియా సంస్థ టీమిండియాలో ఓ ఆటగాడిని ప్రశ్నించగా.. 'మేము మ్యాచ్‌లు ఆడేందుకు వచ్చాం. బాగా ఆడాలి. విజయాలు సాధించాలి. అంతే మిగతా వాటి గురించి పట్టించుకోవల్సిన అవసరం లేదు' అని బదులిచ్చాడట. రోజూ ప్రాక్టీస్ అనంతరం ఆటగాళ్లు షవర్ల కింద కాసేపు సేద తీరేందుకు అవకాశం లేకపోయిందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన ప్రాంతాలతో పోల్చుకుంటే కేప్‌టౌన్‌లో ఈ సమయంలో నీటి సమస్య ఎక్కువగా ఉంటుందట. నీటి సమస్య కారణంగా పిచ్‌పై పచ్చికను పెంచే విషయంలోనూ సమస్య తలెత్తుతోందని గతవారం న్యూలాండ్స్ క్యూరేటర్ చెప్పిన సంగతి తెలిసిందే కదా.

ఫుట్‌బాల్ సీనియర్ చాంప్ నెల్లూరు

- రెండోస్థానంలో కృష్ణాజిల్లా
- సంతోష్ ట్రోఫీకి రాష్ట్ర జట్టు ఎంపిక
- 10 నుంచి అనంతపురంలో కోచింగ్ క్యాంప్

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: కృష్ణాజిల్లా మైలవరంలోని లకిరెడ్డి హనిమి రెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ (డీఎస్ఏ) క్రీడా శిక్షణ కేంద్రంలో జరిగిన మూడో అంతర్ జిల్లాల సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను నెల్లూరు జట్టు కైవసం చేసుకుంది. ఫైనల్స్‌లో ఆతిథ్య కృష్ణా జట్టుపై 3-1 గోల్స్ తేడాతో నెల్లూరు ఘన విజయం సాధించింది. మైలవరం డీఎస్ఏ క్రీడా శిక్షణ కేంద్రంలో మూడు రోజులపాటు జరిగిన ఫుట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా జిల్లాలోని పూర్తి గ్రామీణ వాతావరణంలో ఈ పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని 10 జిల్లాలు పాల్గొన్నాయి. లీగ్ కమ్ నాకౌట్ విధానంలో పోటీలను నిర్వహించారు. కృష్ణా, నెల్లూరు జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. తొలి అర్థభాగంలో నెల్లూరు ఒక్క గోల్‌తో ఆధిక్యంలో ఉండగా, రెండో అర్థభాగంలో కృష్ణా కూడా మరో గోల్‌ను సాధించింది. అయితే రెండో అర్థభాగంలో సుధాకర్ రెడ్డి మరో గోల్‌ను సాధించడంతో నెల్లూరు 2-1 గోల్స్‌తో ఆధిక్యంలో కొనసాగింది. ఆట మరో ఐదు నిమిషాల్లో ముగుస్తుందనగా సుధాకర్‌రెడ్డి రెండో గోల్‌ను సాధించి జట్టుకు 3-1 తేడాతో విజయాన్ని అందించాడు. అంతకుముందు సెమీ ఫైనల్స్‌లో నెల్లూరు జట్టు 2-0 గోల్స్ తేడాతో చిత్తూరుపై గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. రెండో సెమీ ఫైనల్స్‌లో కృష్ణా జట్టు టై బ్రేకర్‌లో 4-3 గోల్స్ తేడాతో తూర్పు గోదావరిపై ఘన విజయాన్ని సాధించి ఫైనల్స్‌కు చేరింది. నిర్ణీత సమయంలో ఆట ముగిసే సమయానికి రెండు జట్లు గోల్స్ ఏమీ చేయలేదు. దీంతో టై బ్రేకర్ నిర్వహించగా, కృష్ణా జట్టు నాలుగు గోల్స్‌ను, తూర్పు గోదావరి మూడు గోల్స్‌ను సాధించింది. తూర్పు గోదావరి జట్టు చివరి అవకాశం పూర్తయ్యేసరికి రెండు జట్లు 3-3తో సమంగా ఉన్నాయి. ఈ దశలో కృష్ణా జట్టు తప్పనిసరిగా గోల్ చేస్తేనే ఫైనల్స్‌కు చేరుతుంది. ఆ సమయంలో గోల్ వేసేందుకు వచ్చిన భూపతి సమయస్ఫూర్తిగా వ్యవహరించి గోల్‌ను సాధించాడు. ఈ పోటీలలో అద్భుత ప్రతిభ



కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి అనంతపురంలోని ఆర్‌డీటీ స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ జట్టు బెంగళూరులో ఈనెల 17 నుంచి జరగునున్న సంతోష్ ట్రోఫీ సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో ఏపీ జట్టు పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. విజేతగా నిలిచిన నెల్లూరు, రెండోస్థానం సాధించిన కృష్ణా జట్టుకు ఎన్‌ఆర్‌ఐ లకిరెడ్డి బాలిరెడ్డి ట్రోఫీలను అందజేశారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జె వెంకటేశ్వరరావు (కొండ), డీ జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. R.No.32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.